



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు


ఆడబిడ్డల భాగస్వామ్యంతోనే
జాతి పురోగతి
- సీఎం చంద్రబాబు
2

పరిటాల రవికి
సీఎం చంద్రబాబు నివాళి
2






## స్వచ్ఛాంధ్ర..

# మన జీవన విధానం కావాలి

- ఏడాది క్రితం ఉద్యమంలా ప్రారంభించాం
- ఇందులో భాగంగా రూ. 573 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు
- ప్రజలందరూ భాగస్వాములు కావాలి

2

- మార్చిలోగా మరో 70 స్వచ్ఛ రథాలు
- వచ్చే ఎన్నికల నాటికి నగరికి కృష్ణా జలాలు
- చిత్తూరు జిల్లా నగరిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

ఎవరెన్ని కుయుక్తులు పన్నినా..

## అమరావతి ఆగదు, ఆపలేరు

- ప్రపంచం మెచ్చేలా అభివృద్ధి చేస్తాం
- క్రెడిట్ చోరీ అంటున్న వారికి ఏం క్రెడిట్ ఉంది?
- ఐదేళ్ల రాక్షసపాలనతో రాష్ట్రం అతలాకుతలం
- నరకాసురుడు లాంటి వ్యక్తి మళ్లీ వస్తే నాశనమే
- నేడు సుపరిపాలనతో రాష్ట్రానికి వెల్లువలా పెట్టుబడులు
- ల్యాండ్ టైట్లింగ్ లాంటి దుర్మార్గపు చట్టాన్ని రద్దు చేసి ప్రజల ఆస్తుల్ని కాపాడాం
- చిత్తూరు జిల్లా నగరిలో సీఎం చంద్రబాబు

3



కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌తో
ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ 2

## అమరావతిలో
## జ్యోతిరావు పూలే స్మృతి వనం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత వెల్లడి
- ఏప్రిల్ 11న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన
- అన్ని జిల్లా కేంద్రాల్లోనూ బీసీ భవన్ల ఏర్పాటు
- అవసరమైన చోట్ల బీసీ స్టడీ సర్కిళ్ల నిర్మాణం
- త్వరలో బీసీ రక్షణ చట్టానికి తుదిరూపం
- పలు బీసీ సంఘాల ప్రతినిధులతో మంత్రి సవిత భేటీ

3



## పిల్లలను చూస్తే ముచ్చటేసింది

**- సోషల్ వెల్ఫేర్ హాస్టల్ సందర్శనపై సీఎం చంద్రబాబు**

అమరావతి (చైతన్యరథం): విద్యార్థులతో మమేకమై వారితో పలు అంశాలపై మాట్లాడటం ఎంతో ముచ్చటగా అనిపించిందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. చిత్తూరు జిల్లా నగరిలోని సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌ను సీఎం చంద్రబాబు శనివారం పరిశీలించారు. అనంతరం ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ఆ పిల్లలతో సంభాషించినప్పుడు.. వ్యర్థాల స్థిర నిర్వహణ, క్లీన్ ఎనర్జీ వంటి కొత్త విధానాలతో నెట్ జీరో పాజివిటీ భావనను అలవర్చుకుంటూ, ఆచరణలోకి తీసుకురావటం చూసి సంతోషంగానూ. అదే సమయంలో ఒకింత గర్వంగా అనిపించింది. అదే విధంగా ముస్తాబు కార్నర్‌ను చూసి ఎంతో ముగ్ధుడినయ్యాను. విద్యార్థుల్లో పరిశుభ్రతను ప్రోత్సహించేందుకు రూపొందించిన ఈ కార్యక్రమాన్ని వారు ఎంతో శ్రద్ధతో ఆచరిస్తున్నారు. తద్వారా వారిలో క్రమశిక్షణ అలవడుతుంది. వ్యాధుల నివారణకు దోహదపడుతుంది. ఇందుకు విద్యార్థులతో పాటు వారిని చక్కగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను, నిర్వాహకులను, సిబ్బందిని అభినందిస్తున్నా. తన సందర్శనలో భాగంగా హాస్టల్ ఆవరణలో ఒక మొక్కను కూడా నాటామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు.

## విదేశాల్లో ఏపీ హస్త 'కళ' కళ!

- రిపబ్లిక్ డే వేడుకల్లో అతిథులకు ఏపీ హస్తకళల గిఫ్ట్ ఇవ్వాలని సింగపూర్‌లోని భారత హై కమిషన్ నిర్ణయం
- లేపాక్షికి 400 గిఫ్ట్ బాక్సులకు ఆర్డర్
- ఏపీ హస్తకళలకు అంతర్జాతీయ గుర్తింపుపై మంత్రి సవిత హర్షం
- విదేశాల్లోనూ లేపాక్షి షో రూమ్‌లు ఏర్పాటు చేస్తామని వెల్లడి

11

## విశాఖ ఉత్సవ్
## అట్టహాసంగా ప్రారంభం

- 'సాగరం నుండి శిఖరం వరకు' నినాదంతో నిర్వహణ
- జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన మంత్రులు దుర్గేష్, వంగలపూడి అనిత, డోలా బాలవీరాంజనేయ స్వామి
- హెలికాప్టర్ రైడ్ తో ఆకాశంలో విన్యాసాలు
- సాగర తీరంలో పర్యాటకుల కేరింతలు

7

కేసీ కెనాల్ ఆయకట్టులో

## రెండో పంటకు సాగునీరు

- క్లిష్ట పరిస్థితుల్లోనూ విడుదల
- రైతులు నష్టపోకూడదనే ప్రభుత్వం నిర్ణయం
- అధికారులు పర్యవేక్షించాలని మంత్రి నిమ్మల ఆదేశం

11

చైతన్యరథం

# స్వచ్ఛాంధ్ర.. మన జీవన విధానం కావాలి

- ఏడాది క్రితం ఉద్యమంలా ప్రారంభించాం
- ఇందులో భాగంగా రూ. 573 కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు
- ప్రజలందరూ భాగస్వాములు కావాలి
- మార్చిలోగా మరో 70 స్వచ్ఛ రథాలు
- వచ్చే ఎన్నికల నాటికి నగరికి కృష్ణా జలాలు
- చిత్తూరు జిల్లా నగరిలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు



నగరి (చైతన్యరథం): స్వచ్ఛాంధ్ర అనేది మన జీవన విధానం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు ఇచ్చారు. చిత్తూరు జిల్లా నగరిలో శనివారం స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్రాజెక్టులకు శంకుస్థాపన చేశారు. వ్యర్థాల సేకరణ కోసం ఉద్దేశించిన స్వచ్ఛ రథాలను ప్రారంభించారు. ప్రజా వేదిక వద్ద ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లతో పాటు మెప్మా, డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. పలువురు పారిశుద్ధ్య కార్మికుల సేవలను అభినందిస్తూ సన్మానించారు. అనంతరం ప్రజా వేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ నగరిలో ఏర్పాటు చేసిన స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఏడాది క్రితం ఈ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలా ప్రారంభించాం. స్వచ్ఛాంధ్ర అనేది కేవలం ఒక ప్రభుత్వ కార్యక్రమం కాదు...ఇది మన జీవన విధానం.. జీవితంలో ఒక భాగం కావాలి. అందుకే ప్రతి నెలా 3వ శనివారం నాతో సహా నేతలు, అధికార యంత్రాంగం హాజరవుతున్నాం. సమైక్యాంధ్రలో ముఖ్యమంత్రిగా జన్మభూమి, పచ్చదనం-పరిశుభ్రత కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాను. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలి. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలో మొత్తం రూ.573 కోట్లతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు జరుపుకుంటున్నాం. స్వచ్ఛభారత్ మిషన్ అర్బన్ 2.0లో భాగంగా సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ కింద 101 ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్రాజెక్టులను రూ.510 కోట్లతో చేపడుతున్నాం. హౌస్ హోల్డ్ వేస్ట్ ప్రాసెసింగ్ కోసం రూ.2.21 కోట్ల విలువైన 9,048 హోం కంపోస్టింగ్ బిన్స్‌ను మెప్మా ఆర్పీలకు అందించాం. గ్రామాల్లో ఇంటింటికీ చెత్త సేకరణ కోసం స్వచ్ఛ భారత్ మిషన్ గ్రామీణ్ 2.0 కింద రూ.6.7 కోట్లతో 200 ఈ-ఆటోలు, 12,000 ట్రైసైకిళ్లు, 5,000 పుష్‌కార్ట్స్ సిద్ధం చేశాం. గతేడాది నుంచి స్వచ్ఛాంధ్ర కార్యక్రమం కింద విస్తృతంగా పరిశుభ్రతా డ్రైవ్‌లు చేపట్టాం. లెగసీ వేస్ట్ తొలగింపులో రికార్డులు సృష్టించాం. పట్టణాల్లో ఇప్పటి వరకు 105 లక్షల మెట్రిక్ టన్నుల పాత చెత్త తొలగించాం. గ్రామీణ ప్రాంతాల్లో 7 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను క్లియర్ చేస్తున్నాం. మార్చి 2026 నాటికి లెగసీ వేస్ట్ తొలగింపులో 100 శాతం లక్ష్యం చేరుకుంటాం. పట్టణాలో 97.26 శాతం ఇళ్ల నుంచి డోర్ టు డోర్ వేస్ట్ కలెక్షన్ చేస్తుండగా, అన్ని పంచాయతీల్లో వ్యర్థాల సేకరణ జరుగుతోంది. 62 శాతం ఇళ్లకు వెళ్లి చెత్తను సేకరిస్తున్నారు. ఈ మార్చి నాటికి పంచాయతీలు, పట్టణాల్లో 100 ఇళ్ల నుంచి డోర్ టు డోర్ కలెక్షన్ ఉంటుంది. వచ్చే నెలలో కర్నూలు, రాజమండ్రి, కడప, నెల్లూరులో 4 వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను పీపీపీ మోడల్‌లో చేపడుతున్నాం. రెండేళ్లలో ఇవి ఉత్పత్తి మొదలు పెడతాయి. విజయవాడ, తిరుపతికి కూడా వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ల ప్రతిపాదనలు ఉన్నాయి. ఇవి కార్యరూపం దాల్చితే ప్రజలకు డంపింగ్ యార్డ్ సమస్య ఉండదు. కాలుష్యం కూడా తగ్గుతుంది. సంపద తయారీ కేంద్రాలను 10,790 వరకు ఏర్పాటు చేశాం. స్వయం సహాయ సంఘాల భాగస్వామ్యంతో కంపోస్ట్ తయారవుతోంది. దాన్ని రైతులకు సరఫరా చేస్తాం. స్వచ్ఛ రథాలతో మీ ఇళ్లలోని డ్రై వేస్ట్, ప్లాస్టిక్, కాగితాలు వంటివి తీసుకుని నిత్యావసరాలు ఇస్తున్నాం. ఇప్పటివరకు 30 స్వచ్ఛరథాలు ఉన్నాయి. మరో 70 మార్చి నాటికి ప్రవేశ పెడతామని ముఖ్యమంత్రి తెలిపారు.

### ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీ

ప్రజలందరి సహకారంతో ప్లాస్టిక్ రహిత రాష్ట్రంగా ఏపీని తయారుచేయాలని సంకల్పించాం. 2018లోనే ఓడీఎఫ్ రాష్ట్రంగా ఏపీని నిలిపాం. ఇప్పుడు ఓడీఎఫ్ ప్లస్ రాష్ట్రంగా ఈ మార్చికి తీర్చిదిద్దుతాం. రాష్ట్ర సచివాలయంతో సహా 17 పట్టణ, నగరపాలక సంస్థల కార్యాలయాలు ఇప్పుడు పూర్తిగా ప్లాస్టిక్ వినియోగాన్ని నిలిపేశాయి. ఈ ఘనత సాధించిన విశాఖ, విజయవాడ, తిరుపతి, కాకినాడ, రాజమండ్రి, పాలకొండ, రాజాం, బొబ్బిలి, సత్తెన్నపల్లి, కుప్పం, చిత్తూరు, మార్కాపురం, సాలూరు, నరసరావుపేట, చిలకలూరిపేట, పుంగనూరు, పలమనేరు మున్సిపల్ కార్యాలయాలను అభినందిస్తున్నాను. ఐటీసీ సంస్థ భాగస్వామ్యంతో వెల్ బీయింగ్ అవుట్ అఫ్ వేస్ట్ అనే కార్యక్రమం కింద పాఠశాలల్లో అవగాహనా కార్యక్రమాలు చేపట్టాం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల్లో పరిశుభ్రత, క్రమశిక్షణ పెంపొందించడమే లక్ష్యంగా ముస్తాబు కార్యక్రమం అమలు చేస్తున్నాం. ఈ-వేస్ట్ కలెక్షన్ పాయింట్లు ఏర్పాటుచేసి 47 పట్టణ ప్రాంతాల నుంచి 30 టన్నుల ఈ-వేస్ట్ ఇప్పటి వరకు సేకరించాం. 13 నగరాల్లో రోడ్లు శుభ్రం చేసేందుకు ప్రత్యేకంగా 71 భారీ సర్వీసింగ్ మిషిన్లు వినియోగిస్తున్నాం. రోజుకు 108 మిలియన్ లీటర్ల మురుగు నీటి శుద్ధి కోసం 20 పట్టణ ప్రాంతాల్లో 33 ప్లాంట్లు చేపడుతున్నాం. త్వరలో మరో 82 ప్లాంట్లను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తాం. పుత్తూరు, నగరిలో నూటికి నూరు శాతం డ్రైన్స్ పూర్తి చేస్తాం. 111 గ్రామీణ ప్రాంతాల్లో మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణం జరుగుతోంది. 4 ఏళ్లలో 26 వేల కి.మీ. మ్యాజిక్ డ్రెయిన్లను గ్రామాల్లో నిర్మించి మురుగు నీటి సమస్యను పరిష్కరిస్తాం. రాష్ట్రంలో హోమ్ కంపోస్టింగ్, కిచెన్ గార్డెన్లు, టెర్రస్ గార్డెన్ల సంఖ్య పెరిగింది. వీటిని మరింతగా విస్తరించి 2026 మార్చి నాటికి 10 లక్షల కుటుంబాలు ఆర్గానిక్ వేస్ట్ మేనేజ్మెంట్ ఆచరించేలా ప్రోత్సహిస్తాం. సర్క్యులర్ ఎకానమీలో దేశానికి ఏపీ దారి చూపుతోందని ముఖ్యమంత్రి తెలిపారు.

### కుప్పం తరహాలో నగరి అభివృద్ధి

నగరి నియోజకవర్గం తెలుగుదేశానికి కంచుకోట. నా మిత్రుడు గాలి ముద్దుకృష్ణమ నాయుడు అనునిత్యం నగరి ప్రజల కోసం తపించేవారు. నగరిలో ఆ ఐదేళ్లూ అభివృద్ధి అంటే తెలియదు. ఇప్పుడు మంచి రోజులు మొదలయ్యాయి. 2029 ఎన్నికల నాటికి నగరికి కృష్ణా జలాలు తీసుకొచ్చే బాధ్యత నాది. అలాగే ఇక్కడి ప్రజలు వలసలు వెళ్లకుండా పరిశ్రమలు తీసుకొస్తాం. కుప్పం తరహాలో నగరి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు హామీ ఇచ్చారు. అనంతరం ప్రజావేదిక సభలో పీ4 కార్యక్రమంలో భాగంగా బంగారు కుటుంబాలను ఆదుకునేందుకు వచ్చిన మార్గదర్శులను సీఎం సన్మానించారు. పేదల అభ్యున్నతి కోసం చేపట్టిన ఈ కార్యక్రమానికి భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, స్థానిక శాసనసభ్యుడు గాలి భాను ప్రకాశ్ నాయుడు, ఎంపీ డి.ప్రసాదరావు తదితర నేతలు హాజరయ్యారు.

## కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌తో ముఖ్యమంత్రి చంద్రబాబు భేటీ

గన్నవరం విమానాశ్రయంలో కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌తో శనివారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్రమంత్రిని విమానాశ్రయంలోని వీఐపీ లాంజ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు కలిశారు. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై కేంద్రమంత్రితో సీఎం చర్చించారు. ఈ భేటీలో బీజేపీ ఏపీ చీఫ్ మాధవ్, రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎంపీ సీఎం రమేష్ కూడా పాల్గొన్నారు.







## ఆడబిడ్డల భాగస్వామ్యంతోనే జాతి పురోగతి

**- సీఎం చంద్రబాబు నాయుడు**

అమరావతి (చైతన్యరథం): జాతి నిర్మాణంలో బాలికలను క్రియాశీల భాగస్వామిగా నిలబెట్టడం సమష్టి బాధ్యత అని సీఎం చంద్రబాబు అన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని సీఎం చంద్రబాబు నాయుడు శనివారం ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. జీవితంలో విజయాలను సాధించేలా ఆడబిడ్డలకు సమాన అవకాశాలు వచ్చినప్పుడు, వారు సాధికారతను సాధించినప్పుడు, వారికి భద్రత లభించినప్పుడు మాత్రమే సమాజం ప్రగతి పథంలో సాగుతుందని తెలిపారు. బాలికల అభ్యున్నతి కోసం వారికి సమాన అవకాశాలు లభించేలా భరోసా కల్పిద్దామని పిలుపునిచ్చారు. వారి లక్ష్యాలను సాధించే శక్తి సామర్థ్యాలను సమకూర్చుకునేందుకు బాలికలకు తోడ్పాటు నిద్దామన్నారు. బాలికా సాధికారత లక్ష్యానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

## పరిటాలకు సీఎం చంద్రబాబు నివాళి

అమరావతి (చైతన్యరథం): మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 21వ వర్ధంతి సందర్భంగా ఆయనకు సీఎం చంద్రబాబు ఘన నివాళి అర్పించారు. పేద ప్రజల కోసం నిరంతరం కృషి చేసిన రవీంద్ర భౌతికంగా మనకు దూరం అయినా ఆయన పోరాటాలు ఎప్పటికీ గుర్తుంటాయన్నారు.

చైతన్యరథం

## ఎవరెన్ని కుయుక్తులు పన్నినా..

# అమరావతి ఆగదు, ఆపలేరు



- ప్రపంచం మెచ్చేలా అభివృద్ధి చేస్తాం
- క్రెడిట్ చోరీ అంటున్న వారికి ఏం క్రెడిట్ ఉంది?
- ఐదేళ్ల రాక్షసపాలనతో రాష్ట్రం అతలాకుతలం
- నరకాసురుడు లాంటి వ్యక్తి మళ్లీ వస్తే నాశనమే
- నేడు సుపరిపాలనతో రాష్ట్రానికి వెల్లువలా పెట్టుబడులు
- ల్యాండ్ టైట్లింగ్ లాంటి దుర్మార్గపు చట్టాన్ని రద్దు చేసి ప్రజల ఆస్తుల్ని కాపాడాం
- చిత్తూరు జిల్లా నగరిలో సీఎం చంద్రబాబు

నగరి (చైతన్యరథం): నేరస్థులు రాజకీయాలు చేస్తే ఏమవుతుందో ఐదేళ్ల వైసీపీ పాలనలో చూశామని, మంచి-చెడుకి వ్యత్యాసం ఏంటో ప్రజలు తెలుసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు. చెడ్డ వ్యక్తులను ప్రోత్సహిస్తే సమాజానికి హాని జరుగుతుందని, స్వచ్ఛమైన ఆలోచనలు ఉంటేనే భవిష్యత్ బాగుంటుందన్నారు. చిత్తూరు జిల్లా నగరిలో శనివారం స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. వివిధ కార్యక్రమాల అనంతరం ప్రజా వేదిక సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ 2024 ఎన్నికలకు ముందు రాష్ట్రం అతలాకుతలమైందని, ప్రజలు మాట్లాడాలన్నా.. నవ్వాలన్నా భయపడే పరిస్థితి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సుపరిపాలనతో పరిస్థితులను చక్కదిద్దుతున్నామన్నారు. 18 నెలల్లోనే రూ.20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి వచ్చాయంటే.. సమర్థ పాలనకు నిదర్శనమని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**రాక్షస పాలన నుంచి విముక్తి**

ఐదేళ్ల వైసీపీ రాక్షస పాలన వల్ల రాష్ట్రం అతలాకుతలమైంది. ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ కూడా లేకుండా చేశారు. నన్ను అక్రమంగా అరెస్ట్ చేశారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడి ఎన్నికలకు వెళ్లాం. 94 శాతం స్ట్రైక్ రేటుతో విజయం సాధించాం. గత పాలనలో అమరావతిపై మూడు ముక్కలాట ఆడారు. శ్మశానం, ఎడారి అన్నారు. ఇప్పుడూ ప్రెస్ మీట్లు పెట్టి క్రెడిట్ చోరీ చేశామని పచ్చి అబద్ధాలు చెబుతున్నారు. క్రెడిట్ చోరీ అంటున్నవారికి అసలు ఏం క్రెడిట్ ఉంది? రాజధానిపై విషం చిమ్ముతున్నారు. నాపై నమ్మకంతో 29 వేల మంది రైతులు 33 వేలు ఎకరాల భూమి రాజధాని కోసం ఇచ్చారు. ఎవరెన్ని కుయుక్తులు పన్నినా.. అడ్డంకులు సృష్టించినా అమరావతిని అడ్డుకోలేరు. ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి శాశ్వతంగా ఉంటుంది. ఆనాడు సైబరాబాద్ నగరాన్ని నిర్మించాను. నేడు అమరావతి నగరాన్ని నిర్మించే అవకాశం ప్రజలు ఇచ్చారు. ప్రపంచం మెచ్చే రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేస్తాం. అభివృద్ధి వికేంద్రీకరణ చేస్తూ అన్ని ప్రాంతాలను ప్రగతిపథంలో నడిపిస్తాం. ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ సూపర్ హిట్ చేశాం. పేదల సేవలో, తల్లికి వందనం, స్త్రీ శక్తి, దీపం 2, అన్నదాత సుఖీభవ వంటి ఎన్నో పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని సీఎం చంద్రబాబు అన్నారు.

**సమర్థ నాయకత్వం ఉంటేనే..**

సమర్థ నాయకత్వం ఉంటే ప్రజల జీవితాల్లో విప్లవాత్మక మార్పులు వస్తాయి. చెడు చేసినవారిని గుర్తుపెట్టుకుని.. మంచి చేస్తున్నవారిని ప్రోత్సహించాలి. ఎన్నికలకు ముందు కరెంట్ ఛార్జీలు పెంచనని చెప్పా. హామీకి కట్టుబడి ఉన్నా. భవిష్యత్‌లో కరెంట్ ఛార్జీలు పెంచబోమని హామీ ఇస్తున్నాను. యూనిట్ కి 39 పైసలు ఖర్చు తగ్గించాం. గత ప్రభుత్వంలో రూ.32 వేల విద్యుత్ ఛార్జీల భారం ప్రజలపై మోపారు. రూ.1.20 లక్షల కోట్లు అప్పులు పెట్టారు. నేడు రూ.4,600 కోట్ల ట్రూఫ్ అఫ్ ఛార్జీలు వేస్తే వాటిని ప్రభుత్వమే భరిస్తోంది. మూడేళ్లలో కరెంటు కొనుగోలు ధరను కూడా గణనీయంగా తగ్గిస్తాం. గతంలో చెడు ఆలోచనలు పెట్టుకుని నేరస్థులు రాజకీయాలు చేసి రాష్ట్రానికి భవిష్యత్ లేకుండా చేశారు. ఆ పరిస్థితిని చక్కదిద్దుతున్నామని సీఎం తెలిపారు.

**ప్రజల భూమికి భద్రత కల్పించాం**

భూమి అంటే ప్రజలకు సెంటిమెంట్. అలాంటి భూమికి గత ప్రభుత్వంలో భద్రత లేకుండా చేశారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో, 22 ఏ అక్రమాలతో ప్రజలతో వికృత క్రీడ ఆడారు. సర్వే రాళ్లు, పాస్ పుస్తకాలపై ఫొటోలు వేసుకోవడం కోసం రూ. 700 కోట్ల ప్రజాధనం దుర్వినియోగం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక భూ సమస్యలు పరిష్కరించాం. రాజ ముద్రతో ప్రజల ఆస్తులకు భద్రత కల్పించేలా పట్టాదారు పాసు పుస్తకాలు ఇస్తున్నాం. గత ప్రభుత్వం ఇరిగేషన్ వ్యవస్థను సర్వ నాశనం చేసింది. ఒక్క రూపాయి కూడా ఖర్చు పెట్టలేదు. రాయలసీమను రాళ్ల సీమగా మార్చారు. పోలవరం డయాఫ్రమ్ వాల్‌ను గోదావరిలో కలిపేశారు. 2027 నాటికి పోలవరం పూర్తిచేస్తాం. గోదావరి జలాలు సీమకు వస్తే నీటి సమస్య ఉండదు. గత ప్రభుత్వంలో కేంద్ర నిధులను పక్కదారి పట్టించారు. కేంద్ర పథకాలను నిర్వీర్యం చేశారు. జల జీవన్ మిషన్‌లో రూ. లక్ష కోట్లు వాడుకునే అవకాశం ఉన్నా అసమర్థతతో వదిలేశారు. రాష్ట్రమంతా గంజాయిని ప్రోత్సహించి యువత భవిష్యత్‌ను నాశనం చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈగల్ వ్యవస్థతో గంజాయిపై ఉక్కుపాదం మోపాము. గత పాలనలో ప్రభుత్వ ఉద్యోగులకు పెట్టిన బకాయిలను కూటమి అధికారంలోకి రాగానే విడతల వారీగా చెల్లించాం. అన్న క్యాంటీన్ల ద్వారా పేదల ఆకలి తీరుస్తున్నాం. తిరుమల శ్రీవారి ప్రసాదాన్ని కూడా కల్తీ చేసిన వారిని ఏం చేయాలి? తాత్కాలిక ప్రయోజనాల కోసం చెడు వ్యక్తులను ప్రోత్సహిస్తే సమాజానికి హాని జరుగుతుంది. నేను రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి త్వరలో 50 ఏళ్లు పూర్తవుతోంది. క్రమశిక్షణతో, విలువలతో కూడిన రాజకీయమే చేస్తున్నా అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# అమరావతిలో జ్యోతిరావు పూలే స్మృతి వనం

- రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత వెల్లడి
- ఏప్రిల్ 11న సీఎం చంద్రబాబు చేతుల మీదుగా శంకుస్థాపన
- అన్ని జిల్లా కేంద్రాల్లోనూ బీసీ భవన్ల ఏర్పాటు
- అవసరమైన చోట్ల బీసీ స్టడీ సర్కిళ్ల నిర్మాణం
- త్వరలో బీసీ రక్షణ చట్టానికి తుదిరూపం
- పలు బీసీ సంఘాల ప్రతినిధులతో మంత్రి సవిత భేటీ



విజయవాడ (చైతన్యరథం): అమరావతిలో మహాత్మా జ్యోతిరావు పూలే స్మృతి వనం నిర్మించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. వచ్చే ఏప్రిల్ 11వ జ్యోతిరావు పూలే 200వ జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా పూలే స్మృతి వనం నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. అన్ని జిల్లా కేంద్రాల్లోనూ బీసీ భవన్‌లు నిర్మించనున్నామన్నారు. బీసీ స్టడీ సర్కిళ్లు లేనిచోట్ల నూతన స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అమరావతిలో ఐదెకరాల్లో రాష్ట్ర స్థాయి బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు. రాష్ట్రంలో పలు బీసీ సంఘాల నేతలతో విజయవాడలోని గొల్లపూడి బీసీ భవన్‌లో మంత్రి సవిత శనివారం సమావేశమయ్యారు. 19 నెలల కూటమి పాలనలో బీసీల అభ్యున్నతికి అమలు చేసిన పథకాలతో పాటు త్వరలో చేపట్టబోయే అభివృద్ధి కార్యక్రమాలను మంత్రి వివరించారు. ఏయే పథకాలు అమలు చేస్తే బీసీలకు మరింత ఆర్థిక దన్ను లభిస్తోందో సంఘాల వారీగా అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సంఘాల నాయకులు తమ అభిప్రాయాలను మంత్రి సవిత దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, టీడీపీతోనే బీసీలకు ఆర్థిక, సామాజిక, రాజకీయ గుర్తింపు లభించిందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అన్న ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారన్నారు. మహిళలకు, బీసీలకు పాలనలో భాగస్వాములను చేసిన ఘనత ఎన్టీఆర్ దేనన్నారు. ఆయన స్ఫూర్తితో పాలన సాగిస్తున్న సీఎం చంద్రబాబునాయుడు బీసీలను అక్కున చేర్చుకున్నారన్నారు. బీసీ కుల వృత్తిదారులకు భరోసా ఇచ్చేలా సీఎం చంద్రబాబునాయుడు ఆదరణ, ఆదరణ 2.0 అమలు చేశారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో, త్వరలో రూ.1000 కోట్లతో ఆదరణ 3.0 పథకం అమలు చేయనున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు.

**అమరావతిలో జ్యోతిరావు పూలే స్మృతి వనం**

అణగారిన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిరావు పూలే స్మృతి వనాన్ని అమరావతిలో ఏర్పాటు చేయనున్నట్లు మంత్రి సవిత ప్రకటించారు. వచ్చే ఏప్రిల్ 11వ తేదీన జ్యోతిరావు పూలే 200వ జయంతి భారీ ఎత్తున నిర్వహించనున్నామన్నారు. అదే రోజు జ్యోతిరావు పూలే స్మృతి వనానికి సీఎం చంద్రబాబునాయుడు చేతుల మీదుగా భూమి పూజ చేయనున్నామన్నారు. అమరావతిలో ఐదెకరాల్లో బీసీ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ బీసీ స్టడీ సర్కిల్ కు మహాత్మా జ్యోతిరావు పూలే పేరు పెట్టనున్నామన్నారు.

**త్వరలో బీసీ రక్షణ చట్టం**

బీసీలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో భాగంగా బీసీల ఆత్మగౌరవానికి భంగం కలగనీయకుండా త్వరలో బీసీ రక్షణ చట్టం తీసుకురానున్నట్లు మంత్రి సవిత వెల్లడించారు. ఈ చట్ట రూపకల్పనకు తుది రూపు ఇస్తున్నట్లు తెలిపారు. బీసీలకు మేలు చేసేలా ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామన్నారు. తల్లికి వందనం పథకం వల్ల ఎక్కువగా లబ్ధి పొందింది బీసీ బిడ్డలేనన్నారు. బీసీ హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్లు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. బీసీ బిడ్డల సాంకేతిక విద్య కోసం కంప్యూటర్ లేబ్ లు ఏర్పాటు చేశామన్నారు. బీసీ యువత ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిరపడాలన్న లక్ష్యంతో సివిల్ సర్వీసెస్, మెగా డీఎస్సీ కోసం ఉచిత కోచింగ్ అందజేశామన్నారు. ప్రస్తుతం రెండో విడత బ్యాచ్ కు సివిల్స్ కోచింగ్ అందజేస్తున్నామన్నారు.

**డెడికేషన్ కమిటీ ఏర్పాటుకు నిర్ణయం**

డీఎన్టీ కులాలకు గుర్తింపు కార్డులు అందజేయాలని మంత్రి సవిత దృష్టికి బీసీ సంఘాల ప్రతినిధుల తీసుకొచ్చారు. దీనిపై మంత్రి స్పందిస్తూ, ఈ అంశం ఇప్పటికే సీఎం చంద్రబాబునాయుడు దృష్టిలో ఉందని, డీఎన్టీ కులాల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కుల గణనకు త్వరలో డెడికేషన్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. బీసీల సమస్యల పరిష్కారానికే ఈ సమావేశం నిర్వహించినట్లు మంత్రి సవిత స్పష్టంచేశారు. ఈ సమావేశంలో వివిధ బీసీ సంఘాల ప్రతినిధులు యరసాని నాగేశ్వరరావు, వై.నూకాలమ్మ, ఎల్.వెంగళరావు, ఏ. ఆదిశేషు, వీరవల్లి శ్రీనివాసులు, బత్తుల రమణయ్య, పి. జయప్రకాశ్, ఏ.వరప్రసాద్ యాదవ్, బి.వెంకటరమణరాజు, ఎస్.గోపాల్, ఎస్.నాగరాజు, అవుల శీరశేఖర్ యాదవ్, పూసల రవి, జె.శ్రీనివాస్ గౌడ్, డి.మల్లికార్జునరావు, టి.చక్రవర్తి, తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం




# స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో సీఎం చంద్రబాబు

చిత్తూరు జిల్లా నగరిలో శనివారం జరిగిన స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. వ్యర్థాల సేకరణకు ఏర్పాటు చేసిన స్వచ్ఛ రథాలను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించి మెప్మా, డ్వాక్రా మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం నగరిలో అమృత్ 2.0 కింద రూ.20.13 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. నగరి మున్సిపాలిటీలో నీటి సరఫరా పథకం మెరుగుదలకు రూ.13.96 కోట్లు, కాలనీ ప్రాంతాలకు నీటి సరఫరా మౌలిక సదుపాయాల కల్పనకు రూ. 3.97 కోట్లు, నగరి మున్సిపాలిటీ పరిధిలోని సాయిబాబా ఆలయం సమీపంలో ఉన్న సురగుంట చెరువు పునరుద్ధరణ రూ. 2.20 కోట్లతో పనులు చేపట్టేందుకు శంకుస్థాపనలు చేశారు. అనంతరం ప్రజావేదిక సభలో పాల్గొని ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

























# సీఎం చంద్రబాబుకు నగరిలో ఘన స్వాగతం

స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొనేందుకు చిత్తూరు జిల్లా నగరి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి శనివారం ఘన స్వాగతం లభించింది. కూటమి మంత్రులు, ఎమ్మెల్యేలు, నేతలు, అధికారులు ఆయనకు సాదర స్వాగతం పలికారు.









# నగరి నేతలు, కార్యకర్తలతో సీఎం సమీక్ష

చిత్తూరు జిల్లా నగరిలో శనివారం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు అనంతరం నియోజకవర్గ టీడీపీ కార్యకర్తలు, నాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.








# హాస్టళ్లను పరిశీలించిన సీఎం చంద్రబాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శనివారం నగరిలో బాలుర, బాలికల పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ హాస్టళ్లను సందర్శించారు. నెట్ జీరో కాన్సెప్ట్‌పై విద్యార్థుల్లో అవగాహన కల్పించారు. సాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్ మేనేజ్మెంట్ కేంద్రాలు, నెట్ జీరో ఎలక్ట్రిసిటీలో భాగంగా స్కూలుపై ఏర్పాటు చేసిన సోలార్ రూఫ్ టాప్, కంపోస్ట్ పిట్, ముస్తాబు కార్నర్‌ను సీఎం పరిశీలించి విద్యార్థులతో సంభాషించారు. హాస్టల్స్ రూమ్‌లు, కిచెన్ రూములను పరిశీలించారు.















### అద్దంకిలో విద్యార్థులకు..

# ఉచిత సైకిళ్ల పంపిణీ మార్చినాటికి పూర్తి

- ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 11 వేల విద్యార్థులకు లబ్ధి
- దాతల సాయంతో నియోజకవర్గంలో సైకిళ్ల పంపిణీ
- వెయ్యి ఎకరాల్లో సోలార్ ప్యానెల్ పరిశ్రమ ఏర్పాటు
- ఇంధనశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్




అద్దంకి (చైతన్యరథం): మార్చి నాటికి అద్దంకి నియోజకవర్గంలో ప్రభుత్వం పాఠశాలల్లో చదివే విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయడం పూర్తి అవుతుందని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 11 వేల మంది విద్యార్థులకు సైకిళ్లను అందజేయడం లక్ష్యంగా పని చేస్తున్నామని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు. విద్యార్థులు చదువుల కోసం రెండు మూడు కిలో మీటర్లు నడిచి వెళ్లడం చూడలేక ఈ ఉచిత సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి వివరించారు. శనివారం నాడు ప్రకాశం జిల్లా అద్దంకి నియోజకవర్గం బల్లికురువ మండలంలోని కూకట్లపల్లి గ్రామంలో పర్యటించిన మంత్రి గొట్టిపాటి.. గ్రామ పంచాయతీ పరిధిలోని సంఘం ప్రాంతంలో ఆర్ఓ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. ఆ తరువాత బల్లికురువ మండలానికి సంబంధించి ఏర్పాటు చేసిన స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు. అనంతరం కూకట్లపల్లి గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో 113 మంది విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లను పంపిణీ చేశారు. అంతరం గ్రీవెన్స్ నిర్వహించి స్థానిక ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని, వీలైనంత త్వరగా అర్జీల సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా మంత్రి గొట్టిపాటి రవి కుమార్ మాట్లాడుతూ దాతల సహకారంతోనే నియోజకవర్గం వ్యాప్తంగా విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. విద్యార్థులు చదువుకు ఆటంకం లేకుండా పాఠశాలలకు చేరుకునేలా ఈ కార్యక్రమం ఉపయోగపడుతోందని అన్నారు. మార్చి నాటికి నియోజకవర్గంలో మొత్తం 11 వేల సైకిళ్ల పంపిణీని పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సూచనల మేరకు రాజకీయ రంగులు, గుర్తులు లేకుండా పూర్తిగా విద్యార్థుల లబ్ధినే లక్ష్యంగా పెట్టుకొని ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని చెప్పారు. విద్య రాజకీయాలకు అతీతమని, ప్రతి విద్యార్థికి సమాన అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా మంత్రి లోకేష్ ఆధ్వర్యంలో ప్రతి పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, యూనిఫాంలు అందిస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలనే లక్ష్యంతో ఉపాధ్యాయులు మరింత బాధ్యతతో పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యంగా నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. మెరుగైన విద్యావ్యవస్థ కోసం మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయుల భర్తీ చేపట్టామని, దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో బోధన నాణ్యత మరింత మెరుగవుతుందని మంత్రి అన్నారు. అన్ని విద్యాసంస్థల్లో చదువుతున్న అర్హత గల విద్యార్థుల తల్లులకు 'తల్లికి వందనం' పథకం కింద రూ.13 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. ఈ పథకం ద్వారా తల్లులకు గౌరవం కల్పించడమే కాకుండా, పిల్లల విద్యకు మరింత బలం చేకూరుస్తున్నామని మంత్రి గొట్టిపాటి పేర్కొన్నారు.

అద్దంకి ప్రాంతం పారిశ్రామిక అభివృద్ధి దిశగా కీలక అడుగులు వేస్తున్నామని, 1000 ఎకరాల్లో సోలార్ ప్యానెల్ తయారీ పరిశ్రమ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. దీని ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అన్నారు. భవిష్యత్తులో ఉద్యోగాల కోసం యువత రాష్ట్రాన్ని విడిచి వెళ్లాల్సిన పరిస్థితి రాకుండా, ఇక్కడే పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు.

సైకిళ్ల పంపిణీ కార్యక్రమంలో అసిస్ట్ ఎన్జీఓ అందించిన సహకారం మరవలేనిదని మంత్రి తెలిపారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి, నిరంతరంగా తోడ్పాటు అందిస్తున్న అసిస్ట్ ఎన్జీఓ సేవలను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. తన వంతు బాధ్యతగా కిషోర్ గ్రానైట్స్ సంస్థ ద్వారా వెయ్యి సైకిళ్లు అందిస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రైవేట్ సంస్థలు, దాతలు ముందుకు రావడం అభినందనీయమని తెలిపారు.

# టిడ్కో గృహ లబ్ధిదారులను ముంచేసిన జగన్

- ఇళ్లు అప్పగించకుండా అప్పుల భారం మోపారు
- మంత్రి నిమ్మల రామానాయుడు ధ్వజం
- పాలకొల్లులో అభివృద్ధి పనుల పరిశీలన



పాలకొల్లు (చైతన్యరథం): పేదలు, మహిళల సొంత ఇంటి కల నెరవేర్చేలా గత టీడీపీ ప్రభుత్వం 100శాతం మేర టిడ్కో గృహాలను నిర్మిస్తే వైసిపి ప్రభుత్వంలో ఆ గృహాలను బ్యాంకులో తాకట్టు పెట్టి లబ్ధిదారుల నెత్తిన జగన్ అప్పుల భారం మోపాడని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ధ్వజమెత్తారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలో శనివారం ఆయన కూటమి నాయకులతో కలిసి రూ. కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయా పనుల వద్ద సంబంధిత అధికారులకు, ఏజెన్సీలకు పలు సూచనలు చేశారు. అబ్దుల్ కలాం పార్క్ వద్ద రూ.కోటితో ప్రహరీ గోడ, ఇతర అభివృద్ధి పనులకు మంత్రి రామానాయుడు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత వైసీపీ విధ్వంస పాలన నుంచి నేడు అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నామని అందుకు పాలకొల్లులో రూ.కోట్లతో జరుగుతున్న అభివృద్ధి పనులే నిదర్శనం అన్నారు. టిడిపి ప్రభుత్వ హయాంలో పూర్తయిన గృహాలకు వైసీపీ రంగులు వేసుకొని బ్యాంకులో తాకట్టు పెట్టుకుందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో కనీసం రూపాయి ఖర్చు గానీ, సిమెంట్ బస్తా పని గానీ చేపట్టలేదన్నారు. కనీసం బ్యాంకు నుంచి లబ్ధిదారుల పేరుతో తీసుకున్న రుణం సొమ్మును మిగిలిన ఇళ్ళు పూర్తి చేసేందుకు కూడా ఖర్చు చేయకుండా వైసీపీ ప్రభుత్వం లబ్ధిదారులను మోసగించిందన్నారు. టిడ్కో ఇళ్లుపూర్తి చేసి లబ్ధిదారులందరికీ అందించేలా కూటమి ప్రభుత్వం దృష్టి పెట్టిందని, అందులో భాగంగా పనులు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి ప్రధాన అజెండాగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పనిచేసే కూటమి ప్రభుత్వాన్ని మరో 20 ఏళ్లు ఉండేలా ఆశీర్వదించాలని ప్రజలను మంత్రి కోరారు.

ముందుగా పాలకొల్లులో రూ. కోట్లతో శరవేగంగా జరుగుతున్న క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్, టిడ్కో గృహాలు, టిడ్కో గృహాల కాలనీ వద్ద నరసాపురం ప్రధాన కాలవపై వంతెన నిర్మాణం, పాలకొల్లు వంద పడకల ప్రభుత్వాసుపత్రి నూతన భవనం, డాక్టర్ అబ్దుల్ కలాం పార్కు వంటి అభివృద్ధి పనులను మంత్రి రామానాయుడు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయ సారథి, కూటమి నాయకులు పెచ్చేట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, బోనం చిన్నబాబు, తులా రామలింగేశ్వర రావు, జక్కంపూడి కుమార్, వల్లభు శ్రీనివాస్, పొట్నూరు శ్రీనివాస్, బిరుదుకోట శేఖర్, మల్లంపల్లి పకీర్ బాబు, విన్నకోట గోపి, మండేల రాంప్రసాద్, ముప్పిరి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా ప్రారంభమైన విశాఖ ఉత్సవ్

- 'సాగరం నుండి శిఖరం వరకు' నినాదంతో నిర్వహణ
- జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన మంత్రులు కందుల దుర్గేష్, వంగలపూడి అనిత, డోలా బాలవీరాంజనేయ స్వామి
- హెలికాప్టర్ రైడ్ తో ఆకాశంలో విన్యాసాలు
- సాగర తీరంలో పర్యాటకుల కేరింతలు

విశాఖపట్నం (చైతన్యరథం): ఉత్తరాంధ్ర సాంస్కృతిక వైభవాన్ని, ప్రకృతి సౌందర్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా 'విశాఖ ఉత్సవ్' శనివారం సముద్ర తీరాన అత్యంత వైభవంగా ప్రారంభమైంది. 'సాగరం నుండి శిఖరం వరకు' అనే నినాదంతో నిర్వహిస్తున్న ఈ వేడుకలను రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్, హోం మంత్రి వంగలపూడి అనిత, జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి శ్రీడోలా బాలవీరాంజనేయ స్వామి కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి అధికారికంగా ప్రారంభించారు. ఉత్సవాల్లో భాగంగా తొలుత నిర్వహించిన భారీ ర్యాలీలో మంత్రులు స్వయంగా పాల్గొన్నారు. ఆర్కే బీచ్ వేదికగా జరిగిన కార్నివాల్, ఉత్తరాంధ్ర జానపద కళారూపాల ప్రదర్శనలు పర్యాటకులను మంత్రముగ్ధులను చేశాయి. ఈ ఏడాది ఉత్సవాల్లో హెలికాప్టర్ రైడ్స్, పారా గ్లయిడింగ్, బోటింగ్, అడ్వెంచర్ స్పోర్ట్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పర్యాటకులు ఆకాశ వీధుల నుండి విశాఖ అందాలను చూసి పులకించిపోయారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఆర్కే బీచ్ వద్ద ఏర్పాటు చేసిన ఫైర్ క్రాకర్స్ షో (బాణసంచా ప్రదర్శన) ఆకాశంలో రంగుల విందు చేసింది. ప్రధాన వేదికను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, సాంస్కృతిక ప్రదర్శనలకు వేదికగా మార్చారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా ప్రముఖ యాంకర్ సుమ వ్యవహరించారు. స్థానిక కళాకారులను ప్రోత్సహించేలా ప్రభుత్వం చేసిన ప్రత్యేక ఏర్పాట్లపై పర్యాటకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. విశాఖ ఖ్యాతిని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లడమే ఈ ఉత్సవాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను ప్రజలందరూ ఆస్వాదించాలని కోరారు.



చైతన్యరథం

# నంద్యాలలో ట్రాఫిక్ నియంత్రణపై మంత్రి ఫరూక్ దృష్టి

- రూ.3 కోట్లతో చామ కాల్వపై బ్రిడ్జి నిర్మాణం
- ఎన్‌కే రోడ్డు-ఎన్జీవో కాలనీకి నేరుగా అనుసంధానం
- శ్రీరామ థియేటర్ వెనుక డీఎల్‌ఆర్‌బీ నిర్మాణానికి నిధులు
- వరదలకు ఇబ్బంది లేకుండా హై లెవెల్ బ్రిడ్జికి చర్యలు




నంద్యాల(చైతన్యరథం): పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో ట్రాఫిక్ రద్దీని శాశ్వత ప్రాతిపదికన నియంత్రించేందుకు వీలుగా మంత్రి ఫరూక్ చర్యలు చేపట్టారు. పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న లో - లెవెల్ బ్రిడ్జి వద్ద వరదల సమయంలో రాకపోకలు బంద్ కష్టాలు, ప్రభుత్వ ఆసుపత్రి ఎదురు రోడ్డు నుంచి ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఎన్జీవో కాలనీకి శ్రీనివాస నగర్ - నూనెపల్లె (ఎన్‌కే రోడ్డు) నుంచి రాకపోకల అను సంధానం చేస్తే ట్రాఫిక్ నియంత్రణకు మార్గం సుగుమం అవుతుందని మంత్రి ఫరూక్ దూరదృష్టితో ఆలోచించి సంబంధిత అధికారుల చేత ప్రతిపాదన చేయించి ఆ ప్రతిపాదనను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లారు. మంత్రి ఫరూక్ ఆధ్వర్యంలో ప్రతి పాదించిన అంశాలకు అనుగుణంగా ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీనివాస్ నగర్ - నూనెపల్లె ప్రధాన రహదారి(ఎన్‌కే రోడ్డు)లోని కేసీ కెనాల్ కార్యాలయం ఎదురుగా శ్రీరామ థియేటర్ - అప్సర బార్ భవనం మధ్య ఉన్న అప్రోచ్ రోడ్డులో చామ కాల్వపై 2.5 కి. మీ వద్ద డబుల్ లైన్ రోడ్డు బ్రిడ్జి (డీఎల్‌ఆర్‌బీ) నిర్మాణం కోసం రూ.3.705 కోట్లు) మొత్తాన్ని ప్రభు త్వం మంజూరు చేసింది.

### డీఎల్‌ఆర్‌బీ నిర్మాణంతో అనుసంధానం

నంద్యాల పట్టణంలోని శ్రీరామ థియేటర్ వెనుక వైపు చామకాలువపై 2.5 కి.మీ వద్ద డబుల్ లైన్ రోడ్డు బ్రిడ్జి(డీఎల్‌ఆర్‌బీ) నిర్మాణంతో ఎన్జీవో కాలనీకి నేరుగా రాకపోకల అనుసంధానం ఏర్పడుతుంది. ప్రస్తుతం శ్రీనివాస్ నగర్ - నూనెపల్లె ప్రధాన రహ దారిలో నుంచి ఎన్జీవో కాలనీకి రెండు మార్గాల ద్వారా రాకపోకలు జరుగుతున్నాయి. ఇందులో ఒకటి టేక్కే ఏటీఎం సెంటర్ నుంచి రామకృష్ణ డిగ్రీ కళాశాల మీదుగా దూరదర్శన్ కేంద్రం రోడ్డులో నుంచి ఎన్జీవో కాలనీకి రాకపోకలు జరుగుతున్నాయి. రెండవది ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి ఎదురుగా ఉన్న రోడ్డు నుంచి ఎన్జీవో కాలనీ వైపు రాకపోకలు జరుగుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న రోడ్డులో నుంచి ఎన్జీవో కాలనీకి వెళ్లేందుకు ట్రాఫిక్ విపరీతంగా ఉంటుంది. భారీ వర్షాల సమయంలో చామకాల్వకు ఎగువ నుంచి వరద పోటెత్తితే రామకృష్ణ డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న లో- లెవెల్ బ్రిడ్జి పైనుంచి నీరు ప్రవహిస్తుంది. ఆ సమయంలో ఎస్బిఐ కాలనీ నుంచి ఎన్జీవో కాలనీకి రాకపోకలు పూర్తిగా నిలిచిపోతాయి. వర్షాకాలంలో వచ్చే ఇబ్బందులతో పాటు ప్రభుత్వ ఆసుప త్రి ఎదురు రోడ్డు నుంచి ఎన్జీవో కాలనీకి వెళ్లే మార్గంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో పెట్టుకుని డీఎల్‌ఆర్‌బీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. శ్రీరామ థియేటర్- అప్సర బార్ మధ్య ప్రస్తుతం ఉన్న అప్రోచ్ రోడ్డులో చామకాల్వ పై డి ఎల్ ఆర్ బి నిర్మాణం పూర్తి అయితే మెయిన్ రోడ్డు నుంచి ఎన్జీవో కాలనీకి నేరుగా అనుసంధానం ఏర్పడుతుంది. దీంతో ఎన్జీవో కాలనీ, పొన్నాపురం కాలనీ మీదుగా విజయ డెయిరీ వరకు వెళ్లేందుకు నేరుగా రాకపోకలకు శాశ్వతంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా అనుసంధానం ఏర్పడుతుండడంతో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు అవకాశం ఏర్పడుతుందని అధికార వర్గాల స్పష్టం చేస్తు న్నాయి. మరో పక్క భారీ వర్షాల సమయంలో రామకృష్ణ డిగ్రీ కళాశాల వద్ద ఉన్న చామకాల్వలో - లెవెల్ బ్రిడ్జి వద్ద వరద నీరు ప్రభావంతో ఎన్జీవో కాలనీకి రాకపోకలు నిలిచి పోవడం సమస్యకు శాశ్వతంగా చెక్ పడుతుంది. శ్రీరామ థియేటర్ వెనుక డీఎల్ ఆర్ బీ నిర్మాణంతో వరదతో రాకపోకలు బంద్ అన్నమాట భవిష్యత్తులో వినపడదు. శ్రీరామ థియేటర్- అప్సర బార్ మధ్య ఉన్న రోడ్డులో చామకాల్వపై డీఎల్‌ఆర్‌బీ నిర్మాణం, అటువైపు నుంచి ప్రస్తుతం ఉన్న మెటల్ రోడ్డును భవిష్యత్తులో బీటీ లేదా సీసీ రోడ్డుగా మార్చేందుకు కూడా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నారు. దీంతో నంద్యాల పట్టణంలో అత్యంత కీలకమైన ప్రాంతంగా ఉన్న ఎన్జీవో ప్రాంతానికి నేరుగా అనుసంధానం ఏర్పడి రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు ట్రాఫిక్ రద్దీ సమస్య పరిష్కారం అవుతుంది.

### నిర్మాణ పనులు ప్రారంభిస్తాం: కేసీ కెనాల్ ఇంజనీర్లు

చామకాల్వపై డీఎల్‌ఆర్‌బీ నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో యుద్ధప్రాతిపదికన నిర్మాణ పనులు ప్రారం భిస్తామని కేసీ కెనాల్ డీఈ రవికుమార్, ఏఈ అబ్దుల్ మునాఫ్ వెల్లడించారు. ప్రతిపాదిత నిర్మాణ స్థలాన్ని వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రెండు మూడురోజుల వ్యవధిలోనే నిర్మాణ పనులు చేపట్టేందుకు కార్యచరణ అమలు చేయబోతున్నట్లు తెలిపారు

# ఆడబిడ్డల రక్షణ, విద్యా వికాసమే ధ్యేయం

- బాలికా సంరక్షణలో భాగస్వాములు కావాలి
- పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ పిలుపు
- నిడదవోలులో జాతీయ బాలికా దినోత్సవ వేడుకలు



నిడదవోలు(చైతన్యరథం): సమాజంలో బాలికల సంరక్షణ, వారి చదువు, ఆరోగ్యం పట్ల ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరిం చాలని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందు ల దుర్గేష్ పిలుపునిచ్చారు. శనివారం నిడదవోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన 'జాతీయ బాలికా దినో త్సవ' కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. బాల బాలికల విషయంలో సమాజ దృక్పథంలో మార్పు రావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పారు. ఆడపిల్లలను కాపాడుకోవడమే కాకుండా, వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే బాధ్యత తల్లిదండ్రులు, గురువులు మరియు సమాజంపై ఉందన్నారు. ఆడపిల్లలను అక్రమ రవాణా (చైల్డ్ ట్రాఫికింగ్), లైంగిక వేధింపుల నుంచి కాపాడాల్సిన అవసరం ఉందని వివరించారు. వారి హక్కు ల పరిరక్షణలో తల్లిదండ్రులు, అధికారులు, రాజకీయ నాయకులు అందరూ భాగస్వాములే అని పేర్కొన్నారు. భ్రూణ హత్యలు అరికట్టేందుకు ప్రభుత్వం కఠిన నిబంధనలు అమలు చేస్తోందని, లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని ఈ క్రమంలో స్కానింగ్ సెంటర్లపై ప్రభుత్వం నిరంతరం నిఘా ఉంచుతుందన్నారు. ఒకప్పుడు జనాభా నియంత్రణ గురించి మాట్లాడామని, కానీ నేడు దేశాభివృద్ధికి మానవ వనరుల అవసరం దృష్ట్యా ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు జనాభా వృద్ధికి పిలుపునిచ్చారని గుర్తు చేశారు. ఆడపిల్లల సంరక్షణ కోసం ఐసీడీఎస్, వైద్య శాఖ, ఉపాధి కల్పన సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వివక్షను పోగొట్టి, బాలికలకు సమాన అవకాశాలు కల్పించేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.సరైన అవకాశాలు కల్పిస్తే మహిళలు అన్ని రంగాల్లో అద్భుతాలు సృష్టిస్తారని, నేటి విద్యార్థినులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. బాలికలను సురక్షిత వాతావరణంలో పెంచుతామని, వారి భవిష్యత్తుకు భరోసా ఇస్తామని అందరూ ప్రతిజ్ఞ చేయాలని కోరారు. ఈ కార్యక్ర మంలో కళాశాల సిబ్బంది, విద్యార్థినులు, ఐసీడీఎస్ అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# రికార్డుల్లో సర్వే నెంబర్ మార్చి భూ కబ్జా యత్నం

- వైసీపీ నేతలపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు
- పొలానికి వెళ్లే దారి మూసివేత
- ఆస్తి కబ్జా చేసి తల్లిదండ్రులపై దాడులు
- ప్రజావినతుల్లో బాధితుల గోడు
- అర్జీలు స్వీకరించిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్



మంగళగిరి(చైతన్యరథం): టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయవాడ పార్లమెంట్ పార్టీ ప్రెసి డెంట్ గద్దె అనురాధ అర్జీలు స్వీకరించారు. కృష్ణా జిల్లా గన్నవ రానికి చెందిన కోటేశ్వరరావు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజావినతుల స్వీకరణ కార్యక్రమంలో నేతలకు అర్జీ ఇచ్చి అభ్యర్థిస్తూ.. కంచికచర్ల మండల పరిధిలోని సర్వే నంబర్ 549/2ఏలో తన స్వంత భూమిని సాగు చేసుకుంటున్నాను. కనీసం సమాచారం ఇవ్వకుండా రెవెన్యూ రికార్డులలో సర్వే నంబర్ 549/2ఏని 549/11గా మార్చడం జరిగింది. ఈ సాంకే తిక మార్పును సాకుగా చూపి వైసీపీకి చెందిన కొంతమంది గుండాలు తమ భూమిని ఆక్రమించాలని చూస్తున్నారు. వైసీపీకి చెందిన స్థానిక గుండాలు తమపై దాడులకు పాల్పడుతున్నారు. అర్ధరాత్రి వేళ ట్రాక్టర్లతో వచ్చి సుమారు ఒక ఎకరా మినుము పంటను వైసీపీ గుండాలు దొంగిలించారు. ఈ విషయంపై పోలీ సుల సమక్షంలో సదరు వ్యక్తులు తమ తప్పును అంగీకరించారు. తమ కౌలుదారుడు వేసిన అరటి మొక్కలను కూడా ధ్వంసం చేశారు. దీనిపై పలుమార్లు సంబంధింత అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి న్యాయం జరగలేదు. వారిపై చర్యలు తీసుకోని తమ సమస్యను పరిష్కరించాలని కోరారు.

### పొలానికి వెళ్లే దారి మూసి ఇబ్బందులు

మార్కాపురం జిల్లా కంభం మండలం రావిపాడు గ్రామానికి చెందిన లక్ష్మీకాంతమ్మ గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 179లో విస్తీర్ణం ఎకరాలు 10.09 సెంట్ల పొలము ఉంది. ఈ పొలానికి పూర్వకాలం నుంచి గ్రామంలో ఉన్న బండిదారి ద్వారానే రాకపోకలు సాగిస్తూ వ్యవసాయం చేసుకుంటూ వస్తున్నాము. అయితే ఇదే గ్రామానికి చెందిన పగడాల శ్రీనివాసులు అనే వ్యక్తి, అతని తండ్రి సుబ్బయ్య పేరుతో సదరు బండి దారిని పూర్తిగా ఆక్రమించి ఎలాంటి అను మతులు లేకుండా అక్రమంగా బిల్డింగ్ నిర్మాణం చేపట్టాడు. ఈ అక్రమ నిర్మాణం వల్ల తమ పొలానికి వెళ్లే దారి పూర్తిగా మూసి వేయబడింది. ఈ విషయం గమనించి బిల్డింగ్ నిర్మాణం జరుగుతున్న సమయంలోనే గ్రామ పంచాయతీ కార్యదర్శి, తహ సీల్దార్‌కు ఫిర్యాదు చేసినా వారు ఎలాంటి చర్యలు తీసు కోలేదు. హైకోర్టును సంప్రదించగా తమకు అనుకూలమైన తీర్పు వచ్చినప్పటికీ అధికారుల నిర్లక్ష్యం వల్ల తమకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. తమ పొలానికి వెళ్లే దారి లేక వ్యవ సాయం పూర్తిగా నిలిచిపోయింది. వారిపై చర్యలు తీసుకుని తమ భూమి సమస్యను పరిష్కరించాలని కోరారు.

### కుమారుడు వేధిస్తున్నాడు

అంబేడ్కర్ కోనసీమ జిల్లా, రాజోలు మండలం ములికిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి నరసింహమూర్తి గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేస్తూ..తమ కుమారుడైన కడలి సత్యనారాయణ తమ యావదాస్తిని పూర్తిగా తన స్వాధీనంలో ఉంచుకుని ఆస్తుల ద్వారా వచ్చే ఫలసాయాన్ని అనుభవిస్తూ తమను తీవ్రంగా వేధిం పులకు గురిచేస్తున్నాడని తెలిపారు. గొడవలకు దిగుతూ కొడు తున్నాడని, తమ కుమారుడి మామ కడలి వెంకట సత్యనా రాయణ, సంసాని విజయలక్ష్మిలతో చేతులు కలిపి తమ ఆస్తు లను కాజేయాలనే దురుద్దేశంతో కుట్రలు పన్నుతున్నాడు. వారిపై చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని కోరాడు.

చైతన్యరథం

# అమరావతిలో గణతంత్ర వేడుకలకు రిహార్సల్స్

**- తొలిసారి రాజధానిలో నిర్వహణకు సిద్ధం**

**- పాల్గొననున్న గవర్నర్, సీఎం, మంత్రులు**

విజయవాడ(చైతన్యరథం): అమరావతి రాజధాని పరిధి విశాల విస్తీర్ణంలో సువిశాలంగా, సుందరంగా అభివృద్ధి చేసిన కోర్ క్యాపి టల్ ఏరియాలో తొలిసారిగా ఆహ్లాదకర వాతావరణంలో భారీ ఏర్పాట్లు చేశారు. పచ్చదనం, విశాల ప్రాంగణాలు, అత్యుత్తమ మౌలికవసతులతో ఆ ప్రాంతం వేడుకలకు మరింత శోభనిచ్చి, పాల్గొన్న వారందరికీ మరిచిపోలేని అనుభూతిని కలిగించనుంది. 77వ గణతంత్ర దినోత్సవ వేడుకలను జనవరి 26 సోమవారం ఉదయం నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సర్వం సిద్ధం చేసింది. గణతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ అహ్మద్, అతిథులుగా ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర మంత్రులు, గౌరవ హైకోర్టు న్యాయాధిపతులు, రాజధానికి భూములిచ్చిన రైతులు హాజరుకానున్నారు. శనివారం ఉదయం 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల పరేడ్ ఫుల్ డ్రెస్ రిహార్సల్ ను ఘనంగా నిర్వహించారు. పరేడ్ రిహార్సల్‌కు రాష్ట్ర డీజీపీ హరీ ష్‌కుమార్ గుప్తా, సాధారణ పరిపాలన శాఖ ముఖ్యకార్యదర్శి జే.శ్యామలరావు హాజరై పరేడ్‌ను పరిశీలించారు. జంగారెడ్డి గూడెం ఏపీఎస్పీ పరేడ్ కమాండర్ ఆర్ సుస్మిత నుంచి డీజీపీ గౌరవ వందనం స్వీకరించి జాతీయ పతకాన్ని ఆవిష్కరించారు. ముందు గా ఇండియన్ ఆర్మీ నాయిబ్ సుబేదార్ ఎల్.కే.ప్రసాద్, కర్నూలు ఏపీఎస్పీ రెండవ బెటాలియన్ రిజర్వ్ ఇన్ స్పెక్టర్ జీవీ రామిరెడ్డి, సీఆర్పీఎఫ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ చెన్వీర్ గౌడ, కేరళ ఆర్మ్‌డ్ పోలీస్ సీవీ జన్‌సాన్, విశాఖపట్టణం ఏపీఎస్పీ 16వ బెటాలియన్‌కు ఎస్వీ రమణ, ఏపీ బ్రాస్ బాండ్‌లో ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌కు చెందిన టీవీ.రమణ, ఏపీఎస్పీ 6వ బెటాలియన్‌కు చెందిన ఎస్. శ్రీనివాసులు, ఇండియన్ ఆర్మీ పైప్ బాండ్‌కు సుబేదార్ మొహం తీ, జీవీ సుబ్బారావు, ఎన్‌సీసీ బాయ్స్‌కు జయంత్ వర్లోత్, ఎన్‌సీసీ గర్ల్స్‌కు రేవతి, ఏపీ సోషల్ వెల్ఫేర్‌కు కే.సునీత్‌కుమార్, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు ఏపీ మోడల్ స్కూల్, పాణ్యంకు చెందిన వై. ఇషాక్‌రాజు, యూత్ రెడ్ క్రాస్‌కు పి.సాయి రోహిత్‌లు కమాండర్ లుగా వ్యవహరించారు. వివిధ కంటింజెంట్స్ పరేడ్‌లో ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ కవాతు ప్రదర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వివిధ శాఖలకు చెందిన 22 శకటాలను ప్రదర్శించారు. పరేడ్ ఫుల్ డ్రెస్ రిహార్సల్స్‌లో గుం టూరు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా, ఎస్పీ వకుల్ జిందా ల్, జాయింట్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, పోలీస్ అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.






# క్యాడర్‌కు ఆయన ఎప్పుడూ స్ఫూర్తిగా నిలుస్తారు

**- ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్**

**- టీడీపీ కేంద్ర కార్యాలయంలో వర్ధంతి వేడుకలు**

**- నివాళులర్పించిన పార్టీ నాయకులు**

మంగళగిరి(చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాల యంలో శనివారం మాజీ మంత్రి, జననేత పరిటాల రవి వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయ వాడ పార్లమెంట్ పార్టీ ప్రెసిడెంట్ గద్దె అనురాధ, మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ కేంద్ర కార్యాలయ కార్యదర్శి పరుచూరి అశోక్‌బాబు, నాలెడ్జ్ సెంటర్ చైర్మన్, జాతీయ అధికార ప్రతినిధి మాల్యాద్రి, నేతలు పర్చూరి కృష్ణ తదితరులు పాల్గొని పరిటాల రవి చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ పరిటాల రవి కేవలం ఒక నాయకుడు మాత్రమే కాదు, ఆయన ఒక వ్యవస్థ. పేదల పక్షపాతిగా, అణగారిన వర్గాల గొంతుకగా ఆయన చేసిన సేవలు చిరస్మరణీయం. రాయలసీమలో ఫ్యాక్షనిజం రక్కసి కోరల నుంచి సామాన్యులను రక్షించడానికి ఆయన నిరంతరం శ్రమించారు. ఆయన భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆయన ధైర్యం, ఆశయాలు



తెలుగుదేశం కార్యకర్తలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయి. ఆయన ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర అభివృద్ధిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. నాడు అన్న ఎన్టీఆర్ అడుగుజాడల్లో నడిచి, ఆ తర్వాత నేటి ముఖ్యమంత్రి చంద్రబా బుకు వెన్నుముకగా నిలబడ్డారు. రాయలసీమ అంటే కేవలం ఫ్యాక్షన్ కాదు, అది అభివృద్ధికి చిరునామా కావాలని ఆయన కల లు కన్నారు. రాయలసీమ కోసం రవి చేసిన కృషిని ఎవరూ మర్చిపోలేరని అన్నారు. అనంతరం గద్దె అనూరాధ మాట్లాడుతూ ఈ రోజు మనం ఒక గొప్ప నాయకుడిని గుర్తుచేసుకుంటున్నాం. పరిటాల రవి గారు అంటే కేవలం అనంతపురం జిల్లాకే కాదు, రాష్ట్రం మొత్తానికి ఒక ధైర్యం. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ఆయన ఒక కొండంత అండ. గడప దాటనివ్వని ఆ రోజుల్లో పెత్తందార్ల గడపలు తొక్కించి, పేదవాడికి ఆత్మగౌరవం అంటే ఏంటో చూపిం చిన పోరాట యోధుడు. మన ఆరాధ్య దైవం ఎన్టీఆర్‌తో ఆయన కున్న అనుబంధం, సాన్నిహిత్యమే ఆయన్ని ఒక గొప్ప మనిషిగా తీర్చిదిద్దింది. కానీ, ఆయన ఎదుగుదల, ప్రజల్లో ఆదరణను చూడలేక.. ఓర్చుకోలేక ఎంతటి దారుణానికి ఒడిగట్టారో మనంద రికీ తెలుసు. అప్పట్లో కొందరు చేసిన దాష్టీకం వల్ల ఒక మంచి మనిషిని తెలుగుదేశం పార్టీనే కాదు, ఈ రాష్ట్ర ప్రజలంతా కోల్పో యారు. ఆ తర్వాత కూడా పరిటాల సునీత ఏమాత్రం అధైర్య పడకుండా, జిల్లా ప్రజలందరికీ అండగా నిలబడ్డారు. మంత్రిగా ఆమె చేసిన సేవలు మరువలేనివి. గత ఐదేళ్లు రాష్ట్రాన్ని సర్వ నాశనం చేయాలని చూసిన శక్తుల అరాచకాలను మనం చూశాం. అలాంటి శక్తుల మూలంగానే రవి వంటి నాయకుల్ని మనం దూరం చేసుకున్నాం. టీడీపీ శ్రేణులు ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.


# కూటమి పాలనలో శరవేగంగా అమరావతి అభివృద్ధి

- **జగన్‌రెడ్డికి భయపడే చట్టబద్ధ హోదా తీసుకొస్తున్నాం**
- **రాష్ట్ర ప్రజలు వైసీపీ కుట్రలను అర్థం చేసుకున్నారు**
- **ఆయన తెచ్చింది భూ రక్ష కాదు.. భూ భక్ష పథకం**
- **కల్తీ నెయ్యి గురించి వైసీపీ నాయకులు మాట్లాడాలి**
- **పాలు లేకుండా ఎలా తయారు చేశారో చెప్పాలి.**
- **జోగి ప్రమాణం చేయాల్సింది న్యాయస్థానంలో**
- **సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య**

మంగళగిరి(చైతన్యరథం): అమరావతిపై జగన్ మొదటి నుంచి ఒకటే విషం చిమ్ముతున్నాడని సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాల కోటయ్య గారు అన్నారు. రాజధానిపై కనీసం అవ గాహన లేకుండా జగన్‌రెడ్డి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావే శంలో ఆయన మాట్లాడారు. జగన్‌రెడ్డి లాంటి దుర్మార్గులకు భయ పడే అమరావతికి చట్టబద్ద హోదా తీసుకొస్తున్నామన్నారు. అమరా వతి గురించి జగన్ మాట్లాడే ముందు నాగరికతలు గురించి తెలుసుకోవాలన్నారు. నేడు ప్రపంచంతో పాటు దేశంలోని చాలా నగరాలు నది తీరాన్నే అభివృద్ధి చెందినట్లు గుర్తు చేశారు. జగన్ కనీసం జ్ఞానం లేకుండా మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. జగన్ ఐదేళ్ల కాలంలో అమరావతిలో కోలుకోలేని విధ్వంసం జరిగింద న్నారు. ముఖ్యంగా రైతులు తీవ్ర క్షోభకు గురయ్యారని తెలిపారు. వారిపై కక్ష గట్టి 3 వేల కేసులు పెట్టించి.. మహిళలను బూటు కాళ్లతో తన్నించారని గుర్తు చేశారు. జగన్ చేసిన పాపానికి 300 మంది వరకు రైతులు ఆత్మహత్యలు వేసుకున్నారన్నారు.

**రాజధాని అంటే ఏమిటో జగన్ అర్థం చెప్పాలి**

రాజ్యాంగంలో రాజధాని అనే పదం లేదంటున్న జగన్.. ఆయ న దృష్టిలో రాజధాని అంటే ఏంటో అర్థం చెప్పాలన్నారు. తాడేపల్లి, యలహంక, హైదరాబాద్, ఇడుపులపాయ ప్యాలెస్‌లు జగన్ దృష్టిలో రాజధానులా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం లో అమరావతిలో



పనులు దేదీప్యమానంగా జరుగుతున్నాయన్నా రు. అనేక రాష్ట్రాలకు చెందిన సుమారు 13 వేల మంది కార్మికు లు రాత్రి పగలు అనే తేడా లేకుండా కష్టపడుతున్నారని పేర్కొ న్నారు. సుమారు రూ.260 కోట్లతో అద్భుతమైన సీఆర్డీఏ పరిపా లన భవనం నిర్మించుకున్నామని తెలిపారు. అలాంటి దానిపై కూడా వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారని.. ఆ భవనం నుంచి దూకితే అది ఫేక్ భవనమో లేదా నిజమో తేలు తుందన్నారు. అలానే జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం, స్టార్ హోటల్స్, గ్రేడ్ 4, అఖిల భారత సర్వీస్ ఉద్యోగస్థుల భవనాలు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. వాటిని త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. రూ.100 కోట్లతో క్వాంటం వ్యాలీ, రాజధానిలో మౌలి క సదుపాయాలు కల్పన పనులు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు. అలానే వరద నివారణ చర్యల్లో భాగంగా కొండవీటి వాగు, పాల వాగు పనులు చేస్తున్నామన్నారు. సీడ్ యాక్స్ రోడ్డు, ఔటర్ రింగ్ రోడ్డు, రైల్వే ట్రాక్ నిర్మాణ పనులు జరుగుతు న్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమరావతిలో జరుగు తున్న అభివృద్ధి పనులకు సంబంధించి ఫొటోలను మీడియాకు చూపించారు. ఏ ఉద్దేశంతో జగన్ విశాఖలో రూ.500 కోట్లతో రుషి కొండ ప్యాలస్ కట్టారు చెప్పాలన్నారు. కేవలం మళ్లీ అధికారంలోకి వస్తే..విశాఖకు రాజధానిని తరలించడానికే కదా అని ప్రశ్నించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అమరావతికి అను కూలంగా మాట్లాడి.. అధికారం కోల్పోగానే మూడు ముక్కలు ఆట ఆడుతుంటారని ధ్వజమెత్తారు. వేల కోట్ల ప్రజా ధనం జగన్ విలాసాలు కోసం తగులబెట్టారని విమర్శించారు.

**అమరావతి ఖర్చులపై జగన్ పచ్చి అబద్ధాలు**

అమరావతిలో నిజానికి చ.గజానికి రూ.5 వేలు నుంచి 6 వేలు ఖర్చు చేస్తే.. జగన్ మాత్రం రూ.13 వేల ఖర్చు చేస్తు న్నారని అసత్యాలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. జగన్ కాకీ లెక్కలు ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. తెలంగాణలో రూ.160 కోట్లతో అంబేద్కర్ విగ్రహం నిర్మిస్తే... జగన్ మాత్రం రూ.400 కోట్లు ఖర్చు చేసి విజయవాడలో నిర్మించాడని గుర్తు చేశాడు. కేవలం అంబేద్కర్ విగ్రహం మాత్రమే పెట్టి.. స్మృతి వనంలో ఏం నిర్మించలేదని ఆరోపించారు. జగన్ పేర్లు పెద్ద పెద్దగా కనిపించినట్లు రాసుకున్నాడని పేర్కొన్నారు.

**ప్రజల ఆస్తులు మీ తాత ఆస్తులా..**

జగన్ భూ సర్వే పేరుతో రూ.700 కోట్లు దండుకున్నాడని ధ్వజమెత్తారు. ప్రజల ఆస్తులపై జగన్ బొమ్మలు వేసుకునే హక్కు ఆయనకు ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. ఆయన భూ రక్షణ పథకం కాదు.. భూ పక్ష పథకం తీసుకొచ్చాడని మండిపడ్డారు. ప్రజల భూములు జగన్ నాన్న, తాతల ఆస్తులా ఆయన ఫొటో లు వేసుకున్నాడని ఎద్దేవా చేశారు. వైసీపీ నాయకులు తిరుపతి కల్తీ లడ్డు గురించి మాట్లాడాలని కోరారు. రాజ్ కసిరెడ్డికి ఏ అర్హతతో రూ.100 కోట్లు ఇచ్చారో ప్రజలకు వివరణ ఇవ్వాలని కోరారు. చుక్క పాలు లేకుండా నెయ్యి తయారు చేసి కోట్ల రూపాయల కుంభకోణాలకు పాల్పడ్డారని పేర్కొన్నారు. కల్తీ మద్యంతో అరెస్టు అయి విడుదలైన జోగి రమేశ్ స్వాతంత్ర్య సమరయోధుడు మాదిరి హడావిడి చేశాడని ధ్వజమెత్తారు. విజ యవాడలో ట్రాఫిక్ ఉల్లంఘించి.. డీజేలు, బాణా సంచా కాల్పు లతో ప్రజలను ఇబ్బందికి గురి చేశాడని మండిపడ్డారు. జోగి రమేశ్ ప్రమాణం చేయాల్సింది న్యాయస్థానాలు, జడ్జీల ముందు అని..దేవాలయాల్లో కాదని హితవుపలికారు.

# రీసర్వే జగన్‌రెడ్డి సృష్టించిన భూ వివాదాల పుట్ట

- విజయనగరం జిల్లాలోనే 70 శాతం సమస్యలు
- డేటా ట్రాన్స్‌ఫర్‌లోనూ పూర్తిగా విఫలం..
- వెబ్‌ల్యాండ్ వ్యవస్థను సర్వనాశనం చేశారు
- 5.74 లక్షల ఎకరాల ఫ్రీ హోల్డ్‌తో భూ దోపిడీ
- పాస్‌పుస్తకాలపై ఫొటోలకు రూ.700 కోట్లు
- ఎంఎస్ఎంఈ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ధ్వజం



మంగళగిరి (చైతన్యరథం): జగన్‌రెడ్డి గత ఐదేళ్ల పాలనలో చేపట్టిన భూ రీసర్వే అనేది రైతుల మేలు కోసం చేసిన సంస్కరణ కాదు, అది కేవలం భూకబ్జాలకు దారి వేసేందుకు వేసిన ఒక పక్కా వ్యూహమని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాల యం 'ఎన్టీఆర్ భవన్'లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూ రీసర్వే అంశంపై జగన్‌రెడ్డి క్రెడిట్ తీసుకోవా లని చూడటం హాస్యాస్పదమని ఎద్దేవా చేశారు. క్షేత్రస్థాయిలో రెవెన్యూ వ్యవస్థపై కనీస అవగాహన లేకుండా కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం చేసిన ఈ ప్రయోగం వల్ల ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది భూ యజమానులు, సామాన్య రైతులు కోర్టులు, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆయన మండిపడ్డారు. ముఖ్యంగా విజయనగరం జిల్లాను ఉదా హరణగా చూపిస్తూ, అక్కడ గత 18 నెలలుగా తాను వ్యక్తిగతంగా జరిపిన సమీక్షలో విస్తుపోయే నిజాలు బయటపడ్డాయని మంత్రి తెలిపారు. జిల్లాలో ఉన్న మొత్తం రెవెన్యూ సమస్యల్లో 70 శాతం కేవలం జగన్ సర్కార్ అస్తవ్యస్తంగా నిర్వహించిన రీసర్వే వల్లే తలెత్తాయని వివరించారు. బ్రిటిష్ కాలం నాటి పారదర్శక రికా ర్డులు, లింక్ డాక్యుమెంట్లు స్పష్టంగా ఉన్నప్పటికీ.. అధికారులకు శిక్షణ ఇవ్వకుండా, తగిన సమయం కేటాయించకుండా బలవం తంగా రీసర్వేను రుద్దడం వల్ల వ్యవస్థ మొత్తం గందరగోళంలో పడిందని విమర్శించారు. వలస వెళ్లిన రైతుల భూములను సైతం పట్టించుకోకుండా లక్షలాది జాయింట్ ఎల్పీఎం (LPM)లు సృష్టిం చి రైతుల ఆస్తులను చిక్కుల్లో నెట్టేశారని ధ్వజమెత్తారు. వెబ్ ల్యాండ్-1లో ఉన్న పూర్తి భూ చరిత్రను పట్టించుకోకుండా, హడావుడిగా వెబ్లాండ్-2కి మారడం వెనుక భారీ కుట్ర దాగి ఉందన్నారు. సుమారు 13.59 లక్షల ఎకరాలను ఫ్రీ హోల్డ్ చేసిన గత ప్రభుత్వం, అందులో 5.74 లక్షల ఎకరాల అర్హత లేని భూములను చేర్చడం వారి దురుద్దేశాన్ని స్పష్టం చేస్తోందని ఆరోపించారు. దీని ద్వారా సుమారు 8,000 ఎకరాల డీవియేషన్ భూములను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేశారని ఆధారాలతో సహా పేర్కొన్నారు. ప్రజల ఆస్తులపై, సర్వే రాళ్లపై తన ఫొటోలు వేయిం చుకోవడానికి రూ.700 కోట్ల ప్రజాధనాన్ని తగలేసిన జగన్ రెడ్డికి, ప్రజల ఆస్తి హక్కుల గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని మంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఈ గందరగోళాన్ని చక్కదిద్దుతోందని, రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన 2,34,664 రెవెన్యూ ఫిర్యాదులను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారని తెలిపారు. రాబోయే రెండేళ్లలో రెవెన్యూ సమస్యలన్నింటినీ క్లియర్ చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు బలమైన మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేశామని వివరించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరిదిద్దుతూ ప్రజల్లో నమ్మకం కలిగిస్తున్న తమ ప్రభుత్వంపై జగన్‌రెడ్డి విషప్రచారం చేయడం ఆపాలని హితవుపలికారు.

## అరసవల్లి ఉత్సవాలు రాష్ట్రానికే ఆదర్శం కావాలి

- వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- జిల్లా యంత్రాంగానికి కీలక ఆదేశాలు జారీ



కోటబొమ్మాళి(చైతన్యరథం): అరసవల్లి సూర్యజయంతి వేడు కలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే గర్వకారణమని, ఈసారి మనం నిర్వహించే విధానం భవిష్యత్తు ఉత్సవాలకు ఒక ఆదర్శవం తమైన ప్రామాణిక మార్గదర్శకం కావాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆకాంక్షించారు. ఈ ఉత్సవాలను ప్రభుత్వం 'రాష్ట్ర పండుగ'గా నిర్వహిస్తున్న నేపథ్యంలో గతంలో జరిగిన చిన్నపాటి పొరపా ట్లకు కూడా తావులేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారుల ను ఆదేశించారు. ముఖ్యంగా సామాన్య భక్తులకు సులభతర దర్శనం కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, క్యూలైన్లలో భక్తులకు ఎండ తగలకుం డా టెంట్లు, మంచినీరు, మజ్జిగ వంటి సౌకర్యాలు నిరంతరాయంగా అందేలా చూడాలని ఆయన స్పష్టం చేశారు. భక్తులతో పోలీసులు ఎంతో మర్యాదపూర్వకంగా మెలిగేలా చూడాలని, వృద్ధులు, దివ్యాంగుల కోసం ప్రత్యేక వసతులు కల్పించాలని ఇప్పటికే ఆదేశించినట్లు చెప్పారు. శనివారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమయ్యే ఈ మహాత్కార్యంలో ప్రతి అధికారి, సిబ్బంది అంకితభావంతో పనిచేసి రథసప్తమి వేడుకలను విజయవంతం చేయాలని మంత్రి పిలుపునిచ్చారు.

## స్వచ్ఛాంధ్ర ర్యాలీలో మంత్రి ఫరూక్




నంద్యాల(చైతన్యరథం): స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా 12వ వార్డులో జరిగిన ర్యాలీలో న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఫరూక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. నంద్యాల మండలం కానాల గ్రామంలో స్వచ్ఛ రథంను, మినీ గోకుల షెడ్లను కలెక్టర్ రాజకుమారితో కలిసి ప్రారంభించారు. ప్రతి పట్టణం స్వచ్ఛ పట్టణంగా.. ప్రతి గ్రామం స్వచ్ఛ గ్రామంగా మారాలన్న కూటమి ప్రభుత్వ సంకల్పానికి ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

## ప్లాస్టిక్ రహిత రాష్ట్రమే చంద్రబాబు లక్ష్యం

- బావితరాల గురించి ఆలోచించే చంద్రబాబు
- రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్
- చెత్తతో సంపద సృష్టి సీఎం ఆలోచన: కృష్ణప్రసాద్




రేపల్లె(చైతన్యరథం): ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్యఉద్దేశమని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి నెల 3వ శనివారం జిల్లాలో నిర్వహించే స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛాం ధ్ర కార్యక్రమంలో భాగంగా 4వ శనివారం ఉదయం బాపట్ల జిల్లా రేపల్లె మండలం కేంద్రంలో ఏబీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళా శాలలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వి.వినోద్‌కుమార్, బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్, జిల్లా ప్రత్యేక అధికారి మల్లిఖార్జున, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్‌తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రాన్ని స్వచ్ఛందంగా ఉంచాలని ప్లాస్టిక్ రహిత ఆంధ్రప్రదేశ్ చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు ముఖ్య ఉద్దేశమని తెలిపారు. రేపల్లె నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఎంపీ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వేస్టేజ్ వల్ల ఆదాయం వచ్చే విధంగా ముఖ్యమంత్రి స్వచ్ఛ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రేపల్లె నుంచి తెనాలి వరకు రెండో రైల్వే లైన్ నిర్మాణానికి, రేపల్లె నుంచి బాపట్ల వరకు నాలుగు లైన్ రోడ్డు నిర్మాణ పనులకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందని, ఏ రాష్ట్రంలో లేని విధంగా మన రాష్ట్రంలో గ్రీన్ ఫీల్డ్ జాతీయ రహదారుల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. రేపల్లె నియోజకవర్గం పరిధిలో ఉన్న బౌద్ధ స్తూపం పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి, వివిధ దేశాల నుండి వచ్చే బౌద్ధ మతస్థులు కోసం మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం రూ.20 కోట్లు నిధులు మంజూరు కు కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనను పంపడం జరిగిందని తెలిపారు. రేపల్లె నియోజకవర్గంలో అన్ని విధాలుగా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడం జరుగుతుందని తెలిపారు. అనంతరం అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. పారిశుద్ధ్య కార్మికులను మంత్రి, ఎంపీ, ప్రత్యేక అధికారి, కలెక్టర్ చేతులమీదుగా సన్మానించారు. మధ్యలో బడి మానేసిన పిల్లలను గుర్తించిన స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా బాల్య వివాహాలపై నిర్వహించి పోటీలలో గెలుపొందిన బాలికలకు బహుమతులు, ఆడపిల్లలను కన్న తల్లులకు మొక్కలు అందజేశారు. అంతకుముందు ర్యాలీ జరిగింది. అనంతరం డిగ్రీ కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. వివిధ శాఖలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించి స్వచ్ఛ రథాలను ప్రారంభించారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

- పాఠశాల స్థాయి నుండే అవగాహన కల్పించాలి
- స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్రపై సీఎం ప్రత్యేక శద్ధ
- హోంమంత్రి వంగలపూడి అనిత





అనకాపల్లి(చైతన్యరథం): స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శనివారం ఉదయం కశింకోట మండలం తేగాడ మోడల్ పాఠ శాలలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పారిశుద్య సిబ్బందిని సన్మానించారు. పాఠశాల ఆవరణంలో మొక్కలు నాటారు. అనిత మాట్లాడుతూ స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్రపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ప్రతిఒక్కరూ మరుగుదొడ్డి వినియోగించాలని, మరుగుదొడ్డి లేనిచోట్ల మరుగుదొడ్డి నిర్మాణం, డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గ్రామాల అభివృద్ధి ఇంటినుండే ప్రారంభం కావాలని, పరిసరాల పరిశుభ్రత ప్రతి విద్యార్థికి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థినులకు శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థినులతో కలిసి కేక్ కట్ చేసి వారితో సరదాగా ముచ్చటించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రీడా మైదానం కావాలని కోరగా త్వరలోనే గ్రౌండ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

చైతన్యరథం

# ప్రతిష్ఠాత్మకంగా అనకాపల్లి ఉత్సవ్

- జిల్లా వైభవం చాటేలా నిర్వహించాలి
- వేడుకలను విజయవంతం చేయాలి
- కలిసి పనిచేద్దాం..మంచి పేరు తీసుకువద్దాం
- హోంమంత్రి వంగలపూడి అనిత



అనకాపల్లి(చైతన్యరథం): జిల్లా వైభవం చాటేలా, సంస్కృతి సాంప్రదాయాలు ప్రతిబింబించేలా అనకాపల్లి ఉత్సవాలను ప్రతి ష్ఠాత్మకంగా నిర్వహించాలని హోంమంత్రి వంగలపూడి అనిత అధికారులను అదేశించారు. విశాఖ ఉత్సవ్ కార్యక్రమంలో భాగం గా అనకాపల్లి జిల్లాలో జనవరి 29, 30 తేదీలలో నిర్వహి స్తున్న అనకాపల్లి ఉత్సవ్ కార్యక్రమం ఏర్పాట్లపై జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా, ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, పంచకర్ల రమేష్‌బాబు, సుందరపు విజయకుమార్, కార్పొరేషన్ల చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, బత్తుల తాతయ్యబాబు, మల్ల సురేంద్ర, జిల్లా అధికారులు, శ్రేయాస్ మీడియా ఈవెంట్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో తొలిసారి నిర్వహిస్తున్న అనకాపల్లి ఉత్సవ్‌ను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఎమ్మెల్యేల సూచనలు స్వీకరించి అమలుచేయాలని తెలిపారు. జిల్లా సంస్కృతి, సాంప్రదాయాలు ప్రతిబింబించేలా స్టాల్స్, కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమాలు నిర్వహించే ప్రదేశాలు, వేదికల వద్ద భద్రతా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బోటింగ్‌లో ప్రతి ఒక్కరూ లైఫ్ జాకెట్ ధరించాలని, గజ ఈతగాళ్లను నియ మించాలని తెలిపారు. భద్రతా ఏర్పాట్లకు సిబ్బందిని నియమించా లని తెలిపారు. ఫుడ్ స్టాల్స్‌లో ఏర్పాటు చేసే ఆహార పదార్థాల నాణ్యత తనిఖీ చేయాలని, శానిటేషన్, నీటి సరఫరా పక్కాగా ఏర్పాటు చేయాలని తెలిపారు. కళాకారులకు, క్రీడాకారులకు అన్ని సదుపాయాలు కల్పించాలని తెలిపారు. ఈవ్ టీజింగ్ వంటి సంఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమం నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా, ఎవరైనా సమస్యలు సృష్టించాలని ప్రయత్నించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కుటుంబసమేతంగా పాల్గొని కార్యక్రమా లను విజయవంతం చేయాలని కోరారు.

## కేసీ కెనాల్ ఆయకట్టుకు సాగునీరు

- క్లిష్ట పరిస్థితుల్లో రెండో పంటకు విడుదల
- రైతులు నష్టపోకూడదనే ప్రభుత్వం నిర్ణయం
- అధికారులు పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశం

అమరావతి(చైతన్యరథం): తుంగభద్ర డ్యామ్‌కు కొత్త గేట్లు అమర్చటానికి కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) నిర్ణయిం తీసు కున్న నేపథ్యంలో 2025-26 నీటి సంవత్సరంలో తుంగభద్ర డ్యామ్‌లో నీటి నిల్వను 80 టీఎంసీలకు పరిమితం చేయడం జరి గింది. అందువల్ల రెండో పంటకు నీళ్లు ఇవ్వడానికి వీలు కాదని నిర్ణయించారు. ఈ నిర్ణయాన్ని కలెక్టర్లు, ప్రజాప్రతినిధుల సమక్షం లో 02.12.2025న నిర్వహించిన నంద్యాల జిల్లా నీటిపారుదల సలహా మండలి సమావేశంలో తెలియజేస్తూ కేసీ కెనాల్ కింద 0-150 కి.మీ పరిధిలోని ఆయకట్టులో రెండో పంటకు సాగునీరు అందించడం సాధ్యంకాదని స్పష్టం చేయడం జరిగింది. అయిన ప్పటికీ నందికొట్కూరు, పాణ్యం, శ్రీశైలం నియోజకవర్గాల పరిధి లోని ఆయకట్టు రైతులు సుమారు 40,000 ఎకరాలలో రబీ పంటలు వేసినట్లు తెలిసింది. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచు కుని, నందికొట్కూరు, పాణ్యం, శ్రీశైలం నియోజకవర్గాల ఎమ్మెల్యే లు గిత్తా జయసూర్య, గౌరు చరితారెడ్డి, బుడ్డా రాజశేఖరరెడ్డి, గత రెండురోజులుగా మల్యాల-మచ్చుమర్రి నుంచి సాగునీటి అవస రాలకు నీటిని విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు, జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడును అభ్యర్థించారు. ప్రస్తుతం శ్రీశైలం రిజర్వాయర్, నాగార్జునసాగర్ ప్రాజెక్టులలోని నీటి నిల్వలను పరిగణనలోకి తీసుకుని కృష్ణా రివర్ మేనేజ్‌మెం ట్ బోర్డు (కేఆర్‌ఎంబీ) ద్వారా కేటాయించబడిన కోటాకు లోబడి, పంటలు పూర్తయ్యేందుకు కావలసిన సాగునీటి అవస రాలు, జూలై మాసం వరకు తాగునీటి అవసరాలను అంచనా వేయగా ప్రస్తుత నీటి నిల్వ తక్కువగా ఉన్నప్పటికీ కేసీ కెనాల్ కింద వేసిన రెండో పంటను రైతులు నష్టపోకుండా మానవతా దృక్పథంతో రెండు దఫాలుగా, ప్రతి దఫాలో 20 రోజుల పాటు నీరు విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లలో సరిపడా నీరు లేని క్లిష్ట పరిస్థితుల నేపథ్యంలో రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని విడుదల చేయ బోతున్న నీటిని సద్వినియోగం చేసుకుని వృథా కాకుండా సమర్థవంతంగా వినియోగించుకో వాలని రైతులను కోరారు. ఇందుకోసం జిల్లా కలెక్టర్లు, రెవెన్యూ, పోలీసు, జలవనరుల శాఖ అధికారులు సాగునీటి వృథాకు ఎటువంటి ఆస్కారం లేకుండా సమర్థవంతంగా వినియోగిస్తూ తగిన పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు.

## విదేశాల్లో ఏపీ హస్త 'కళ' కళ!

- రిపబ్లిక్ డే వేడుకల్లో అతిథులకు ఏపీ హస్తకళల గిఫ్ట్ ఇవ్వాలని సింగపూర్‌లోని భారత హై కమిషన్ నిర్ణయం
- లేపాక్షికి 400 గిఫ్ట్ బాక్సులకు ఆర్డర్
- ఏపీ హస్తకళలకు అంతర్జాతీయ గుర్తింపుపై మంత్రి సవిత హర్షం
- విదేశాల్లోనూ లేపాక్షి షో రూమ్‌ల ఏర్పాటు చేస్తామని వెల్లడి





అమరావతి (చైతన్యరథం): ఏపీ హస్త కళలకు అంతర్జాతీయ స్థాయిలో మరో గుర్తింపు సాధించినట్లు రాష్ట్ర చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. సింగపూర్ భారత హై కమిషన్ కార్యాలయంలో సోమవారం జరగబోయే రిప్లబిక్ వేడుకల్లో అతిథులకు ఏపీ హస్త కళారూపాలతో కూడిన గిఫ్ట్ బాక్స్‌లు అందజేయనున్నారన్నారు. ఇందుకోసం లేపాక్షి అధికారులకు 400 గిఫ్ట్ బాక్స్‌లకు సింగపూర్ భారత హై కమిషన్ ఆర్డర్ పెట్టినట్లు వెల్లడించారు. అంతర్జాతీయంగా ఏపీ హస్త కళలకున్న డిమాండ్ ను దృష్టిలో పెట్టుకుని విదేశాల్లో లేపాక్షి షో రూమ్‌లు తెరవనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. గతేడాది ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ వేడుకల్లో ఏపీ హస్త కళల శకటానికి తృతీయ స్థానం వచ్చిన నాటి నుంచి హస్త కళా రూపాలకు విపరీతమైన ప్రాచుర్యం లభించిందన్నారు. దేశ వ్యాప్తంగా ఏపీ హస్త కళారూపాల విక్రయాలు పెరిగాయన్నారు. ఈ నేపథ్యంలో సింగపూర్‌లో ఉన్న భారత ఎంబసీ అధికారులు ఏపీ హస్త కళారూపాలతో కూడిన 400 గిఫ్ట్ బాక్సుల కావాలని లేపాక్షికి ఆర్డరిచ్చారన్నారు. ఈ గిఫ్ట్ బాక్స్‌లో సీతాదేవి లెదర్ పప్పెట్రీ, ఏనుగు ఆకారపు బ్యాగేజ్ ట్యాగ్, హ్యాండ్ పెయింటెడ్ ఏనుగు కోస్టర్ వంటి కళారూపాలు ఉంటాయన్నారు. ఏపీ హస్త కళలకు అంతర్జాతీ యంగా గుర్తింపు రావడంపై మంత్రి సవిత హర్షం వ్యక్తంచేశారు.

### విదేశాల్లోనూ లేపాక్షి షో రూమ్ లు

రాష్ట్రంతో పాటు జాతీయ స్థాయిలో 19 లేపాక్షి షో రూమ్‌లు ఉన్నాయని మంత్రి సవిత తెలిపారు. ఏపీ హస్త కళలకు అంతర్జాతీయంగా గుర్తింపు రావడంతో, విదేశాల్లోనూ లేపాక్షి షో రూమ్‌లు ఏర్పాటు చేయాలని కూటమి ప్రభుత్వం భావిస్తోందన్నారు. హస్త కళాకారులకు ఆర్థిక భరోసా కలిగించేలా మార్కెటింగ్ పెంచాలని నిర్ణయించామన్నారు. దీనిలో భాగంగా మారుతున్న ప్రజల అభిరుచులకు అనుగుణంగా కళారూపాల తయారీలో కళాకారులకు శిక్షణ అందజేస్తున్నామన్నారు. నిత్యావసరాలు, వస్త్రాలు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువుల మాదిరిగా హస్త కళారూపాలనూ ఆన్ లైన్‌లో విక్రయించేలా ప్రత్యేక వెబ్ సైట్ తయారు చేస్తున్నామన్నారు. ఆయా కళారూపాలను 10,20, 30 శాతం డిస్కౌంట్లతో లేపాక్షి షో రూమ్‌ల్లో అమ్మకాలు చేస్తున్నామన్నారు. ప్రస్తుత తరం ఆలోచనలు, అభిరుచులకు అనుగుణంగా లేపాక్షి షో రూమ్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వినియోగదారులను ఆకట్టుకు నేలా ఆ నిర్మాణాలు ఉంటాయన్నారు. మొదటి విడతలో విశాఖపట్నం, అనంతపురం, కడప లేపాక్షి షో రూమ్ లను అభివృద్ధి చేయనున్నామ న్నారు. ఇందుకోసం ప్రభుత్వం ఒక్కో షో రూమ్ కు రూ.15 లక్షల చొప్పున వెచ్చిస్తోందన్నారు. ఇప్పటికే ఢిల్లీలోని లేపాక్షి షో రూమ్ అభివృద్ధి చేశామన్నారు. మిగిలిన 15 షో రూమ్ లను విడతల వారీగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. ఆంధ్ర ప్రదేశ్ సంస్కృతి, సంప్రదాయాలకు హస్త కళలు ప్రతి రూపాలన్నారు. ఆ కళలను పరిరక్షించుకోవడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి సవిత ఆ ప్రకటనలో తెలిపారు.

# విశాఖ ఉత్సవ్‌లో హెలికాప్టర్ రైడ్

- సందర్శకులు వినియోగించుకోవాలి
- పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్



విశాఖపట్నం(చైతన్యరథం): నగరంలో అత్యంత వైభవంగా జరుగుతున్న విశాఖ ఉత్సవ్‌లో భాగంగా పర్యాటకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు ఏర్పాటు చేసిన హెలికాప్టర్ రైడ్‌ను రుషికొండ బీచ్‌లో పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ శనివారం ఘనంగా ప్రారంభించారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్‌తో పాటు జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి, రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఏపీటీడీసీ చైర్మన్ నూకసాని బాలా జీ, పర్యాటక శాఖ సెక్రటరీ అజయ్ జైన్ తదితరులు హెలి కాప్టర్‌లో ప్రయాణించి విశాఖ నగర సౌందర్యాన్ని ఆకాశం నుంచి వీక్షించారు. ఈ సందర్భంగా విహంగ్ అడ్వెంచర్స్ అండ్ సూర్య ఏవియేషన్ సీఈవో కెప్టెన్ సూర్య హెలికాప్టర్ యజమాని సూర్య రైడ్ వివరాలు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ విశాఖ ఉత్సవ్ భారతదేశంలోనే అతిపెద్ద బీచ్ ఫెస్టివల్‌గా గుర్తింపు పొందిందని, దీనిని మరింత వైభవంగా నిర్వ హిస్తున్నామని తెలిపారు. "సిటీ ఆఫ్ డెస్టినీ" విశాఖపట్నం ప్రకృతి సిద్ధమైన సముద్రతీరం, కొండలతో అలరారుతుంటుందని.. ఈ అందాలను ఆకాశ వీధుల నుంచి చూసి తరించడానికి హెలికాప్టర్ రైడ్ ఒక చక్కని అవకాశమని పేర్కొన్నారు. ఏపీ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించ డమే తమ లక్ష్యమని వివరించారు. విశాఖ ఉత్సవ్‌కు విచ్చేసే సంద ర్శకులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో ఈ హెలికాప్టర్ రైడ్ సేవలను వినియోగించుకోవాలని కోరారు. వీటితో పాటు పారా మోటరింగ్, స్కూబా డైవింగ్, పారా సెయిలింగ్, కయాకింగ్ తదితర సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యాటక శాఖ ఉన్నతాధికారులు, ఇతర జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా "స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ రథం

### కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడికుడి



విజయనగరం, (చైతన్యరథం): స్థానిక శాసనసభ్యుడు నడికుదుటి ఈశ్వరరావు, రణస్థలం ఎంపీడీవో, ముఖ్య నాయకులు, ప్రజలతో కలిసి ఎచ్చెర్ల నియోజకవర్గం రణస్థలం మండలం కోస్ట పంచాయతీలో చెత్తను వేరు చేసి పొడి చెత్తను భద్రపరిచి విక్రయించే అలవాటు కలిగిన కుటుంబాలకు ప్రోత్సాహకాలు అందించే విధంగా ప్రత్యేకంగా రూపకల్పన చేశారు. ఆదివారం స్వచ్ఛ రథం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. స్వర్ణాంధ్ర, పరిశుభ్ర ఆంధ్రప్రదేశ్ సాధించే సంకల్పంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆలోచనలతో, విజనరీతో రాష్ట్రవ్యాప్తంగా పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గృహస్థాయిలోనే చెత్తను వేరు చేసే అలవాటును ప్రోత్సహించేందుకు, చెత్త నుండి సంపదని తయారు చేసే విధంగా ఏర్పాటు చేయడం, ఆడబిడ్డలకు ప్రోత్సాహకాలు అందించే విధంగా పొడి చెత్తని విక్రయించి వారికి కిరాణా సరుకులు అందించే విధంగా ఈ స్వచ్ఛంధ్ర,- స్వచ్ఛ రథం రూపొందించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు తీసుకోవడం హర్షణీయమని విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడుతెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోస్ట పంచాయతీ టీడీపీ సీనియర్ నాయకులు, ఎక్స్ ప్రెసిడెంట్ పిషిణి జగన్నాథం నాయుడు, పైడి అప్పడదొర, పిసిని అసిరనాయుడు, కోటీశ్వరావు, సర్పంచుల సంఘం అధ్యక్షుడు బానోజీ నాయుడు, పైడి భీమవరం సర్పంచ్ ప్రతినిధి రౌతు శ్రీనివాస్,కోరాడ రమణ, మైలపల్లి పోలీస్, జీరుపాలెం అశోక్, జనసేన నాయకులు వడ్డాది శ్రీను, బిజెపి శ్రీను, కొవ్వాడ రాముడు, దన్నాన మహేష్, సత్యం అప్పడు తదితర నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



# ఘనంగా మంత్రి లోకేశ్ పుట్టినరోజు వేడుకలు

### పలు సేవా కార్యక్రమాలు చేపట్టిన ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం, (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఐటీ, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ పుట్టినరోజును పురస్కరించుకుని నియోజకవర్గం పరిధిలోని 4 పాఠశాలలకు వాటర్ ప్లాంట్లు, ప్రేమసమాజం, నైట్ షెల్టర్‌కు వంట, డైనింగ్ సామగ్రిని విరాళంగా ప్రకటించారు. ఈ సందర్భంగా జొన్నగుడ్డి వద్ద ప్రభుత్వ పాఠశాలలో ఆర్వో ప్లాంట్‌ను, తదుపరి వైఎస్సార్ నగర్ వద్ద గల ప్రభుత్వ పాఠశాలలో ఆర్వో ప్లాంట్లు ద్వారపూడి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆర్వో ప్లాంట్ ను శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు ప్రారంభించారు. అదేవిధంగా ప్రేమసమాజమునకు అవసరమైన వంట డైనింగ్ సామగ్రి ని, తదుపరి ఫైర్ స్టేషన్ వద్ద నైట్ షెల్టర్ కు అవసరమైన వంట సామాగ్రి 4 ఫ్యాన్‌లను శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు అందజేశారు.

# సమష్టిగా కష్టపడండి

### టీడీపీ కార్యకర్తలకు పిలుపునిచ్చిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి




సాలూరు, (చైతన్యరథం): మక్కువ మండల తెలుగుదేశం పార్టీ సర్వసభ్య సమావేశం పార్టీ అధ్యక్షులు గుళ్ళ వేణుగోపాల నాయుడు ఆధ్వర్యంలో జరిగింది. సమావేశంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పాల్గొన్నారు. నాయకులు, కార్యకర్తలు మంగళ వాయిద్యాలతో, పూలవానతో ఘనంగా స్వాగతం పలికారు. 21 పంచాయతీల్లో పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత బలోపేతం చేయాలని, కార్యకర్తలే పార్టీకి పునాదులని మంత్రి పేర్కొన్నారు. నిత్యం ప్రజల్లో ఉంటూ, ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కారానికి కృషి చేయాలని నాయకులకు సూచించారు. రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు సమష్టిగా పని చేయాలని మంత్రి సంధ్యారాణి పిలుపునిచ్చారు.




# పారదర్శకంగా నిధుల వినియోగం జరగాలి

### వీఎమ్మార్డీఏ పనితీరుపై సమీక్షలో పీయూసీ చైర్మన్ కూన రవికుమార్

విశాఖపట్టణం, (చైతన్యరథం): వైజాగ్ మెట్రో రీజినల్ డెవలప్మెంట్ అథారిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, నిధుల వినియోగం, నియామకాలు, ఆదాయ, వ్యయాల వివరాలు, మొత్తం పనితీరుపై సమగ్రంగా సమీక్షించేందుకు అసెంబ్లీ పబ్లిక్ అండర్టేకింగ్స్ కమిటీ సమావేశాన్ని వైజాగ్ వీఎమ్మార్డీఏ కార్యాలయంలో నిర్వహించారు.? ఈ సమీక్ష సమావేశానికి రాష్ట్ర పీయూసీ చైర్మన్, ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అధ్యక్షత వహించారు. సమావేశంలో వీఎమ్మార్డీఏ ద్వారా అమలవుతున్న ప్రాజెక్టులు, ఆర్థిక వ్యవహారాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పీయూసీ సభ్యులుగా పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, ఎచ్చెర్ల ఎమ్మెల్యే, తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, పామర్రు ఎమ్మెల్యే కుమార్ రాజా వర్ల పాల్గొన్నారు. ఉన్నతాధికారులు, అసెంబ్లీ పీయూసీ కమిటీ అధికారులు కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూన రవికుమార్ మాట్లాడుతూ, "ప్రజాధనాన్ని అత్యంత పారదర్శకంగా వినియోగించాలన్నారు. అభివృద్ధి పనులు నిర్ణీత కాలపరిమితిలో పూర్తయ్యేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలి. ఆదాయ వనరులు పెంచుతూ, వ్యయాల్లో నియంత్రణ పాటించాలి"అని స్పష్టం చేశారు. నియామకాల విషయంలో నిబంధనలు పాటిస్తున్నారా, ఖాళీ పోస్టుల భర్తీ ఎలా జరుగుతోంది?, నిధుల కేటాయింపులు, ఖర్చుల మధ్య సమతుల్యత ఉందా? వంటి అంశాలపై సభ్యులు విస్తృతంగా చర్చించారు.

ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం కలిగే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచనలు చేశారు. వీఎమ్మార్డీఏ పనితీరును మరింత మెరుగుపరిచేందుకు అవసరమైన మార్గదర్శకాలు, సూచనలను పీయూసీ కమిటీ అధికారులు జవితీయు అధికారులకు అందించారు. భవిష్యత్తులో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

# బాలికల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ : ఎమ్మెల్యే శిరీష




రంపచోడవరం, (చైతన్యరథం): బాలికల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయిలో భరోసా కల్పిస్తుందని రంపచోడవరం ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. రంపచోడవరంలో శనివారం మండలవిద్యాశాఖాధికారి నరసింహా రావు అధ్యక్షతన జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమం లో ఆమె మాట్లాడుతూ భవిష్యత్తులో బాలికలే అన్ని రంగాల్లో దూసుకు పోతారన్నారు. వారికి ఇప్పటికే కూటమి సర్కార్ మంచి విలువలతో విద్య విధానాలు, ఆత్మరక్షణ కు కరాటే వంటి నైపుణ్య ములు కల్పించి చైతన్యం చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమాజంలో బాలికల ఎలా ఉండాలో వారి యొక్క హక్కులు పై చైతన్యం చేశారు. విద్య, భద్రత హక్కులతో పాటూ మంచి జీవనశైలి పై క్షుణ్ణంగా వివరించారు. మంచిగా చదువుకుంటూ ఉజ్వల భవిష్యత్తు సాధించుకోవాలని సూచించారు. దానికి గాను ప్రభుత్వం అందించే సహాయ సహకారాలు అందిపుచ్చు కోవాలని పేర్కొన్నారు. సమాన హక్కులు సమాన అవకాశాలు ఉండేలా ప్రభుత్వం చేస్తుందన్నారు. దానికి తన వంతుగా చేసే సహాయ చర్యల్లో ముందుంటానని పేర్కొన్నారు. అలాగే బాలికలతో అల్లూరి సీతారామ రాజుతో కలిసి ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు గొర్లె సునీత, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభాని, మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్,రావీజ వైస్ చైర్మన్ సలాది బాపిరాజు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు అడబాల బాపిరాజు, నియోజకవర్గం ఎస్టీ విభాగం అధ్యక్షులు పండా చెల్లన్న దొర, క్లస్టర్ ఇంచార్జి కారం సింహాచలం, జనసేన ప్రతినిధి పాపోలు శ్రీనివాసరావు, రంపచోడవరం సర్పంచ్ మంగా బొజ్జయ్య, సిద్ధా వెంకన్న దొర, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చోటు, షరీఫ్,మాజీ సర్పంచ్ నిరంజనీ దేవి,రమణ, సూరిబాబు, గణపతి, మండల విద్యాశాఖాధికారి నరసింహరావు, ఎంపీడీఓలు బీవీవీ ప్రసాద్, ఎస్.సాల్మన్ రాజ్, కిషోర్, శాంతకుమారి, సూపర్ వైజర్లు రవళి, చంద్రమ్మ, వెలుగు ఏపీఎం శ్రీరాములు పలు ప్రభుత్వశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చైతన్యరథం

# పాదయాత్రతో ప్రజానేతగా పరిణతి చెందిన యువనేత, డైనమిక్ మంత్రి నారా లోకేశ్

## టీడీపీ కేంద్ర కార్యాలయంలో కోలాహలంగా పుట్టిన రోజు వేడుకలు



నారా లోకేష్ చిన్నతనం నుంచే రాజకీయాల వాతావరణంలో పెరిగినప్పటికీ, తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును సంపాదించుకోవాలన్న స్పష్టమైన సంకల్పంతో ముందుకు సాగిన నాయకుడు. చదువులో నైపుణ్యం, ఆలోచనల్లో ఆధునికత, ప్రజాసేవపై స్పష్టమైన దృష్టితో రాజకీయాల్లోకి అడుగుపెట్టిన ఆయన, యువతను అర్థం చేసుకునే శైలితో తనదైన ముద్ర వేశారు. సాంకేతికతను పాలనతో మేళవించాలన్న ఆలోచనతో పాటు, పాదయాత్రల ద్వారా ప్రజల మధ్యకు వెళ్లి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్న అనుభవం ఆయన రాజకీయ ప్రయాణానికి బలమైన పునాదిగా నిలిచింది. పాలన అనేది అధికారమే కాదు, బాధ్యత అనే భావనను ఆచరణలో చూపిస్తూ, నేటి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో భవిష్యత్ దిశను సూచించే యువ నాయకుడిగా నారా లోకేష్ ప్రత్యేక స్థానం ఉంది. అలాంటి నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం పండగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఇది సాధారణ పుట్టినరోజు కార్యక్రమంలా కాకుండా, కార్యాలయం మొత్తం ఒక కుటుంబం కలిసి పండగ జరుపుకున్నట్లుగా కనిపించింది. సిబ్బంది ముఖాల్లో కనిపించిన ఆనందం, నేతల ఆత్మీయ పలకరింపులు, కార్యాలయంలో వెల్లివిరిసిన ఉత్సాహం ఈ రోజును మరింత ప్రత్యేకంగా మార్చాయి. నాయకుడి పుట్టినరోజు అనే భావనే అక్కడ ఒక పండగగా మారి, ప్రతి ఒక్కరిలోనూ కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ సందర్భంగా పార్టీ కేంద్ర కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందికి గోడ గడియారాలను బహుమానంగా అందజేశారు. సౌత్ ఆఫ్రికా ఎన్నారై టీడీపీ ప్రెసిడెంట్?, గన్నవరం నియోజకవర్గానికి చెందిన, పారా ఫౌండేషన్ చైర్మన్ పారా రామకృష్ణ ఈ కార్యక్రమానికి ముఖ్య స్పాన్సర్‌గా వ్యవహరించారు. సంస్థను ముందుకు నడిపించే సిబ్బంది శ్రమను గుర్తిస్తూ, సమయానికి విలువను గుర్తుచేసేలా ఇచ్చిన ఈ కానుక కార్యక్రమానికి ప్రత్యేకతను తీసుకొచ్చింది. నారా లోకేష్ పుట్టినరోజు ఆనందాన్ని సిబ్బందితో పంచుకోవాలన్న ఉద్దేశమే ఈ కార్యక్రమానికి ప్రధాన లక్ష్యంగా నిలిచింది. పార్టీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సిబ్బందిపట్ల కృతజ్ఞతాభావంతో, నారా లోకేష్ పై ఉన్న అభిమానంతో ఈ గోడ గడియారాలను టీడీపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు బహుకరించారు. ఈ పంపిణీ కార్యక్రమంలో పార్టీ కేంద్ర కార్యాలయ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబు, నాలెడ్జ్ సెంటర్ చైర్మన్ మాల్యాద్రి, నాలెడ్జ్ సెంటర్ ఇన్‌చార్జి అనిల్ కుమార్, ప్రోగ్రామింగ్ డిపార్ట్మెంట్ ఇన్‌చార్జి రాంబాబు, టీడీపీ లీగల్ సెల్ సెక్రటరీ పారా కిశోర్, ఎన్నారై టీడీపీ సెల్ కోఆర్డినేటర్ చప్పిడి రాజశేఖర్, తెలుగు యువత అధికార ప్రతినిధి బందారు వంశీ కృష్ణ, పీఆర్కే ఫౌండేషన్ చైర్మన్ పారా రామకృష్ణ



పాల్గొని సిబ్బందిని ఆత్మీయంగా పలకరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, పాదయాత్రల ద్వారా ప్రజల మధ్య తిరిగి నేర్చుకున్న అనుభవమే నారా లోకేష్ నాయకత్వానికి బలమని తెలిపారు. ప్రజలతో నేరుగా మమేకమయ్యే శైలి, పాలనలో బాధ్యతాయుతమైన దృక్పథం ఆయనను యువ నాయకుడిగా ప్రత్యేకంగా నిలబెడుతున్నాయని పేర్కొన్నారు. నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా ఏర్పడిన ఈ పండగ వాతావరణం, పార్టీ కేంద్ర కార్యాలయంలో పనిచేస్తున్న సిబ్బందిలో కొత్త ఉత్సాహాన్ని నింపిందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఒక నాయకుడి పుట్టినరోజు, సంస్థ మొత్తం కలిసి జరుపుకునే పండగలా మారడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచింది.

# భేష్ బాగా పని చేస్తున్నారు...!

## బెజవాడ ఆసుపత్రి సిబ్బందికి ఎంపీ కేశినేని శివనాథ్ అభినందనలు

విజయవాడ, (చైతన్యరథం): ప్రతిరోజు నాలుగు వేలకి పైగా ఓపీ చూసే విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో నర్సింగ్ సిబ్బంది



ఎదుర్కొంటున్న చిన్న చిన్న సమస్యలను రెండు మూడు నెలల్లో ప?రిష్కరిస్తామని, పెద్ద సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు. విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో శనివారం ఎంపీ కేశినేని శివనాథ్ నర్సింగ్ సిబ్బందితో ప్రత్యేక స?మావేశం నిర్వ?హించారు. నర్సింగ్ సిబ్బందితో మాటాడారు. ఎంపీ కేశినేని శివనాథ్ మీడియాతో మాట్లాడుతూ బ్యాక్ ఎండ్ ఆపరేటర్లు మరింత అవసరమని పేర్కొన్నారు. తాత్కాలిక ఉద్యోగాల నియామకంలో కొంత సమస్య ఉందని కూడా తెలిపారు. నర్సింగ్ సిబ్బంది ఎదుర్కొంటున్న చిన్న సమస్యలను రాబోయే ఆసుపత్రి కమిటీ సమావేశంలో చర్చించి వెంటనే పరిష్కరిస్తామని, పెద్ద సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తామని ఎంపీ హామీ ఇచ్చారు. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ రోగులకు సేవలందించడంలో నర్సింగ్ సిబ్బంది ఎక్కడా రాజీపడకుండా అంకితభావంతో పనిచేస్తున్నారని ఎంపీ కేశినేని శివనాథ్ అభినందించారు.

# వందేమాతరం రచనకు 150 ఏళ్ళు

## నన్నయ యూనివర్సిటీలో ఘనంగా వేడుకలు

రాజమహేంద్రవరం, (చైతన్యరథం): వందేమాతరం గీత రచనకు 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా రాజమహేంద్రవరంలోని నన్నయ విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రుడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, రాజానగరం నియోజకవర్గ ఇంచార్జ్ బొడ్డు వెంకటరమణ చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొడ్డు వెంకటరమణ చౌదరి మాట్లాడుతూ, వందేమాతరం గీతం భారత స్వాతంత్ర్య ఉద్యమానికి ప్రేరణగా నిలిచిందన్నారు. దేశభక్తి భావాలను యువతలో మరింత పెంపొందించడంలో ఈ తరహా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. వందేమాతరం వంటి దేశభక్తి గీతాలు భారతీయుల హృదయాల్లో జాతీయ ఐక్యత, త్యాగభావం, దేశప్రేమను నాటాయని పేర్కొన్నారు. విద్యార్థులు దేశభక్తి, సేవాభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



# చెత్తరహిత పట్టణంగా నిడదవోలు

## స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర'లో పర్యాటక మంత్రి కందుల దుర్గేష్ పిలుపు

నిడదవోలు, (చైతన్యరథం): పరిశుభ్రత అనేది కేవలం ఒక కార్యక్రమంలా కాకుండా, ప్రతి ఒక్కరి జీవన విధానంలో భాగం కావాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర సంకల్పంలో భాగంగా శనివారం నిడదవోలు పట్టణంలోని గణేష్ చౌక్ వద్ద నిర్వహించిన 'స్వచ్ఛాంధ్ర – స్వచ్ఛ దివస్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి నెల మూడవ శనివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా, పురపాలక సంఘం చైర్మన్ భూపతి ఆదినారాయణ ఆధ్వర్యంలో పలు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్యాన్ని కాపాడటంలో నిరంతరం శ్రమిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది సేవలను కొనియాడారు. వారిని ఘనంగా సన్మానించి, శానిటేషన్ కోట్లను పంపిణీ చేశారు. సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్



మాట్లాడుతూ పిల్లలకు చిన్నతనం నుంచే పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించాలని, అప్పుడే ఆరోగ్యకరమైన సమాజం సాధ్యమవుతుందని తెలిపారు. ప్రజలు తమ ఇళ్ల వద్దే తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని తద్వారా నిడదవోలును చెత్తరహిత పట్టణంగా, ఆంధ్రప్రదేశ్?ను స్వచ్ఛమైన రాష్ట్రంగా తీర్చిదిద్దుకోవాలని తెలిపారు. పారిశుద్ధ్య సిబ్బంది కోసం ఎదురుచూడకుండా, తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని గుర్తుచేశారు. రోడ్లపై చెత్త వేయడం మానుకోవాలని హితవు పలికారు. వ్యర్థాలను రీసైక్లింగ్ చేయడం ద్వారా 'జీరో వేస్ట్' గ్రామాలను, పట్టణాలను నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల భాగస్వామ్యంతోనే ఏ కార్యక్రమం అయినా విజయవంతం అవుతుందన్నారు. ఈ సందర్భంగా వేదికపై కళాకారులు ప్రదర్శించిన బుర్రకథ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. బుర్రకథ ద్వారా స్వచ్ఛతపై చక్కని అవగాహన కల్పించిన కళాకారులను మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం అందరితో కలిసి మానవహారం నిర్వహించి, స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం చైర్మన్ భూపతి ఆదినారాయణ, కమిషనర్ కృష్ణవేణి, కౌన్సిలర్లు, కూటమి నాయకులు మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ నగరంగా విజయవాడ ముందడుగు

## ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ పిలుపు



విజయవాడ, (చైతన్యరథం): ఎన్డీయే కూట?మి ప్ర?భుత్వం అభివృద్ధి, సంక్షేమం తో పాటు రాష్ట్రాన్ని పరిశ్రు భంగా ఉం అడుగు వేస్తోందని స్వచ్ఛ నగరంగా విజయవాడ ఎప్పుడు ముందు ఉండాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. శనివారం ఉదయం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు విజయవాడ నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఎలక్ట్రిసిటీ కాలనీ, పటమటలో నిర్వహించిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా కేశినేని శివనాథ్, తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన అవగాహన స్టాల్స్ ను సందర్శించారు. అనంత?రం జోనల్ కమిషనర్ కె. షమ్మీ అందరితో స్వచ్ఛత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ విజయవాడను ఎల్లప్పుడు స్వచ్ఛ నగరంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించడం వల్ల ప్రజలలో స్వచ్ఛతపై అవగాహన కలగటమే కాకుండా వారి దినచర్యలో ఒక భాగమైపోయింది అన్నారు. విజయవాడ నగరాభివృద్ధికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడు సహకరిస్తుందని, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకుంటుందని అన్నారు. వరదల సమయంలో నూతన సాంకేతికతను ఉపయోగించి పారిశుధ్య పనులు నిర్వహించామన్నారు. ప్రజలు పర్యావరణహితమైన వస్తువులను వాడాలని, ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. అదే విధంగా సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడాకానికి ప్రత్యామ్నాయంగా పర్యావరణహితమైన గుడ్డ సంచులను వాడాలని పిలుపునిచ్చారు. తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ విజయవాడ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ స్వచ్ఛతపై బాధ్యతగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంటి వద్దనే వ్యర్థాలను విభజించి, పారిశుధ్య కార్మికులకు అందించాలని కోరారు. ఇంటింటి వ్యర్ధాల సేకరణ జరిగేటప్పుడు తడి చెత్త, పొడి చెత్తగా విభ?జించి వ్యర్ధాలు ఇవ్వడం ద్వారా వ్యర్ధాల నుండి సంపద సృష్టించవచ్చని అన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ నెల జీరో గ్యాప్ శానిటేషన్ అంశంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారని, పారిశుధ్య నిర్వహణలో ఎటువంటి లోటు లేకుండా విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఎప్పటికప్పుడు వ్యర్ధాలను తొలగిస్తూ ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పరిశుభ్రమైన వాతావరణం కల్పిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, శాలివాహన, కుమ్మరి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ పేరేపి ఈశ్వర్, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్య?క్షుడు సొంగా సంజయ్ వర్మ, టీఎన్‌టీరాష్ట్ర ఉపాధ్య?క్షుడు పరుచూరి ప్రసాద్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యుసిడి) పి. వెంకటనారాయణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల నాయక్, బయాలజిస్ట్ వి.కామేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, సిబ్బంది తో పాటు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో రథసప్తమి

తిరుచానూరు, (చైతన్యరథం): శ్రీ పద్మావతీ అమ్మవారు జనవరి 25న రథసప్తమి పర్వదినం సందర్భంగా ఏడు ప్రధాన వాహనాలపై అమ్మవారు ఊరేగి భక్తులను అనుగ్రహించనున్నారు. ఉదయం 7 నుండి 8 గంటల వరకు సూర్యప్రభ వాహనం, ఉదయం 8.30 నుండి 9.30 గంటల వరకు హంస వాహనం, ఉదయం 10 నుండి 11 గంటల వరకు అశ్వ వాహనం, ఉదయం 11.30 నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు గరుడ వాహనంపై విహ?రించి భ?క్తుల?ను క?టాక్షించ?నున్నారు. మధ్యాహ్నం 1 నుండి 2 గంటల వరకు చిన్నశేష వాహనం, సాయంత్రం 6 నుండి రాత్రి 7 గంటల వరకు చంద్రప్రభ వాహనం, రాత్రి 8.30 నుండి 9.30 గంటల వరకు గజ వాహనంపై దర్శనమిస్తారు. సాయంత్రం 3.30 నుండి 4.30 గంటల వరకు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలోని శ్రీ కృష్ణస్వామి ముఖ మండపంలో అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో నిర్వహించే కల్యాణోత్సవం, కుంకుమార్చన, బ్రేక్ దర్శనం, ఊంజల సేవ, వేదాశీర్వచనాలను టీటీడీ రద్దు చేసింది. అదేవిధంగా, శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయం పక్కనే ఉన్న శ్రీ సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో ఉదయం 6 నుండి 7 గంటల వరకు స్వామివారు అశ్వవాహనాన్ని అధిష్టిస్తారు.

# భూమితల్లి జోలికెళ్లి అభాసుపాలైన జగన్

అమరావతి, (చైతన్యరథం): రాష్ట్రంలో రైతులు కంటికి రెప్పలా చూసుకుంటూ, కన్నతల్లిలా కాపాడుకునే భూములను సమగ్ర సర్వే పేరుతో అస్తవ్యస్తం చేసి తాత ముత్తాతల నుంచి ఉన్న హక్కులను కూడా కాలరాసి నిస్సిగ్గుగా, అదో పెద్ద ఘనకార్యంగా జగన్ రెడ్డి ప్రచారం చేసుకుంటున్నారని, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అమరావతిలో శనివారం అయిన విలేకరులతో మాట్లాడుతూ భూయజ్ఞం పేరుతో రైతుల భూములను స్వాహ్ చేశారని యజ్ఞం అంటే అంటే త్యాగం. కానీ జగన్ చేసింది స్వాహ్ చేసే స్వాహ్ హెూమమని ప్రజల ఆస్తులు దిగమింగే యజ్ఞమని ఆయన విమర్శించారు. రీసర్వే పేరుతో శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు వైసీపీ నేతలు చేసిన భూదందాకు, పేదల భూములు దర్జాగా కబ్జా కోసం తెచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ తోనే జగన్ రెడ్డిని 11 సీట్లకు రాష్ట్ర ప్రజలు పరిమితం చేశారని ఆయన ఎద్దేవా చేశారు రైతులతో మమేకమై జరపాల్సిన రీసర్వేను అస్తవ్యస్తం చేసి ఉన్న సమస్యలు పరిష్కరించకుండా కొత్త సమస్యలు సృష్టించారన్నారు. రాష్ట్రంలో నెలకొన్న రెవెన్యూ సమస్యలకు ముమ్మాటికీ కారణం జగన్ రెడ్డే అని ఆయన ఆరోపించారు ఇడుపులపాయలో అసైన్డ్ భూముల కుంభకోణం నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, నవ్యాంధ్రప్రదేశ్లో వైసీపీ భూ అక్రమాలను ప్రజలు ఇంకా మరిచిపోలేదని ఆయన తెలిపారు. అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నువ్వు కూల్చేసిన ప్రజావేదిక సాక్షిగా దేశంలోనే మొట్టమొదటిసారిగా భూదాన్ కార్యక్రమాన్ని ప్రారంభించి ఒక్కో భూమికి ఆధార్ తరహా 11 అంకెల సంఖ్యను అందించి రైతుల భూరికార్డులను సురక్షితంగా అందించే కార్యక్రమాన్ని చేపట్టామని ఆయన తెలిపారు. దశాబ్దాలుగా నెలకొన్న భూవివాదాలకు శాశ్వత భూహక్కు, విశిష్ట గుర్తింపు సంఖ్య ఇచ్చే ఈ కార్యక్రమాన్ని అటకెక్కించి "జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష" అనే కార్యక్రమాన్ని చేపట్టి మా క్రెడిట్ కొట్టేసిన క్రిమినల్ జగన్ కాదా అని ఆయన ప్రశ్నించారు. ఆ కార్యక్రమమైనా సక్రమంగా వెలగబెట్టాడా అంటే అదీ లేకపోగా దాన్ని కూడా అస్తవ్యస్తం చేశావని ఎద్దేవా చేశారు. శాశ్వత హక్కులు దేవుడెరుగు. ఉన్న హక్కులను దిగ మింగారన్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు సొంత జిల్లా కడప లో ఒంటిమిట్ట మండలం కొత్త మాధవరానికి చెందిన చేనేత వర్గానికి చెందిన సుబ్బారావు అతనికూతురు ఆత్మహత్య సుకున్న విషయం వాస్తవం కాదా? అని ఆయన ప్రశ్నించారు. సర్వే నంబర్ 218 7/2 లో 3.10 ఎకరాలు కడప రేణిగుంట హైవే పక్కన ఉన్న భూమిని కొట్టేసేందుకు ఆ ఫ్యామిలీని రోడ్డున పడేశారని ఆయన విమర్శించారు. సూసైడ్ లెటర్‌లో కూడా స్పష్టంగా చెప్పారు. వారసత్వంగా సక్రమించిన భూమిని వైసీపీ నేతలు రికార్డులు తారుమారు చేసే లాక్కున్నారని



అప్పులు తీర్చలేక కుటుంబంతో సహా ఆత్మ చేసుకుంటున్నట్టు చెప్పారని ఆయన తెలిపారు సొంతంగా వచ్చిన భూమ్మీద కూడా హక్కులు లేకుండా చేసిన ఘనత జగన్‌రెడ్డిదేనన్నారు. ప్రైవేటు వ్యక్తుల ఆస్తి పత్రాలపై జగన్ బొమ్మ వేసుకోవడం సిగ్గుచేటు అన్నారు వైసిపి హయాంలో జరిగిన జగనన్న భూ సర్వేలో అడ్డగోలుగా తప్పుల తడకగా పాస్ పుస్తకాలు జారీ చేశారని ఆయన విమర్శించారు. సర్వే సమస్యలపై స్పందించే రాష్ట్ర స్థాయి అధికారులు లేదని పొలాల్లో ఈ వ్యవసాయ పనులు చేసుకోవాల్సిన రైతులను రోడ్డు ఎక్కించి వారి హక్కుల కోసం ఆందోళన చేయాల్సిన పరిస్థితి సృష్టించారన్నారు. టీడీపీ హయాంలో వెబ్ ల్యాండ్, ఈ పాస్ బుక్కు డిజిటల్ ల్యాండ్, రికార్డ్,వెబ్ ల్యాండ్ ప్రారంభమైన విషయం వాస్తవం కాదా? అని ఆయన ప్రశ్నించారు కూటమి ప్రభుత్వం అభివృద్ధిపై స్టిక్కర్లు వేయించుకున్న చరిత్ర జగన్‌దేనని పాతర్ల రమేష్ విమర్శించారు.

# గంజాయి గజ దొంగలపై ఉక్కుపాదం : ఎస్పీ వీ విద్యాసాగర్ నాయుడు వెల్లడి

హనుమాన్ జంక్షన్, (చైతన్యరథం): ఆత్కూరు పోలీస్ స్టేషన్ పరిధిలో పట్టుకున్న గంజాయికి సంబంధించి ఎస్పీ వివిద్యాసాగర్ నాయుడు, జిల్లా పోలీస్ పెరేడ్ మైదానంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కేసు పూర్వాపరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ శ్రీ వివి నాయుడు, అడిషనల్ ఎస్పీ బి సత్యనారాయణ, గన్నవరం డిఎస్పి సిహెచ్ శ్రీనివాసరావు ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా జిల్లా ఎస్పీ శ్రీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు గంజాయి, మాదకద్రవ్యాలు, మత్తు పదార్ధాల వంటి వానవాళ్లు జిల్లాలో కనబడకుండా పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. హనుమాన్ జంక్షన్ ఎస్సై రమేష్ ఆత్కూరు ఎస్సైకి వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు చిన్నవుటపల్లి, మధుకాన్ కటింగ్ దగ్గరలో వాహనాలు తనిఖీ చేస్తూ ఉండగా ఇద్దరు వ్యక్తులను చూస్తుండగా ఇద్దరినీ పిన్నమనేని హాస్పిటల్ వెనుక వైపు, ఆదిత్య వెంచర్స్, గంగనమ్మ



గుడి దగ్గరలో పట్టుకొని తనిఖీ చేసి వారివద్ద నుండి సుమారు 171.2 కేజీల గంజాయిని, రెండు సెల్ ఫోన్ లు, ఐషర్ వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిలు గాజువాకకు చెందిన హనుమంతు దుర్గా ప్రసాద్, కర్ణాటక రాష్ట్రంలోని, కోలార్ నగరానికి చెందిన సయ్యద్ ముబారక్ ఏ బషీర్‌లను అదుపులోకి తీసుకున్నారు. వాహనంలో తరలిస్తున్న గంజాయిని అనకాపల్లి నుండి ఒక వ్యక్తి వాహనంతో సహాపై ముద్దాయిలకు ఇచ్చి కర్ణాటక రాష్ట్రంలో ఒక వ్యక్తి కి ఇవ్వండి, మీరు ఎక్కడ తనకి సరుకు అందజేయాలో తను ఫోన్ ద్వారా నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఉంటాడని చెప్పగా, ముద్దాయిలు గంజాయి ఉన్న వాహనాన్ని తీసుకొని వస్తుండగా ఆత్కూరు పోలీసు లు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గంజాయి, మాదకద్రవ్యాలు, మత్తు పదార్ధాల వంటివి యువత జీవితాలను నిర్వీర్యం చేయడమే కాక వారి బంగారు భవిష్యత్తును అందకుండా చేస్తుందన్నారు. ఎవరికైన గంజాయి అక్రమ రవాణా, విక్రయాలు వంటి వాటికి సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే సమీప పోలీసులకు, ఈగల్ టీంకు సమాచారం అందిస్తే అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. అదుపులోనికి తీసుకున్న ముద్దాయిలను విచారించి గంజాయికి సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించి జిల్లాలో గంజాయి రవాణా, విక్రయలు వంటివి జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. గంజాయి రవాణాకు సంబంధించి పూర్వాపరాలను విచారిస్తామని తెలిపారు. గంజాయిను తరలించే వారిని చాకచక్యంగా పట్టుకున్న గన్నవరం డీఎస్పీ, హనుమాన్ జంక్షన్ ఇన్స్పెక్టర్, ఆత్కూరు ఎస్సై, వారి సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

# అభివృద్ధి కార్యక్రమాలతో ఇంటింటా ఆనందం

## అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వెల్లడి



నెల్లూరు, (చైతన్యరథం): సీఎం చంద్రబాబు నాయుడు పాలనలో ప్రతి ఇంటా సంతోషం వెల్లివిరుస్తోందని నెల్లూరు పార్లమెంటు సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి అన్నారు. శనివారం ఇందుకూరుపేట మండలం సోమరాజుపల్లి గ్రామంలో వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వీపీఆర్ అమృతధార వాటర్ ప్లాంట్, అలాగే 78 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలలో వారు పాల్గొన్నారు. గ్రామానికి చేరుకున్న వీపీఆర్ దంపతులకు టీడీపీ నాయకులు దేవి రెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు కార్యకర్తలు గ్రామస్తులు స్వాగతం పలికారు. అనంతరం వాటర్ ప్లాంట్‌ను, స్వచ్ఛ సర్వేక్షన్ మొబైల్ వ్యాన్‌ను, అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ తాము రాజకీయాల్లోకి వచ్చింది సేవ చేయడానికేనన్నారు. ప్రతి ఒక్కరి ముఖాల్లో సంతోషం కనిపిస్తోందని చెప్పారు. జిల్లాలో 190 వాటర్ ప్లాంట్ లు ఏర్పాటు చేశామని, అన్ని ప్లాంట్ల నిర్వహణ కూడా విపిఆర్ ఫౌండేషన్ చూస్తోందన్నారు. అన్ని వాటర్ ప్లాంట్లు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని చెప్పారు. కోవూరు నియోజకవర్గ పరిధిలో 25 వాటర్ ప్లాంట్‌లు పెట్టామని, అవసరమైన ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేస్తామన్నారు. ఇటీవల విపిఆర్ నేత్ర ను ప్రారంభించి గ్రామీణులకు కంటి పరీక్షలు చేస్తున్నామన్నారు. త్వరలోనే కోవూరులో కూడా ఈ సేవలు ప్రారంభిస్తామని చెప్పారు. ప్రతి గ్రామానికి విపిఆర్ నేత్ర బస్సు వస్తుందని, ప్రజలు సద్వినియోగం చేయించుకోవాలన్నారు. ఉదయగిరిలో నాలుగు మండలాల్లో ఇప్పటివరకు 17 వేల మందికి కంటి పరీక్షలు చేశామని, 9 వేల మందికి అద్దాలు అందించామన్నారు. నడవలేని ఎంతో మంది దివ్యాంగులకు ఉచితంగా ట్రై సైకిల్స్ అందించామని స్పష్టం చేశారు.

ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ సోమరాజుపల్లి గ్రామస్తుల కోసం ఏదైనా చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. గ్రామంలో ఈరోజు 32 లక్షలతో పంచాయతీ భవనం, 32 లక్షలతో విలేజ్ హెల్త్ క్లినిక్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు వేయిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా సీఎం చంద్రబాబు గారు పాలన చేస్తున్నారని వివరించారు. ఆర్థిక ఇబ్బందులున్నా కూడా ప్రజలకు ఏం అవసరమో అవి అందజేస్తున్నారని చెప్పారు. తల్లికి వందనం, మహిళలకు ఫ్రీ బస్సు అమలు చేస్తున్నారన్నారు. రైతుల ఇబ్బందులు తొలగించేలా ల్యాండ్ యాక్ట్ ను రద్దు చేశారన్నారు. కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు ఇస్తున్నట్లు చెప్పారు. అన్నదాత సుఖీభవ కింద 20 వేలు, మత్స్యకారసేవలో పథకం కింద మత్స్యకారులకు 20 వేలు అందించారన్నారు. ట్రూ డౌన్ పేరుతో ప్రభుత్వం విద్యుత్ యూనిట్‌పై 13 పైసలు తగ్గించిందని పేర్కొన్నారు. ఇది పేదల ప్రభుత్వమని, ప్రజల ప్రభుత్వమన్నారు. మంత్రి నారా లోకేష్ సహకారంతో రాష్ట్రంలో విద్యాశాఖ అభివృద్ధి చెందుతోందన్నారు. ఇఫ్కో కిసాన్ సెజ్‌లో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో పరిశ్రమలు వస్తున్నాయన్నారు.

దీని ద్వారా యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు యువకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. వీరికి వేమిరెడ్డి దంపతులు టిడిపి కండువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేంద్ర, మీావీజు డైరెక్టర్ రావెళ్ల వీరేంద్ర నాయుడు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఏకొల్లు పవన్ కుమార్ రెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, జిల్లా టిడిపి అధికార ప్రతినిధి చెంచు కిషోర్ యాదవ్, దేవిరెడ్డి చంద్రబాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుండి

## గోవిందరాజస్వామి తెప్పోత్సవాలు

తిరుపతి, (చైతన్యరథం): తిరుపతిలోని శ్రీ గోవిందరాజస్వామివారి ఆలయంలో జనవరి 26 నుండి ఫిబ్రవరి 01వ తేదీ వరకు తెప్పోత్సవాలు జరుగనున్నాయి. ఏడు రోజుల పాటు సాయంత్రం 6.30 నుండి రాత్రి 8 గంటల వరకు స్వామివారు దేవేరులతో కలిసి శ్రీ గోవిందరాజస్వామివారి పుష్కరిణిలో తెప్పలపై విహరిస్తారు. ఆ త రువాత ఆలయ మాడ వీధుల్లో ఊరేగి భక్తులను అనుగ్రహిస్తారు. జనవరి 26న శ్రీ కోదండరామస్వామివారు, జనవరి 27న శ్రీ రుక్మిణి, సత్యభామ సమేత శ్రీ పార్థసారథిస్వామి, జనవరి 28న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి, జనవరి 29న ఆండాళ్ అమ్మవారితో కలిసి శ్రీకృష్ణస్వామివారు, జనవరి 30, 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో అమ్మవార్లతో శ్రీ గోవిందరాజస్వామి తెప్పలపై భక్తులకు కనువిందు చేయనున్నారు. చివరి రోజు తెప్పోత్సవం అనంతరం ఎదురు ఆంజనేయస్వామి సన్నిధికి స్వామి వేంచేపు చేస్తారు.

# జీరో గ్యాప్ శానిటేషన్ అవగాహన

నెల్లూరు, (చైతన్యరథం): నగరంలోని 47, 48 డివిజన్ల క్లస్టర్ పరిధిలో స్వచ్ఛ ఆంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జీరో గ్యాప్ శానిటేషన్ ఆంధ్రప్రదేశ్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కోటమిట్ట మున్సిపల్ ప్రైమరీ స్కూల్లో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రజలు, విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించింది. సాసా ప్రోగ్రాం కింద పాఠశాల పిల్లల వ్యక్తిగత పరిశుభ్రత, పాఠశాలలు, ప్రజా టాయిలెట్ల పరిశీలన, శానిటేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం క్లస్టర్ ఇంచార్జ్ ధర్మవరం సుబ్బారావు ఆధ్వర్యంలో జరగగా, డిప్యూటీ మేయర్ ఇంతియాజ్, అడిషనల్ కమిషనర్ వాసు, 47 డివిజన్ టిడిపి ఇన్చార్జ్ డాక్టర్ గణేష్ కుమార్, సంబంధిత సచివాలయ సిబ్బంది, పొలిటికల్ టీం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, చిన్నప్పటి నుంచే పరిశుభ్రత అలవాట్లు పెంపొందిస్తే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించవచ్చని తెలిపారు. శిథిలావస్థలో ఉన్న స్థానిక పబ్లిక్ టాయిలెట్‌లను పరిశీలించి మంత్రి దృష్టికి తీసుకెళ్లి తక్షణమే చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.




# పేర్ని నాని నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలి

**నీ రాజకీయ ఉనికి కోసం కూటమిపై విమర్శలు తగవు**

**మంత్రి అనగాని సత్యప్రసాద్ పై విమర్శలు సిగ్గుచేటు**

**ముందు అనగాని కుటుంబ చరిత్ర తెలుసుకుని మాట్లాడాలి**

**పద్మశ్రీలు, ఐఆర్‌ఎస్ లు కలిగిన కుటుంబం అనగానిది**

**ల్యాండ్ టైటిల్ యాక్ట్ పేరుతో రైతుల భూములను దోచుకున్న చరిత్ర మీది**

**రాజముద్రతో పాస్ బుక్ లు ఇచ్చి రైతులకు ఓ భరోసా కల్పిస్తున్నాం**

**పాత్రికేయుల సమావేశంలో టీడీపీ జిల్లా అధ్యక్షులు గురుమూర్తి**

మచిలీపట్నం, (చైతన్యరథం): పట్టాదార్ పాస్ పుస్తకాల జారీపై మాజీ మంత్రి పేర్ని నాని కూటమి ప్రభుత్వంపై చేసిన విమర్శలను రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్, తెలుగుదేశం పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షులు వీరంకి వెంకట గురుమూర్తి తీవ్రంగా ఖండించారు. శనివారం సాయంత్రం జిల్లా కేంద్రం మచిలీపట్నంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేర్ని నాని నోటికి ఇష్టమొచ్చినట్టు మాట్లాడుతున్నాడని, భూములు కొట్టేసినోళ్లే భూహక్కు చట్టం గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ పై విమర్శలు చేసే ముందు ఆయన గురించి తెలుసుకుంటే బాగుండేదన్నారు. అనగాని సత్యప్రసాద్ అనే వ్యక్తి నీలా చిల్లర డబ్బులకు లొంగిపోయే నాయకుడు కాదన్నారు. తెలుగుదేశం పార్టీలో నిబద్ధత గల నాయకుల్లో అనగాని ఒకరని అన్నారు. అటువంటి వ్యక్తిపై వ్యక్తిగత, నిరాధార ఆరోపణలు చేయడం గర్హనీయమన్నారు. ఎంతో ఉన్నతమైన విలువలు కలిగిన వ్యక్తి సత్య ప్రసాద్ అని, తన సొంత డబ్బుతో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. నీలా గోడౌన్‌లో పేదల బియ్యాన్ని దొంగిలించిన వ్యక్తి కాదన్నారు. దొంగే దొంగ అన్నట్టు పేర్ని నాని మాటలు ఉన్నాయన్నారు. ప్రజలు అధికారం ఇస్తే ఐదేళ్లు కండకావరంతో వ్యవహరించారన్నారు. ఏ ముఖ్యమంత్రి కూడా పట్టాదార్ పాస్ పుస్తకాలపై తన ఫోటో వేసుకోలేదన్నారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ పేరుతో జగన్ పేద రైతుల భూములను కబ్జా చేసే ప్రయత్నం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు భరోసా కల్పించేలా రాజముద్రతో పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇస్తుంటే ఓర్చుకోలేని జగన్ పేర్ని నాని లాంటి వాళ్లతో తమ ప్రభుత్వంపై కువిమర్శలు చేయిస్తున్నారని ధ్వజమెత్తారు. కల్తీ మద్యం కేసులో బెయిల్ పై వచ్చిన జోగి రమేష్ తీరుపై కూడా గురుమూర్తి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బీసీలపై చంద్రబాబు, లోకేష్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని పాడిందే పాట పాడుతున్న జోగి రమేష్ గడిచిన ఐదేళ్ల వైసీపీ హయాంలో ఎంత మంది టీడీపీ బీసీ నేతలను కక్ష సాధింపుల చర్యలకు దిగారో చెప్పాలన్నారు. కల్తీ మద్యంతో సామాన్య, మధ్య తరగతి ప్రజల ప్రాణాలను హరించిన జోగి రమేష్ చంద్రబాబు, లోకేష్ లపై విమర్శలు చేయడం గర్హనీయమన్నారు. కల్తీ మద్యం కేసులో చంద్రబాబు, లోకేష్ ఎందుకు ప్రమాణం చేయాలో చెప్పాలన్నారు. నాడు చంద్రబాబు ఇంటిపై దాడికి ఎందుకు వెళ్లావో ప్రమాణం చేసి చెప్పే దమ్ము జోగి రమేష్ కు ఉందా అని ప్రశ్నించారు. వైసీపీ నేతలు తమ ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకుని ప్రజా క్షేత్రంలో పోరాడితే మంచిదన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై పేర్ని నాని అవాకులు, చవాకులు పేలడం మానుకోవాలన్నారు. అధికారం కోల్పోయిన తర్వాత పేర్ని నాని మతిభ్రమించి మాట్లాడుతున్నాడని ధ్వజమెత్తారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్ పేరుతో పేద రైతుల భూములను కొల్లగొట్టిన చరిత్ర వైసీపీది అని విమర్శించారు. రైతుల మనోవేదనను అర్థం చేసుకున్న చంద్రబాబు అధికారంలోకి రాగానే ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దుపై తొలి సంతకం చేశారన్నారు. జగన్ ఫోటోలతో ఉన్న పాస్ పుస్తకాలను రద్దు చేసి ప్రభుత్వ రాజముద్రతో కూడిన పాస్ పుస్తకాలను అందిస్తున్నామన్నారు. ఇప్పటికైనా జగన్, పేర్ని నాని బుద్ధి తెచ్చుకోవాలన్నారు. ఏదైనా మాట్లాడాలంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలన్నారు. రాజకీయ అస్త్రసన్యాసం చేసిన పేర్ని నాని పట్టాదార్ పాస్ పుస్తకాల గురించి మాట్లాడటం సిగ్గుచేటు అన్నారు. రాజకీయంగా టీడీపీని ఎదుర్కొలేక పారిపోయి తన కుమారుడిని పోటీలో ఉంచి బలి పశువును చేసిన వ్యక్తి పేర్ని నాని అని విమర్శించారు. బియ్యం దొంగతనం కేసులో తెచ్చుకున్న ముందస్తు బెయిల్ రేపోమాపో రద్దు అయి జైలుకు వెళ్లే వ్యక్తి కూడా పేర్ని నానినే అన్నారు. రాజకీయంగా మనుగడను కాపాడుకునేందుకే పేర్ని నాని కూటమి ప్రభుత్వం విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. పేర్ని నాని మాటలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు మోటమర్రి బాబా ప్రసాద్, ప్రచార కార్యదర్శి బత్తిన దాస్ తదితరులు పాల్గొన్నారు.



# బీసీలకు అండగా కూటమి ప్రభుత్వం

## బీసీ సంఘాల చర్చావేదికలో మంత్రి సవిత వెల్లడి



విజయవాడ, (చైతన్యరథం): గొల్లపూడి బీసీ భవనంలో బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత అధ్యక్షతన బీసీ సంఘాల చర్చావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు నూకాలమ్మ, ఆదిశేషులు, వెంకటేష్‌రమణ రాజు కృష్ణాజి రావు, ప్రసన్నకుమార్, దేవి అమర్నాథ్, శ్రీకాకుళం సురేష్ నాయుడు మళ్లీ నాయుడు వైజాగ్ నరసింహారావు, రాజమండ్రి మల్లేష్ మొదలైన బీసీ నాయకులు వివిధ సంఘాల బీసీ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ మినిస్టర్ సవిత బీసీ నాయకులు చర్చించారు. చట్టసభల్లో చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు, స్థానిక సంస్థల్లో బీసీలకు రిజర్వేషన్లు నామినేట్ పదవుల్లో బీసీలకు రిజర్వేషన్లు బీసీలకు రక్షణ చట్టం అనే అంశాలపై బీసీ సంఘాలు అహర్నిశలు పోరాడుతున్నాయన్నారు. అలాగే జాతీయ బీసీ సంక్షేమ సంఘం ముఖ్యమైన డిమాండ్లలో మిగతా అంశలైన బీసీలకు ఆర్థిక పరిపుష్టి కలిగించాలని, కేంద్ర సంస్థ ద్వారా నిధులు మంజూరు చేయించి జనాభా నిష్పత్తి ప్రకారం బీసీలలో ఎన్ని కులాలు ఉన్నాయో అన్ని కులాల వారికి తగిన లోన్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. మంత్రి నారా లోకేష్ తన పాదయాత్ర, గత వైసిపి ప్రభుత్వం బీసీలపై చేసిన దాడులు హత్యలు చేసి బీసీలను భయభ్రాంతులకు గురిచేసిందని వక్తలు పేర్కొన్నారు. లోకేష్ బాబు వీటి అన్నిటిపై సమగ్ర విచారణ చేసి బీసీలకు రక్షణ చట్టం తెస్తామని హామీ ఇచ్చారు. అలాగే బీసీ విద్యార్థులకు మంచి చదువు కోసం బీసీ హాస్టల్స్‌లలో అన్ని వసతులు కల్పించి సన్న బియ్యం అందించడం జరుగుతుందన్నారు. తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీల పార్టీ, బీసీలు అంటేనే తెలుగుదేశం పార్టీ. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంటేనే బీసీలనే నినాదమని, ఆ నినాదం ప్రకారం మన బీసీల ముద్దుబిడ్డ సవిత బీసీ వెల్ఫేర్ మంత్రిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసుకి ముఖ్యమైన పదవులు అందించారన్నారు. అలాగే పారదర్శకంగా బీసీల సమస్యలు తెలుసుకోవడానికి సవితమ్మ రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి అందరి అభిప్రాయాలను సేకరించి వాటిని ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకొని వెళ్లి బీసీల సమస్యలు పరిష్కారం చేస్తామని మంత్రి సవిత హామీ ఇచ్చారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం తరపున బీసీ సంఘాల తరపున ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు.



స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా డీ. హీరేహాల్ మండల కేంద్రంలో స్వచ్ఛ రథాన్ని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరిశుభ్రమైన పరిసరాలు ఆరోగ్యకరమైన సమాజానికి పునాది అని, స్వచ్ఛత ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి ప్రజలంతా చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



కొవ్వూరు మండలం వాడపల్లి గ్రామంలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించిన కొవ్వూరు నియోజకవర్గం శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు

# నూరుశాతం మరుగుదొడ్ల లక్ష్యంగా పనిచేయండి



వింజమూరు, (చైతన్యరథం): వింజమూరు మండలంలో నూరు శాతం మరుగుదొడ్లు ఏర్పాటు లక్ష్యంగా పనిచేయాలని అధికారులకు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ దిశా నిర్దేశం చేశారు. శనివారం వింజమూరు పంచాయతీ పరిధిలోని చెత్త నుండి సంపద కేంద్రంలో స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాకర్ల సురేష్ మాట్లాడుతూ వింజమూరు పంచాయతీ గ్రీన్ పంచాయతీగా ఏర్పాటు కావాలన్నారు. పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని తెలిపారు. అవసరమైతే డ్రైనేజీ కాలువల్లో చెత్త వేసే వారిపై కఠినంగా వ్యవహరించడమే కాకుండా వారిపై అపరాధ రుసుము కూడా విధించాలన్నారు. పారిశుద్ధ్యం కోసం ప్రజల్లో అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. ప్రకటనలకే పరిమితం కాకుండా ప్రతి కార్యక్రమాన్ని ఆచరణలోనికి తీసుకువచ్చి చేసిన కార్యక్రమాన్ని ప్రజలకు వివరించాలని తెలిపారు. ప్రభుత్వానికి ప్రజలకు వారిదిగా నాయకులు అధికారులు కిందిస్థాయి సిబ్బంది వ్యవహరించాలని తెలిపారు. ఈ సందర్భంగా పంచాయతీలో జరుగుతున్న పారిశుధ్యం పై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అనంతరం ఈ నారి శిక్షణ తరగతులకు హాజరై ఈ నారి వ్యవస్థ ద్వారా ఈ నారిమణులు ఉపాధి పొందడమే కాకుండా, మీ ద్వారా ఆడపడుచులు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలని తెలిపారు. అనంతరం స్వర్ణ రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. అంతకుముందు స్వర్ణ రథం మండలంలోని ప్రతి గ్రామానికి వస్తుందని, పనికిరాని వస్తువులను ప్లాస్టిక్ ను భద్రపరిచి, స్వర్ణ రథం వచ్చినప్పుడు వారికి అందజేసి వాటి విలువ ప్రకారం వస్తువులు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. అందులో భాగంగా వింజమూరు మండలం స్వర్ణ రథాన్ని ప్రారంభించాను అన్నారు. మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వని పెంట హైమావతి, సర్పంచ్ నల్లగొండ్ల సృజన, సీనియర్ నాయకులు వనిపెంట సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ గూడా నర్సారెడ్డి, సొసైటీ అధ్యక్షులు చల్ల వెంకటేశ్వర్లు యాదవ్, ప్రధాన కార్యదర్శి చల్లా శ్రీనివాస్ యాదవ్, ఎంపీడీవో శ్రీనివాసులు రెడ్డి, ఈవో పి ఆర్ డి కొప్పర్తి రామారావు, ఏపిఎం, సీనియర్ నాయకులు మంచాల శ్రీనివాసులు నాయుడు, పట్టణ అధ్యక్షులు గురజాల గోపి, సిఆర్పిలు, పంచాయతీ సిబ్బంది,మహిళలు తదితరులు ఉన్నారు.

# మంత్రి లోకేశ్ దావోస్ పర్యటనతో పెట్టుబడుల వెల్లువ

## రాష్ట్ర యువతకు లక్ష ల సంఖ్యలో ఉపాధి ఉద్యోగాలు. రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమీషన్ సభ్యులు కొండారెడ్డి నరహరి వరప్రసాద్



అమరావతి, (చైతన్యరథం): దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరం పర్యటన సందర్భంగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ రాష్ట్రానికి భారీ స్థాయిలో పెట్టుబడుల ఒప్పందాలు తీసుకురావడం ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను మళ్లీ బడా పారిశ్రామికవేత్తల గమ్యస్థానంగా మార్చారని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు కొండారెడ్డి నరహరి వరప్రసాద్ అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గ్లోబల్ స్థాయిలో పేరు పొందిన ఐటీ, ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, లాజిస్టిక్స్ రంగాలకు చెందిన ప్రముఖ కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావడం రాష్ట్ర ఆర్థిక భవిష్యత్తుకు శుభపరిణామమన్నారు. బహుళజాతి సంస్థలతో నారా లోకేష్ కుదుర్చుకున్న అవగాహనా ఒప్పందాలు యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కీలకంగా మారనున్నాయన్నారు. రాష్ట్రంలో స్థిరమైన విధానాలు, పరిశ్రమలకు అనుకూల వాతావరణం, పారదర్శక పాలన ఉందనే నమ్మకాన్ని పెట్టుబడిదారుల్లో నారా లోకేష్ కల్పించగలిగారని ప్రశంసించారు. ఇది కేవలం ఒప్పందాలకే పరిమితం కాదు ఆంధ్రప్రదేశ్‌పై అంతర్జాతీయ స్థాయిలో నమ్మకం తిరిగి వచ్చిన సంకేతం అని ఆయన వ్యాఖ్యానించారు. అదే సమయంలో గత వైసీపీ ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో పెట్టుబడుల ఆకర్షణలో ప్రభుత్వం పూర్తిగావిఫలమైందని, పరిశ్రమలు రాష్ట్రం నుంచి వెళ్లిపోవడం, కొత్త పెట్టుబడులు రాకపోవడం వల్ల యువత ఉపాధి అవకాశాలు కోల్పోయిందన్నారు. నాడు వైసిపి ప్రభుత్వ కాలంలో జగన్మోహన్ రెడ్డి ఆయన దాయాదులుతో పరిశ్రమ దారులను బెదిరించిన సంఘటనలు కోకొల్లలు అన్నారు. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కియా కార్ల కంపెనీని రాష్ట్రానికి తీసుకువచ్చిన ఘనత చంద్రబాబుదని మర్చిపోవద్దన్నారు. చంద్రబాబు తీసుకువచ్చారనే అక్కస్సుతో ఆనాటి వైసీపీ ప్రభుత్వంలో హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ చేసిన దాడి నేటికి మరిచిపోలేనిదన్నారు. జగన్మోహన్ రెడ్డి ఇలాంటి నీచబుద్ధి కలిగిన నేతలను వెనుక పెట్టుకుని పరిశ్రమ దారులపై దాడుల వంటి ఘటనలు రాష్ట్రం నుంచి ఎన్నో లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులను వెనక్కి వెళ్ళేలా చేసిందన్నారు. ఉదాహరణకు కియా పరిశ్రమ విస్తరణ పెట్టుబడులు, అమర్ రాజా బ్యాటరీస్ వంటి దిగ్గజ కంపెనీలను, సౌర విద్యుత్తు పరిశ్రమలు ఇంకా అనేక కంపెనీలు రాష్ట్రం నుంచి పెట్టుబడులు ఉపసంహరించుకునేలా చేశాయన్నారు. దావోస్ వంటి అంతర్జాతీయ వేదికలను సద్వినియోగం చేసుకోవడంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించిందని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వ కాలం నాటి మంత్రి గుడివాడ అమర్నాథ్ మీడియా సమావేశంలో దావోస్ ఎందుకు వెళ్ళలేదు అని అడిగినప్పుడు కోడి గుడ్డు అంటూ దావోస్‌లో చలి తీవ్రత ఎక్కువ అంటూ మాట్లాడిన ఘటనలతో నేటికీ హాస్యాస్పదంగా ఉంటూ రాష్ట్రాన్ని తలవంపులకు గురి చేశారన్నారు. పెట్టుబడిదారులను భయపెట్టే విధానాలు, అస్థిర నిర్ణయాలు రాష్ట్ర అభివృద్ధిని వెనక్కి నెట్టాయన్నారు. దానికి భిన్నంగా నేడు నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం పెట్టుబడుల స్వర్గధామంగా మారుతున్న దృశ్యం కనిపిస్తోంది అని కొండారెడ్డి నరహరి వరప్రసాద్ అన్నారు. రానున్న రోజుల్లో ఈ పెట్టుబడులు కార్యరూపం దాల్చి రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి, సామాజిక ఆర్థిక పురోగతికి బలమైన పునాది వేస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు

### 27న అఖిలపక్షం

న్యూఢిల్లీ: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలోని కేంద్ర ప్రభుత్వం ఈనెల 27న అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలకు ముందు సంప్రదాయం ప్రకారం అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహిస్తున్నట్టు పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 27వ తేదీన పార్లమెంట్‌లోని మెయిన్ కమిటీ రూమ్‌లో ఉదయం 11 గంటలకు సమావేశం ఉంటుందని అన్నారు. బడ్జెట్ సమావేశాల్లో చేపట్టనున్న లెజిస్లేటివ్, ఇతర అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. జనవరి 28న ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించడంతో పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. జనవరి 28తో ప్రారంభమయ్యే తొలి విడత బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 13న ముగుస్తాయి. రెండో విడత బడ్జెట్ సమావేశాలు మార్చి 9న తిరిగి ప్రారంభమై ఏప్రిల్ 2న ముగుస్తాయి. ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారంనాడు కేంద్ర బడ్జెట్ 2026-27ను ఉభయ సభల్లోనూ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెడతారు. సీతారామన్ వరుసగా ప్రవేశపెడుతున్న తొమ్మిదవ బడ్జెట్ ఇది. ఫిబ్రవరి 2 నుంచి 4వ తేదీ వరకూ రాష్ట్రపతి బడ్జెట్ ప్రసంగంపై ధన్యవాద తీర్మానం ఉంటుంది. దీనితో పాటు వికసిత్ భారత్ శిక్షా అధిష్టాన్ బిల్లు-2025, ది సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్-2025, రాజ్యాంగ (129వ సవరణ) బిల్లు-2024పై సభలో చర్చ ఉంటుంది. ఈ బిల్లులను తదుపరి పరిశీలన కోసం పార్లమెంటరీ స్థాయీ సంఘానికి లేదా సెలెక్ట్ కమిటీలకు పంపనున్నారు.

## విదేశాల్లో భారత్ వాంటెడ్

**- రెండేళ్లలో 70 మంది గుర్తింపు**

**- కేంద్ర ప్రభుత్వం నివేదిక**





వివిధ కేసుల్లో నిందితులుగా ఉండి, పరారీలో ఉన్న మన దేశానికి చెందిన వారిని గుర్తించే ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోందని కేంద్ర ప్రభుత్వ నివేదిక వెల్లడించింది. గత రెండేళ్లలో (2024-25) 'వాంటెడ్ జాబితాలో ఉన్న వారిలో 70 మంది విదేశాల్లో ఉన్నట్లు గుర్తించామని పేర్కొంది. అంతేకాదు.. ఇతర దేశాలు వెతుకుతున్న (Wanted) 203 మంది నిందితులు భారత్లో ఉన్నట్లు కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ తాజా నివేదికలో పేర్కొంది. వాంటెడ్ జాబితాలో ఉన్న వారిలో 27 మంది గతేడాది విదేశాల నుంచి తిరిగి వచ్చారని భారత ప్రభుత్వం వెల్లడించింది. సీబీఐ కేసులకు సంబంధించి ఏడాది వ్యవధిలో 74 రొగేటరీ లెటర్స్ (దర్యాప్తునకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తూ విదేశీ న్యాయస్థానాలకు రాసే లేఖ) పంపించామని, వీటిలో 54 సీబీఐ, మరో 20 రాష్ట్ర దర్యాప్తు బృందా లకు చెందినవని పేర్కొంది. ఇప్పటివరకు ఆయా దేశాల్లో మొత్తం 533 ఎల్ఆర్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది.

### వివాదాల నడుమ..

## వందేమాతరం గీతంతో రెహమాన్

న్యూఢిల్లీ: ఆస్కార్ అవార్డు విజేత, దిగ్గజ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ ఇటీవల మతపరమైన వ్యాఖ్యలతో దుమారం రేపారు. సినీ పరిశ్రమ తన 'మతం' కారణంగానే వివక్ష చూపిస్తోందంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్‌మీడియాలో తీవ్ర విమర్శలకు దారితీసింది. ఈ వివాదం తీవ్రమవుతుండటంతో



ఆయన ఇన్‌స్టాగ్రామ్‌లో వివరణ ఇచ్చుకున్నారు. భారతదేశం తన జీవితంలో కీలక భాగమని, తన సంగీత తనను తాను వ్యక్తపరుచుకునేందుకు ఉద్దేశించినదని, ఎవరి మనోభావాలను గాయపరచే ఉద్దేశం తనకు లేదన్నారు. ఒక టీచర్‌గా, ఇక ఇల్లులా ఇండియా తనకు స్ఫూర్తి అని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఆయన ఒక స్టేజీపై 'వందేమాతరం' పాడటం ద్వారా విమర్శల ప్రశంసలను సైతం అందుకుంటున్నారు. ఈ నెల 23వ తేదీన యూఏఈలోని ఇతిహాద్ ఎరీనాలో ఏఆర్ రెహమాన్ కాన్సర్ట్ జరిగింది. ఇందులో ఆయన తన పాపులర్ సాంగ్స్‌తో పాటు 'వందేమాతరం' ఆలపించి జనాన్ని ఉర్రూతలూ గించారు. కాన్సర్ట్‌కు హాజరైన ఆడియెన్స్ ఇందుకు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది ప్రస్తుతం వైరల్ అవుతోంది. ఏఆర్ రెహమాన్ కాన్సర్ట్ అద్భుతంగా ఉందంటూ హాజరైన ప్రముఖ నటుడు, నిర్మాత శేఖర్ కపూర్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రశంసలు కురిపించారు.

# 61 వేల మందికి నియామక పత్రాలు



### రోజ్‌గార్ మేళాలో మోదీ

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా శనివారం జరిగిన 18వ రోజ్‌గార్ మేళా కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ 61,000 మందికి ఉద్యోగ నియామక పత్రాలు అందించారు. కొత్తగా వివిధ శాఖల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చిన వారికి నియామక పత్రాలను మోదీ వర్చువల్‌గా అందజేశారు. ఈ కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దేశవ్యాప్తంగా 45 కేంద్రాల నుంచి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ మొత్తం నియామకాల్లో 49,200.. హోంమంత్రిత్వ శాఖ, పారామిలిటరీ దళాలకు సంబంధించినవని తెలిపారు. మహిళా కానిస్టేబుల్స్ భారీగా నియమితులవుతున్నారని, గత 11 సంవత్సరాల్లో ప్రభుత్వం అనేక సౌలభ్య చర్యలు తీసుకున్నందు వల్ల ఇది సాధ్యమైందని వివరించారు. బీఎస్ఎఫ్ మహిళా దళాలు సరిహద్దుల్లో జీరో లైన్ వద్ద ఉద్యోగాలు చేస్తున్నాయని, రిపబ్లిక్ డే పరేడ్‌లో సీఆర్‌పీఎఫ్ పురుష దళానికి మహిళా అసిస్టెంట్ కమాండెంట్ నాయకత్వం వహిస్తుందని పేర్కొన్నారు. రోజ్‌గార్ మేళా కార్యక్రమం ద్వారా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం, ప్రభుత్వ నిబద్ధతను చాటి చెబుతోందని మోదీ పేర్కొన్నారు. ఈ మేళాల ద్వారా ఇప్పటివరకూ 11 లక్షలకు పైగా నియామక పత్రాలు విడుదల చేశారు. వివిధ మంత్రిత్వ శాఖలు.. హోం వ్యవహారాలు, ఆరోగ్యం, ఆర్థిక సేవలు, ఉన్నత విద్య విభాగాలతోపాటు ఇతర శాఖల్లో ఈ నియామకాలు జరిగాయి. దేశవ్యాప్తంగా ఉన్న యువత ఈ కార్యక్రమంలో పాల్గొని ఉద్యోగ నియామక పత్రాలు స్వీకరించారు.

# పంజాబ్‌లో ఉగ్ర కుట్ర భగ్నం: ఆయుధాలు స్వాధీనం



పంజాబ్: గణతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా దేశవ్యాప్తంగా ఉగ్ర ముప్పు ఉందని ఇటీవల ఇంటెలిజెన్స్ బ్యూరో రాష్ట్రాలకు హెచ్చరి కలు జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే పంజాబ్ పోలీసులు భారీ ఉగ్ర కుట్రను భగ్నం చేశారు. పంజాబ్ పోలీసులు నిర్వహించిన స్పెషల్ ఆపరేషన్‌లో నిషేధిత ఉగ్ర సంస్థ బబ్బర్ ఖల్సా ఇంటర్నేషనల్‌కు చెందిన టెర్రర్ మాడ్యూల్‌ను గుర్తించి ఆరుగురిని అరెస్ట్ చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా పెద్దఎత్తున భయాం దోళన సృష్టించేందుకు కుట్ర పన్నినట్లు పంజాబ్ డీజీపీ తెలిపారు. నిందితుల వద్ద నుంచి 2.5 కిలోల ఆర్డీఎక్స్‌తో తయారు చేసిన ఒక ఇంప్రొవైజ్డ్ ఎక్స్ ప్లోసివ్ డైవైస్, రెండు గన్స్, మందుగుండు సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. ఈ ఉగ్ర మాడ్యూల్ అమెరికాలో ఉన్న బీకేఐ హ్యాండ్లర్లు నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఘటనపై చట్ట విరుద్ధ కార్యకలాపాల చట్టం, పేలుడు పదార్థాల చట్టానికి సంబంధించిన పలు సెక్షన్ల కింద హోషియార్‌పూర్‌లోని గర్శంకర్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదు అయింది. ప్రస్తుతం దీనిపై పూర్తి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు.

# ఎయిరిండియాకు రూ.1,100 కోట్ల బీమా సొమ్ము

**- అహ్మదాబాద్ విమాన ప్రమాదంలో చెల్లింపు**



గతేడాది అహ్మదాబాద్‌లో భయంకర విమాన ప్రమాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. గతేడాది జూన్ 12న అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన విమానం టేకాఫ్ అయిన కాసేపటికే ఓ మెడికల్ కాలేజ్ హాస్టల్‌పై కుప్పకూలింది. ఈ ప్రమాదంలో దాదాపు 260 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రమాదానికి సంబంధించి ఎయిరిండియాకు రూ.1,100 కోట్ల బీమా సొమ్ము తాజాగా లభించింది. విమానం పూర్తిగా ధ్వంసం కావడంతో రీ-ఇన్సూరర్లు, బీమా సంస్థలు 125 మిలియన్ డాలర్ల బీమా మొత్తాన్ని ఎయిరిండియాకు చెల్లించాయి. అలాగే ప్రమాదంలో మరణించిన వారి బంధువులకు మరో 25 మిలియన్ డాలర్ల పరిహారం చెల్లించే ప్రక్రియ కూడా ప్రారంభమైందని బీమా సంస్థలు తెలిపాయి. అయితే ఆ ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదని, పరిహారం మొత్తం మరింత పెరిగే అవకాశం కూడా ఉందని వెల్లడించాయి. ఈ విమాన ప్రమాదంలో మరణించిన వారి కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు టాటా గ్రూపు ఓ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. చనిపోయిన వారి బంధువులకు పరిహారం ఇవ్వడంతో పాటు, క్షతగాత్రుల వైద్య ఖర్చులు, మెడికల్ కాలేజ్ హాస్టల్ పునరుద్ధరణ, విమాన శకలాల వల్ల దెబ్బతిన్న ఇతర నిర్మాణాలను పునరుద్ధరించడం వంటి పనులను ఈ ట్రస్ట్ పర్యవేక్షిస్తుంది.

# ఇస్లాం ఆవిర్భావం ముందే భారత్-ఇరాన్ బంధం



ఇస్లాం ఆవిర్భావం కంటే వందల సంవత్సరాల ముందే ఇరాన్, భారతదేశం మధ్య పటిష్టమైన బంధం ఏర్పడిందని ఆ దేశ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ ప్రతినిధి అబ్దుల్ మాజిద్ హకిమ్ ఇలాహీ పేర్కొన్నారు. ఆ బంధం భవిష్యత్తులో కూడా కొనసాగాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. భారత దేశ తాత్విక పుస్తకాలను ఇరాన్‌లో అధ్యయనం చేసేవారని అన్నారు. భారత్ భాగస్వామిగా ఉన్న చాబహార్ పోర్టు పురోగతిపై పూర్తి విశ్వాసం ఉందన్నారు. 'గణితం, ఖగోళ శాస్త్రం, వైద్యంలో భారతదేశం సాధించిన విజయాలను ఇరాన్‌లో అధ్యయనం చేశారు. రెండు పురాతన నాగరికతల మధ్య బంధాన్ని ఇరాన్ ప్రజలు గౌరవిస్తారు. ఇరాన్ సుప్రీం లీడర్ రెండు దేశాల మధ్య మంచి సంబంధాలు, సహకారం గురించి మాట్లాడుతుంటారు. ఇతర దేశాల ఆంక్షల వల్ల భారత్ ఎప్పుడూ ప్రభావితం కాలేదు. ఇరాన్, భారతదేశం మధ్య పటిష్టమైన బంధం 3000 ఏళ్ల పురాతనమైనది. ఆ సమయంలో భారత దేశ తాత్విక పుస్తకాలను ఇరాన్‌లో అధ్యయనం చేసేవారు' అని హకిమ్ ఇలాహీ పేర్కొన్నారు. మధ్య ఆసియా దేశాలతో వాణిజ్యం కోసం ఇరాన్‌లోని చాబహార్ పోర్ట్‌లో భారత్ పెట్టుబడులు పెట్టింది. ఇరు దేశాల మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం ఆ పోర్ట్ టెర్మినల్‌ను భారత్ పదేళ్ల పాటు నిర్వహించనుంది. ఇటీవల ఇరాన్‌తో వ్యాపారం చేసే దేశాలపై అమెరికా 50 శాతం సుంకాలు విధిస్తున్నట్టు ప్రకటించింది. అయితే ఈ పోర్ట్ విషయంలో మాత్రం మినహాయింపు ఇచ్చింది. కాగా, ఇటీవల ఇరాన్‌లోని నిరసనల అణిచివేతను విమర్శిస్తూ ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల మండలి అత్యవసర సమావేశంలో ప్రవేశ పెట్టిన తీర్మానానికి భారత్ వ్యతిరేకంగా ఓటు వేసింది. దీంతో భారత ప్రభు త్వానికి ఇరాన్ రాయబారి మహ్మద్ ఫథాలీ ధన్య వాదాలు తెలియజేశారు. ఈ ఓటింగ్‌కు 25 దేశాలు మద్దతు పలకగా భారత్, చైనా సహా ఏడు దేశాలు వ్యతిరేకంగా ఓటు వేశాయి. మరో 14 దేశాలు ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి.



## ఎంపీ ఇంజినీర్ రషీద్‌కు కస్టడీ పెరోల్

న్యూఢిల్లీ: బారాముల్లా ఎంపీ షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజినీర్ రషీద్‌కు పార్లమెంటు బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో కస్టడీ పెరోల్ మంజూరైంది. ఉగ్రనిధుల కేసులో నిందితుడైన రషీద్ ప్రస్తుతం ఢిల్లీలోని తీహార్ జైలులో ఉన్నారు. జనవరి 28 నుంచి ప్రారంభమవుతున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాలకు హాజరయ్యేందుకు ఆయనకు అనుమతిస్తూ ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు కస్టడీ పెరోల్ మంజూరు చేసింది.

# అమెరికాను వణికిస్తున్న మంచు తుఫాను



## స్థంభించిన జన జీవనం
## వేల విమాన సర్వీసులు రద్దు

అమెరికాను భారీ మంచు తుఫాను వణికిస్తోంది. ఈ మంచు తుఫా ను కారణంగా అమెరికాలో దాదాపు 20 కోట్ల మంది కష్టాలు పడుతున్నారు. అమెరికాలోని పలు రాష్ట్రాల్లో మంచు, వర్షం కురుస్తున్నాయి. రికార్డు స్థాయి కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవు తున్నాయి. ముఖ్యంగా టెక్సాస్, ఓక్లహోమాపై మంచు తుఫాను ప్రభావం ఎక్కువగా ఉంది. ఈ భీకర మంచు తుఫాను కారణంగా అమెరికాలో వేల కొద్దీ విమాన సర్వీసులు రద్దవుతున్నాయి.

శనివారం 3,200 విమాన సర్వీసులు, ఆదివారం మరో 4,800 విమాన సర్వీసులు రద్దయ్యాయని ఫ్లైట్ ట్రాకింగ్ వెబ్‌సైట్ ఫ్లైట్ అవేర్ వెల్లడించింది. రానున్న కొద్దిరోజుల్లో ఈ మంచు తుఫాను ప్రభావం మరింత ఎక్కువ కావొచ్చని, ఈ నేపథ్యంలో రవాణా కష్టాలు మరింత పెరగవచ్చని విశ్లేషణలు వినిపిస్తున్నాయి. అవసరమైతే తప్ప ఎవరూ బయటకు రావొద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. మంచు తుఫాను కారణంగా అమెరికాలోని కెంటకీ, కాన్సస్, వర్జీనియా, జార్జియా, మిసిసిపి రాష్ట్రాలు ఎమర్జె న్సీ విధించాయి. ఈ దశాబ్దంలోనే ఇది భారీ మంచు తుఫాను అని వార్తలు వస్తున్న నేపథ్యంలో చాలా రాష్ట్రాలు అప్రమత్తమయ్యాయి. సుదూర ప్రయాణాలు చేస్తే మంచులో చిక్కుకుపోయే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. పరిస్థితులు సద్దుమణిగే వరకు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## చైనా మిమ్మల్ని తినేస్తుంది..
# కెనడాకు ట్రంప్ హెచ్చరిక

మిసైల్ రక్షణ వ్యవస్థ గోల్డెన్ డోమ్ ఏర్పాటు ప్రతిపాదనలను కెనడా వ్యతిరేకిస్తుండటంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదోక రోజు కెనడా చైనాకు బలైపోతుందని వ్యాఖ్యానించారు. చైనాతో దౌత్య, వాణిజ్య బంధాల బలోపేతానికి కెనడా ప్రయత్నిస్తున్న తరుణంలో ట్రంప్ ఈ హెచ్చరిక చేశారు. 'గ్రీన్‌లాండ్‌కు రక్షణగా గోల్డెన్ డోమ్ ఏర్పాటు ను కెనడా వ్యతిరేకిస్తోంది. కెనడాకూ ఈ వ్యవస్థతో రక్షణ లభించే అవకాశం ఉన్నా అడ్డుకుంటోంది. ఇది చాలదన్నట్టు వారు చైనాతో వాణిజ్యానికి మొగ్గుచూపుతున్నారు. ఒప్పందం కుదిరిన మొదటి సంవత్సరంలోనే వారు చైనాకు ఆహారమైపోతారు' అని తన సోష ల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్ ద్వారా ట్రంప్ హెచ్చరించారు. కెనడా, అమెరికాల మధ్య కొంత కాలంగా అసలేమాత్రం పొసగని విషయం తెలిసిందే. ఇక దావోస్ వేదికగా జరిగిన వరల్డ్ ఎకన మిక్ ఫోరం సమావేశాల్లో ఇరు దేశాల మధ్య ఎడం మరింత పెరిగింది. ట్రంప్ సారథ్యంలోని అమెరికా ప్రభుత్వ తీరును కెనడా ప్రధాని కార్నీ ఎండగట్టారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో చట్టబద్ధ నియమాలకు కాలం చెల్లినట్టు కనిపిస్తోందని అన్నారు. దీంతో ట్రంప్ కూడా అంతేఘాటుగా స్పందించారు. ఇంతకాలం అమెరి కా ఇచ్చే అనేక ఉచితాలను అనుభవించిన కెనడా కాస్తంత కృతజ్ఞతతో మసులుకోవాలని అన్నారు. కానీ వారిలో కృతజ్ఞత కనిపించట్లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. తను ప్రతిపాదించిన గోల్డెన్ డోమ్‌తో కెనడాకు కూడా రక్షణ లభిస్తుందని అన్నారు.

**ఏమిటీ గోల్డెన్‌డోమ్ ప్రాజెక్టు..**

మిసైల్ దాడుల నుంచి రక్షణ కోసం అమెరికా ప్రభుత్వం గతేడాది తొలిసారిగా ఈ రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది.



ఇజ్రాయెల్ ఏర్పాటు చేసుకున్న ఐరోన్ డోమ్ వ్యవస్థ స్ఫూర్తితో ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారు. మొదట్లో దీన్ని ఐరన్ డోమ్ ఆఫ్ అమెరికాగా మీడియాలో పేర్కొన్నప్పటికీ ఆ తరువాత ప్రభుత్వం గోల్డెన్ డోమ్?గా పేరు మార్చింది. ఇందుకు అయ్యే ఖర్చులో కొంత భాగాన్ని కెనడా ప్రభుత్వం భరిస్తే ఆ దేశానికి రక్షణ కల్పిస్తామని తెలిపింది. అమెరికా భద్రతకు గ్రీన్ లాండ్ కీలకంగా మారిందని చెబుతున్న ట్రంప్ అక్కడకు కూడా గోల్డెన్ డోమ్ రక్షణను విస్తరిస్తామని చెబుతున్నారు. అయితే, కెనడా మాత్రం ట్రంప్ ప్రతిపాదనను వ్యతిరేకిస్తోంది. గోల్డెన్ డోమ్ ప్రతిపాదన తమ ప్రాదేశిక సమగ్రతను ఉల్లంఘించేలా ఉందని అభ్యంతరం వ్యక్తం చేస్తోంది. చైనాతో వాణిజ్య సంబంధాలు మెరుగుపరుచుకునేందుకు కూడా కెనడా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో ట్రంప్ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలను కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

# డబ్ల్యూహెచ్‌వో నుంచి తప్పుకొన్న అమెరికా




వాషింగ్టన్: ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) నుంచి అమెరికా గురువారం అధికారికంగా వైదొలిగింది. 1948లో ఐక్యరాజ్య సమితి అనుబంధ సంస్థగా ప్రారంభమైనప్పటి నుంచి డబ్ల్యూహెచ్‌వోలో 78 ఏళ్ల పాటు అమెరికా కీలక భాగస్వామిగా ఉంటూ వచ్చింది. ఈ సంస్థకు అత్యధిక విరాళాలు ఇచ్చే దేశం కూడా అమెరికానే. ఈ సంస్థ మొత్తం వార్షిక బడ్జెట్ 5.8 బిలియన్ డాలర్లు కాగా, అందులో దాదాపు పావు వంతు నిధులు అమెరికా ఒక్కటే అందిస్తోంది. డబ్ల్యూహెచ్‌వో నుంచి అమెరికా తప్పుకొంటున్నట్లు గతేడాది జనవరిలో ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌పై సంతకం చేశారు. డబ్ల్యూహెచ్‌వో రాజ్యాంగం ప్రకారం ఒకదేశం తన సభ్యత్వాన్ని రద్దు చేసుకోవాలంటే సంవత్సరం ముందుగా నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది. అమెరికా నోటీసు ఇచ్చి ఏడాది పూర్తి కావటంతో గురువారం అధికారికంగా సంస్థ నుంచి బయటకు వచ్చింది. కాగా, సభ్యదేశాలు ఇచ్చే విరాళాలతోనే డబ్ల్యూహెచ్‌వో నడుస్తోంది. అయితే, అందరికంటే ఎక్కువ విరాళాలు ఇస్తున్న తమకు సంస్థలో తగిన గౌరవం లభించటంలేదని ట్రంప్ విమర్శిం చారు. సంస్థలో అవినీతి పెరిగిపోయిందన్నారు. అమెరికా వైదొల గటంతో డబ్ల్యూహెచ్‌వోకు నిధుల కటకట ఏర్పడే ప్రమాదం ఉంది. ఇప్పటికే ఆ దేశం 2024-25 ఆర్థిక సంవత్సరంలో ఈ సంస్థకు దాదాపు 130 మిలియన్ డాలర్లు బకాయి ఉంది. ఇకపై ఆ నిధులు కూడా వచ్చే అవకాశం లేదని సమాచారం. కాగా, డబ్ల్యూహెచ్‌వో నుంచి అమెరికా బయటకు రావటాన్ని ఆ దేశం లోని పలువురు ప్రముఖులు తప్పుబట్టారు. ఇది తొందర పాటు చర్య అని అమెరికా అంటువ్యాధుల సొసైటీ అధ్యక్షుడు రొనాల్డ్ నహాస్

# భారత్‌పై సుంకాలు తగ్గవచ్చు!



భారత్‌పై విధించిన సుంకాలను సగానికి తగ్గించే యోచనలో ట్రంప్ ప్రభుత్వం ఉన్నట్టు సమాచారం. ఈ మేరకు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ సంకేతాలిచ్చారు. ఇరు దేశాల మధ్య వాణిజ్య ఒప్పందం తుదిదశకు చేరుకుందన్న వార్తల నడుమ బెసెంట్ వ్యాఖ్యలకు అమిత ప్రాధాన్యం ఏర్పడింది. ఇటీవల అంత ర్జాతీయ మీడియాకు ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో అమెరికా మంత్రి స్కాట్ బెసెంట్ భారత్‌పై సుంకాల గురించి మాట్లాడారు. రష్యా చమురు కొనుగోళ్లను భారత రిఫైనరీలు చాలా వరకూ తగ్గించా యని అన్నారు. గతేడాది భారత్‌పై సుంకాల విధింపునకు ఇది ప్రధాన కారణమని గుర్తుచేశారు. 'రష్యా చమురు కొనుగోళ్లు చాలా వరకూ తగ్గిపోయా యి. ఇది మాకు సక్సెస్' అని కామెంట్ చేశారు. 'అప్పట్లో విధించిన సుంకాలు ఇప్పటికీ కొనసాగుతున్నా వాటిని తొలగించే ఛాన్స్ ఉంది' అని కామెంట్ చేశారు. గతేడాది ఆగస్టులో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచంపై సుంకాల భారం మోపిన విషయం తెలిసిందే. ఇక రష్యా చమురును కొనుగోలు చేస్తున్న కారణం చెప్పి భారత్‌పై సుంకాలను రెండింతలు పెంచి 50 శాతానికి చేర్చారు. ఇక భారత్ విషయంలో అమెరికా అధికారులు రోజుకో ప్రకటన చేస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఇటీవల భారత్‌తో కుదుర్చు కోవాల్సిన వాణిజ్య ఒప్పందం చివరి నిమిషంలో ఆగిపోయిందని వాణిజ్య శాఖ మంత్రి హోవర్డ్ లట్నిక్ చెప్పుకొచ్చారు. ఒప్పందం తుది దశకు చేరుకున్నా ట్రంప్‌కు మోదీ ఫోన్ చేయకపోవడంతో ఒప్పందం ముందుకు సాగలేదని అన్నారు. నాటి నిబంధనల ప్రకారం, ఒప్పందం కుదిరే అవకాశం తక్కువని కూడా చెప్పుకొచ్చారు. ఇందుకు భిన్నంగా స్కాట్ బెసెంట్ సానుకూల వ్యాఖ్యలు చేశారు.

# పాక్‌లో పెళ్లింట ఆత్మాహుతి దాడి



పాకిస్థాన్‌లో ఓ పెళ్లి వేడుకలో ఆత్మాహుతి దాడి జరగడం కలకలానికి దారి తీసింది. ఖైబర్ పాఖ్‌తూన్‌ఖ్వా ప్రావిన్స్‌లో స్థానిక శాంతిస్థాపన కమిటీ చీఫ్ నూర్ ఆలమ్ మహసూద్ ఇంట ఈ దారుణం జరిగింది. ఘటనలో ఐదుగురు మరణించగా.. 10 మంది గాయాలపాలయ్యారు. మృతుల్లో శాంతిస్థాపన కమిటీ నేత వహీదుల్లా మసూద్ అలియాస్ జిగ్రీ మసూద్ ఉన్నట్టు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ఈ పేలుడు ధాటికి నూర్ ఆలమ్ మహసూద్ ఇంటి పైకప్పు కూలడంతో శిథిలాల కింద పలువురు చిక్కుకుపోయారు.

వారిని వెలికి తీయడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని సహాయక సిబ్బంది తెలిపారు. ఈ ఘటనలో మృతిచెందిన వారు మాజీ తాలిబాన్లు అని పోలీసులు తెలిపారు. హింసను వీడి శాంతిబాట పట్టారని చెప్పారు. ఈ ఘటనపై ప్రావిన్స్ గవర్నర్ ఫైజల్ కరీమ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఘటనపై సవివరమైన నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు అన్ని రకాలుగా అండగా ఉంటామని చెప్పారు. ఇక ఈ ప్రమాదంలో గాయపడిన వారికి చికిత్సను అందిస్తున్న జిల్లా ఆసుపత్రి వద్ద హైఅలర్ట్ ప్రకటించారు.

# మొండిపట్టుకు మూల్యం!

## టీ 20 వరల్డ్‌కప్ నుంచి బంగ్లా ఔట్ - ఆ స్థానంలో ఆడనున్న స్కాట్లాండ్

మొండిపట్టుకు మూల్యం చెల్లించుకున్న బంగ్లాదేశ్.. టీ20 ప్రపంచ కప్ 2026 టోర్నమెంట్‌కు బంగ్లాదేశ్ దూరమైంది. ఆ జట్టు స్థానంలో స్కాట్లాండ్ ఆడనుంది. ఈ మేరకు అన్ని సభ్యదేశాలకు సమాచారం అందించినట్లు ఐసీసీ వర్గాలు వెల్లడించాయి. భద్రత కారణాల దృష్ట్యా తమ జట్టును భారత్‌కు పంపే ప్రసక్తే లేదని, భారత్‌లో జరిగే తమ మ్యాచ్‌లను శ్రీలంకకు మార్చాలని ఐసీసీకి బంగ్లాదేశ్ విజ్ఞప్తి చేసింది. ఆ అభ్యర్ధనను ఐసీసీ తిరస్కరించింది. భారత్‌లో బంగ్లా జట్టుకు ఎలాంటి ప్రత్యక్ష ముప్పు లేదని ఐసీసీ భద్రత అంచనా నివేదిక పేర్కొంది. అయినా.. భారత్‌కు వెళ్లడానికి బంగ్లా నిరాకరించడంతో ప్రస్తుత ర్యాంకింగ్స్ ఆధారంగా ఆ స్థానాన్ని స్కాట్లాండ్‌తో భర్తీ చేస్తున్నట్లు ఇంటర్నేషనల్ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) వర్గాలు ధ్రువీకరించాయి. టీ20 ప్రపంచ కప్ లో ఆడకూడదని నిర్ణయించుకోవడంతో బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)కి ఆర్థికంగా తీవ్ర నష్టం జరగనుంది. కలిగిస్తుంది. పార్టిసిపేషన్ కింద వచ్చే 5,00,000 డాలర్లు కోల్పోనుంది.

**స్కాట్లాండ్ ఏ గ్రూప్ ?**

ఫిబ్రవరి 7 నుంచి మార్చి 8 వరకు టీ20 ప్రపంచ కప్ జరగనుంది. భారత్, శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్నాయి. ఈ సారి టోర్నీలో 20 జట్లు పాల్గొంటున్నాయి. బంగ్లాదేశ్ స్థానంలో టీ20 ప్రపంచ కప్ లో ఆడనున్న స్కాట్లాండ్ గ్రూప్ సిలో ఉంది. కోల్‌కతా వేదికగా ఫిబ్రవరి 7న వెస్టిండీస్, 9న ఇటలీ, 14న ఇంగ్లాండ్‌తో స్కాట్లాండ్ తలపడనుంది. ముంబయిలో ఫిబ్రవరి 17న నేపాల్‌తో ఆడనుంది.

స్కాట్లాండ్ ఇప్పటివరకు ఐదుసార్లు టీ20 ప్రపంచకప్‌లో పోటీపడింది. 2024 ఎడిషన్ లోనూ ఆడిన ఆ జట్టు ఆస్ట్రేలియాను ఓడించినంత పనిచేసింది. స్కాట్లాండ్ నిర్దేశించిన 181 పరుగుల లక్ష్యాన్ని ఛేదించడానికి ఆసీస్ చెమటోడ్చింది. 5 వికెట్లు కోల్పోయి 19.4 ఓవర్లలో టార్గెట్‌ను అందుకుంది.

గత కొంతకాలంగా భారత్– బంగ్లాదేశ్ మధ్య దౌత్యపరమైన ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఆ దేశంలో హిందువులపై జరుగుతున్న దాడులపై భారత్‌లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. ఈ నేపథ్యంలో బంగ్లాదేశ్ ఆటగాడు ముస్తాఫిజుర్ రహమాన్.. ఐపీఎల్‌లో కోల్‌కతా నైట్ రౌడర్స్ ఫ్రాంచైజీ తరఫున ఆడనుండటంపై తీవ్రస్థాయిలో నిరసనలు వ్యక్తమయ్యాయిసీ నేపథ్యంలో కేకేఆర్ టీమ్ నుంచి ముస్తాఫిజుర్‌ను తొలగిస్తూ బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. టీమిండియా బంగ్లాదేశ్ పర్యటనను కూడా నిరవధికంగా వాయిదా వేసింది. దీనిపై బంగ్లాదేశ్ తీవ్రంగా స్పందించింది. తమ దేశంలో ఐపీఎల్ ప్రసారాలను నిలిపివేసింది. టీ20 వరల్డ్ కప్ లో భాగంగా భారత్‌లో తమ మ్యాచ్లు ఆడలేమని ఐసీసీకి బీసీబీ తెలియజేసింది. ఎంతగా నచ్చచెప్పినా వినకపోవటంతో బంగ్లాదేశ్ వైఖరిపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న ఐసీసీ.. ముందుగా హెచ్చరించినట్లుగానే బంగ్లాదేశ్ స్థానాన్ని స్కాట్లాండ్ తో భర్తీ చేసినట్లు ప్రకటించింది.


# యువభారత్ హ్యాట్రిక్ విజయం

**- అండర్-19 ప్రపంచ కప్‌లో న్యూజిలాండ్‌పై ఘన విజయం**

**- ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ ఆర్ఎస్ అంబరీష్**

అండర్–19 ప్రపంచ కప్‌లో భారత్ హ్యాట్రిక్ విజయం సాధించింది. జింబాబ్వేలోని బులవాయోలో శనివారం జరిగిన గ్రూప్ బీలో న్యూజిలాండ్‌పై 7 వికెట్ల తేడాతో (డక్ వర్త్ లూయిస్ పద్ధతి) టీమిండియా గెలిచింది. ఈ టోర్నీలో యువ భారత్‌కు ఇది వరుసగా మూడో విజయం కావటం విశేషం. వర్షం కారణంగా మ్యాచ్‌ను 37 ఓవర్లకు కుదించారు. కివీస్ 36.2 ఓవర్లలో 136 పరుగులకు ఆలౌటైంది. డక్ వర్త్ లూయిస్ పద్ధతి ప్రకారం భారత్ లక్ష్యం 130 పరుగులుగా నిర్దేశించారు. టార్గెట్‌ని ఇండియా 13.3 ఓవర్లలోనే ఛేదించింది. కెప్టెన్ ఆయుష్ మాత్రే (53; 27 బంతుల్లో 2 ఫోర్లు, 6 సిక్సులు) హాఫ్ సెంచరీతో మెరవగా.. వైభవ్ సూర్యవంశీ (40, 23 బంతుల్లో 2 ఫోర్లు, 3 సిక్స్ లు) అదరగొట్టాడు. విహాన్ మల్హోత్రా (17 నాటౌట్), వేదాంత్ త్రివేది (13 నాటౌట్) పరుగులు చేశారు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు తీసిన భారత బౌలర్ ఆర్ఎస్ అంబరీష్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

టాస్ ఓడి బ్యాటింగ్‌ను దిగిన న్యూజిలాండ్.. మన బౌలర్ల ధాటికి కివీస్ ఒక దశలో 22 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. జాకబ్ కాటర్ (23), జస్కరన్ సంధు (18) నిలవడంతో ఆ జట్టు కాస్త కోలుకుంది. వీరిద్దరూ స్వల్ప వ్యవధిలో ఔటవడంతో కివీస్ 69/7 తో మళ్లీ కష్టాల్లో పడింది. ఈ దశలో కల్లమ్ శాంసన్ (37లి), సెల్విన్ సంజయ్ (28) కివీస్ను ఆదుకున్నారు. భారత బౌలర్లలో ఆర్ఎస్ అంబరీష్ (4/29), హెనిల్ పటేల్ (3/23) అదరగొట్టగా.. ఖిలాన్ పటేల్, మహ్మద్ ఎనాన్, కనిష్క్ చౌహాన్ ఒక్కో వికెట్ పడగొట్టారు.




# సెంట్రల్ కాంట్రాక్ట్‌ల్లో రో-కోలకు బీసీసీఐ షాక్

సీనియర్ ఆటగాళ్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లిలకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) షాక్ ఇచ్చింది. ఆటగాళ్ల వార్షిక కాంట్రాక్టు గ్రేడ్లలో మార్పులపై బీసీసీఐ స్పందించింది. ఏ ప్లస్ గ్రేడ్‌ను ఎత్తివేస్తున్నట్లు తెలిపింది. ఈ విషయాన్ని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా శనివారం ధ్రువీకరించారు. ఏ ప్లస్ గ్రేడ్ను తొలగించే విషయంలో త్వరలోనే తుది నిర్ణయం తీసుకోబోతున్నాం. ప్రస్తుతం ఈ కేటగిరిలో ఉన్న ఆటగాళ్లు మూడు ఫార్మాట్లు కాకుండా.. కేవలం ఒకే ఒక్క ఫార్మాట్ ఆడేందుకు సుముఖంగా ఉన్నారు. ఏ ప్లస్ గ్రేడ్‌లో కొనసాగేందుకు కావాల్సిన అర్హతలున్న ఆటగాళ్లు ఇప్పుడు ఎవరూ లేరు. ఈ గ్రేడ్లో ఉన్న కొంతమంది ఆటగాళ్లు మూడు ఫార్మాట్లలో ఆడటం లేదు. మా నిబంధనలకు అనుగుణంగా ఎవరూ లేరు కాబట్టి ఈ గ్రేడ్‌ను తీసివేయాలని నిర్ణయించినట్లు దేవజిత్ సైకియా తెలిపారు.

**వన్డేల్లో మాత్రమే**

కాగా గతేడాది ప్రకటించిన సెంట్రల్ కాంట్రాక్టుల్లో మాజీ కెప్టెన్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మలతో పాటు.. ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా, పేస్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా మాత్రమే ఏ ప్లస్ గ్రేడ్ లో ఉన్నారు. వీరిలో కోహ్లి, రోహిత్ ఇప్పటికే అంతర్జాతీయ టీ20లు, టెస్టుల నుంచి రిటైర్ అయ్యారు.

మరోవైపు.. జడేజా కూడా పొట్టి ఫార్మాట్‌కు వీడ్కోలు పలికి కేవలం వన్డే, టెస్టులు ఆడుతున్నాడు. ఇక బుమ్రా మూడు ఫార్మాట్లు ఆడుతున్నా పనిభారం తగ్గించుకునే క్రమంలో అతడు ఎక్కువసార్లు విశ్రాంతి పేరిట జట్టుకు దూరంగానే ఉంటున్నాడు. అయితే, టెక్నికల్గా మాత్రం మూడు ఫార్మాట్లు ఆడుతున్నట్లే లెక్క. ఈ క్రమంలో రో–కోలతో పాటు జడ్డూకు వార్షిక కాంట్రాక్ట్ తగ్గించేందుకు బీసీసీఐ నిర్ణయం తీసుకుంది. బుమ్రాకు ఏ ప్లస్ గ్రేడ్ మాదిరే రూ. 7 కోట్లు జీతంగా ఇచ్చేందుకు బీసీసీఐ సిద్ధంగా ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. కాగా ఏ గ్రేడ్లో ఉన్న ఆటగాళ్లకు రూ. 5 కోట్లు, బీ గ్రేడ్లో ఉన్న ఆటగాళ్లకు రూ.3 కోట్లు. అదే విధంగా సీ గ్రేడ్లో ఉన్న ఆటగాళ్లకు రూ. కోటి వార్షిక వేతనంగా బీసీసీఐ చెల్లిస్తోంది. ఏ ప్లస్ గ్రేడ్ తీసేసిన నేపథ్యంలో రో–కోలను బీ గ్రేడ్‌లో పెడతారనే వార్తలు వస్తున్నాయి. ఏం జరుగుతుందో చూడాలి.



## టీమిండియా ఐదుగురు స్పెషలిస్ట్

# బౌలర్లను ఆడించాలి



*త్వరలో జరగనున్న టీ 20 వరల్డ్‌కప్‌లో టీమిండియా ఐదుగురు స్పెషలిస్ట్ బౌలర్లతో ఆడాలని మాజీ క్రికెటర్ హర్భజన్ సింగ్ సూచించాడు. ఒక కార్యక్రమంలో హర్భజన్ మాట్లాడుతూ బ్యాటర్లు బహుశా మ్యాచుల్ని గెలిపిస్తారేమో.. కానీ బౌలర్లు టోర్నమెంట్లనే గెలిపిస్తారన్నారు. కుల్‌దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి జోడీని కచ్చితంగా వరల్డ్ కప్ ఆడించాలి. వీరు బ్యాటర్ల భాగస్వామ్యాలను సమర్థంగా విడగొడతారు. మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పేస్తారు. రాయపూర్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన రెండో టీ 20లో తేమ పరిస్థితుల్లో, ఫ్లాట్ పిచ్ మీద కుల్‌దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి.. ఇద్దరూ అద్భుతంగా బౌలింగ్ చేశారని హర్భజన్ సింగ్ కొనియాడాడు. ఈ మ్యాచ్‌లో వారిద్దరూ 70 పరుగులిచ్చి మూడు వికెట్లు కూల్చారు. కుల్దీప్ యాదవ్ 35 రన్స్ ఇచ్చి రెండు వికెట్లు తీసుకుంటే, వరుణ్ చక్రవర్తి కూడా అన్నే పరుగులిచ్చి ఒక వికెట్ తన ఖాతాలో వేసుకున్నాడు. జస్ప్రీత్ బుమ్రా, అర్షదీప్ సింగ్, హర్షిత్ రాణా, కుల్‌దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి.. ఈ ఐదుగురూ నిజమైన వికెట్ టేకర్స్, 8 మంది బ్యాటర్లతో భారత్ బరిలోకి దిగాల్సిన అవసరం లేదు. ఒకవేళ త్వరగా వికెట్లు పడ్డా.. బ్యాటింగ్ డెప్త్ వల్ల తేలిగ్గా 14 నుంచి 15 ఓవర్లకు వరకు మ్యానేజ్ చేయొచ్చు. ప్రయోగాలు హోం సిరీస్‌ల్లో చేసుకోవచ్చు. కానీ.. అంతర్జాతీయ టోర్నమెంట్లలో బ్యాలెన్స్ ఉండాలి. మ్యాచ్ విన్నర్లనే ఆడించాలని హర్భజన్ సింగ్ తేల్చి చెప్పాడు.*

చైతన్య రథం సినిమా

ఆదివారం 25 జనవరి 2026



# సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో నారా రోహిత్

కృష్ణాజిల్లా మోపిదేవిలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి పుణ్యక్షేత్రాన్ని ప్రముఖ సినీ నటుడు నారా రోహిత్ శనివారం సందర్శించారు. ఆలయ సిబ్బంది, స్థానిక నేతలు ఆయనకు స్వాగతం పలికి స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుని నారా రోహిత్ ప్రత్యేక పూజలు చేశారు. నిర్మాత అట్లూరి నారాయణతో కలిసి నూతన రథ కలశానికి అభిషేకాలు చేశారు. అనంతరం రథాన్ని రోహిత్ ప్రారంభించారు. రోహిత్‌కు అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

# డిసెంబర్ 24న షారుక్ 'కింగ్'




'పఠాన్' తర్వాత హీరో షారుక్ ఖాన్ – డైరెక్టర్ సిద్ధార్థ్ ఆనంద్ కాంబినేషన్లో తెరకెక్కుతున్న చిత్రం 'కింగ్. ఈ యాక్షన్ థ్రిల్లర్ మూవీ విడుదల తేదీ శనివారం ఖరారైంది. డిసెంబరు 24న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు ప్రకటిస్తూ.. సినిమా నిర్మాతలు ఓ వీడియోను విడుదల చేశారు. విజువల్స్, షారుక్ ఎంట్రీ ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ సినిమాలో షారుక్ తనయ సుహానా కీలక పాత్ర పోషిస్తుండటం విశేషం.

# హీరోలుగా దర్శకులు



'ఖైదీ', 'విక్రమ్' తదితర చిత్రాలతో తెలుగు ప్రేక్షకులనూ థ్రిల్ చేసిన కోలీవుడ్ డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ ఇప్పుడు హీరోగా మారారు. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'డీసీ'. వామికా గబ్బీ హీరోయిన్. అరుణ్ మాథేశ్వరన్ దర్శకత్వం వహిస్తున్నారు. రొమాంటిక్ యాక్షన్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది.

ఇలా ఉంటే మరో దర్శకుడు కూడా హీరోగా మారాడు. 'టూరిస్ట్ ఫ్యామిలీ'తో ప్రేక్షకులతోపాటు సినీ ప్రముఖుల దృష్టిని ఆకర్షించిన మలయాళ దర్శకుడు అభిషన్ జీవింత్. ఆ మూవీలో ఓ పాత్ర పోషించిన ఆయన.. తాజాగా 'విత్ లవ్' సినిమాతో హీరోగా మారారు. ఈ రొమాంటిక్ డ్రామాలో అనస్వర రాజన్ హీరోయిన్. మదన్ దర్శకుడు. ఈ సినిమా ఫిబ్రవరి 6న తెలుగులోనూ విడుదల కానుంది.

## తొలిరోజు వసూళ్లు..

# దురంధర్‌ను దాటేసిన బోర్డర్–2



దేశభక్తి నేపథ్యంలో సన్నీ డియోల్ ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'బోర్డర్ 2' తొలిరోజు కలెక్షన్ల విషయంలో 'దురంధర్'ను బీట్ చేసింది. శుక్రవారం విడుదలైన 'బోర్డర్ 2' తొలి రోజు.. భారతీయ బాక్సాఫీసు వద్ద రూ.32 కోట్లకు పైగా (నెట్) కలెక్షన్లు రాబట్టింది.. 'దురంధర్' తొలిరోజు కలెక్షన్లు రూ.28.60 కోట్లు (నెట్) కాగా దానిని బోర్డర్–2 అధిగమించింది. సన్నీ డియోల్, వరుణ్ ధావన్, దిల్జిత్ దోసాంజ్, అహాన్ శెట్టి ప్రధాన పాత్రల్లో 'బోర్డర్ 2'ను అనురాగ్ సింగ్ తెరకెక్కించారు. 1971 ఇండో పాక్ యుద్ధం నేపథ్యంలో జేపీ దత్తా తెరకెక్కించిన 'బోర్డర్'కు కొనసాగింపుగా వచ్చింది. ఈ సీక్వెల్ 28 ఏళ్ల తర్వాత వచ్చినా ప్రేక్షకాదరణ పొందడం విశేషం. ఈ సినిమా 1971 యుద్ధం తర్వాత జరిగిన మరో కీలకమైన సరిహద్దు పోరాటం చుట్టూ తిరుగుతుంది. మొదటి భాగంలో కేవలం ఆర్మీ పోరాటాన్ని మాత్రమే చూపిస్తే.. ఈసారి ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ సంయుక్తంగా చేసిన త్రిముఖ పోరును కళ్లకు కట్టినట్లు ఉద్వేగభరితంగా చూపించారు.

వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన స్పై యాక్షన్ థ్రిల్లర్ 'దురంధర్' రికార్డులు సృష్టించిన సంగతి తెలిసిందే. గతేడాది డిసెంబరు 5న విడుదలైన ఈ సినిమా రూ.1300 కోట్లకు పైగా వసూళ్లు రాబట్టింది. అత్యధిక వసూలు చేసిన బాలీవుడ్ చిత్రాల జాబితాలో రెండో స్థానం, అత్యధిక కలెక్షన్లు రాబట్టిన భారతీయ సినిమాల జాబితాలో నాలుగో స్థానంలో నిలిచింది. తొలిరోజు కలెక్షన్ల హవాని బట్టి 'ధురంధర్' రికార్డును 'బోర్డర్ 2' అధిగమించే అవకాశాలున్నాయని సినీ వర్గాల విశ్లేషణ.

# 29 నుంచి ఓటీటీలో 'ఛాంపియన్'



రోషన్ హీరోగా తెరకెక్కిన పీరియాడిక్ యాక్షన్ మూవీ 'ఛాంపియన్'. 2025 డిసెంబరులో బాక్సాఫీసు ముందుకొచ్చి సందడి చేసిన ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీ ఖరారయింది. ఈ నెల 29 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో ఈ సినిమా స్ట్రీమింగ్ కానుంది. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అనస్వర రాజన్, అవంతిక, హైపర్ ఆది, తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఇందులోని 'గిర గిర గింగిరాగిరే పాట విశేషంగా అలరించిన సంగతి తెలిసిందే.

కథ విషయానికి వస్తే.. 1947 ఆగస్టు 15న దేశానికి స్వాతంత్య్రం వచ్చినప్పటికీ హైదరాబాద్ సంస్థానం నిజాం నిరంకుశ పాలనలో మగ్గిపోతున్న రోజులవి. రజాకార్ల దౌర్జన్యాలకు తెలంగాణ పల్లెలన్నీ చిగురుటాకులా వణికిపోతుండగా.. బైరాన్‌పల్లి లాంటి కొన్ని ఊళ్లు మాత్రం వీరోచితంగా పోరాడుతూ అందరిలో స్వాతంత్ర్య కాంక్ష రగిలించే ప్రయత్నం చేస్తుంటాయి. అదే సమయంలో సికింద్రాబాద్‌కు చెందిన ఆంగ్లో ఇండియన్ కుర్రాడు మైఖేల్ సి. విలియమ్స్ (రోషన్) ఫుట్‌బాల్ ఆటగాడిగా ఎంతో పేరు తెచ్చుకుంటాడు. తన ప్రతిభతో ఇంగ్లాండ్ మాంచెస్టర్ ఫుట్‌బాల్ క్లబ్‌లో ఆడే అవకాశాన్ని అందుకుంటాడు. కానీ, మైఖేల్ తండ్రి నేపథ్యం కారణంగా తను లీగల్ గా ఆ దేశానికి వెళ్లే దారులు మూసుకుపోతాయి. దీంతో ఎలాగైనా 20 రోజుల్లో ఇంగ్లాండ్‌కు వెళ్లాలనుకు. అక్రమ మార్గం ఎంచుకుంటాడు. కానీ, దారితప్పి బైరాన్‌పల్లికి వెళతాడు? దానికి కారణమేంటి? ఆ ఊరి వాళ్లతో కలిసి రజాకార్లపై పోరుకు ఎందుకు సిద్ధమయ్యాడు? బైరాన్‌పల్లి గ్రామస్థుల పోరాటాన్ని అణగదొక్కి.. వాళ్లను అంతం చేసేందుకు ఖాసిం రజ్వీ రంగంలోకి దింపిన బాబు దేశముఖ్ (సంతోష్ ప్రతాప్)తో మైఖేల్‌కు ఉన్న విరోధం ఏంటి? అన్నది మిగతా కథ.

## తాత వయసున్న వారితో

# చేదు అనుభవం..

హర్యానాలోని కర్నాల్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో తనకు ఒక చేదు అనుభవం ఎదురయిందని బాలీవుడ్ నటి మౌనీరాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ వేడుకలో కొందరు ఫొటోల పేరుతో తనపై వేధింపులకు పాల్పడ్డారని తెలిపారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్టు పెట్టారు. కర్నాల్‌లో జరిగిన ఈవెంట్లో తాత వయసున్న ఇద్దరు అతిథులు నాతో అసభ్యంగా ప్రవర్తించారు. ఆ సమయంలో వారిపై అసహ్యం కలిగింది. వేదిక పైకి వెళు తుండగా ఆ ఇద్దరు, వారి కుటుంబ సభ్యులు (పురుషులు) ఫొటోల పేరుతో నా నడుముపై చేతులు వేశారు. వెంటనే 'సర్ దయచేసి మీ చేతులు తీయండి' అని విజ్ఞప్తి చేశా. అయినా వారి ప్రవర్తన మారలేదు. స్టేజ్‌పై ఉండగా ఇద్దరు అంకుల్స్ అసభ్యకర రీతిలో సైగలు చేస్తూ ఇబ్బంది పెట్టారు. లో యాంగిల్ లో వీడియోలు తీశారు. దీంతో ప్రదర్శనను అనుకున్న సమయానికన్నా ముందే ముగించేయాల్సి వచ్చింది. ఇంత జరిగినా వారి కుటుంబ సభ్యులుగానీ ఈవెంట్ ఆర్గనైజర్లుగానీ ఆపే ప్రయత్నం చేయలేదు. నాలాంటి వారికే ఇలా జరిగితే కొత్తగా పరిశ్రమలోకి వచ్చే వారి అమ్మాయిల పరిస్థితి ఎలా ఉంటుందో ఊహించండి. అక్కడ నాకు అవమానంగా అనిపించింది. ఈ ఘటనపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నా అని మౌనీరాయ్ పేర్కొన్నారు. మేం నిజాయతీగా పనిచేస్తూ సంపాదించుకునే కళాకారులం. మరొకరి సెలబ్రేషన్స్‌లోనూ భాగం అవుతుంటాం. అయితే, మేం వారి అతిథులమైనా.. వారు మాత్రం మమ్మల్ని ఇలా వేధించడం ఎంతవరకు సమంజసమని ఆవేదన వ్యక్తం చేశారు. 'నాగిని' సీరియల్ తో మంచి గుర్తింపు తెచ్చుకున్న మౌనీరాయ్.. 'గోల్డ్', 'మేడిన్ చైనా', 'బ్రహ్మాస్త్ర', 'ది భూత్నీ' తదితర చిత్రాల్లో నటించారు. 'రన్', 'కేజీయఫ్ 1' (కన్నడ), 'వేదా' లాంటి సినిమాల్లో ప్రత్యేక గీతాలతో విశేష క్రేజ్ పొందారు.



చిరంజీవి హీరోగా వశిష్ఠ తెరకెక్కిస్తున్న 'విశ్వంభర'లోని స్పెషల్ సాంగ్‌లో కూడా మౌనీ కనిపించనున్నారు.